మంగళవారం | 1•10•2019
కరీంనగర్ • వెల. రూ. 6.50
మన రాష్ట్రం • మన పత్రిక

# నమస్తే తెలంగాణ

• సంపుటి 9 • సంచిక 97 • పేజీలు : 14 + 16
PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD
WWW. NTNEWS.COM /NTDAILYONLINE



రాజ్‌భవన్‌లో బతుకమ్మ సంబురాల్లో గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్




## వరదల్లో చిక్కుకున్న బీహార్ డిప్యూటీ సీఎం

- మూడురోజులుగా ఇంటికే పరిమితమైన సుశీల్ మోదీ
- ఎట్టకేలకు సుశీల్, కుటుంబసభ్యులను సురక్షిత ప్రాంతానికి తరలించిన ఎన్డీఆర్‌ఎఫ్ సిబ్బంది
- కొనసాగుతున్న వరద బీభత్సం
- 134 దాటిన మృతుల సంఖ్య
- వర్షపు నీటిలో యూపీ బలియా జిల్లా కారాగారం
- 900 మంది ఖైదీల తరలింపు

III



సోమవారం పాట్నాలోని రాజేంద్రనగర్‌లో బీహార్ ఉపముఖ్యమంత్రి సుశీల్ మోదీ ఇంటి నుంచి ఆయనతో పాటు కుటుంబ సభ్యులను వరదనీటిలో తరలిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్ బృందం

# వృద్ధిరేటు కటకటా!



ఆర్థికంపై డేంజర్‌బెల్స్!

మూడున్నరేండ్ల కనిష్ఠానికి 8 కీలక రంగాలు

ఆగస్టులో 0.5 శాతానికి పతనం

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** ఆర్థిక మాంద్యంతో సతమతమవుతున్న కేంద్ర ప్రభుత్వానికి మరో షాక్ తగిలింది. ఆగస్టు నెలకుగాను ఎనిమిది కీలక రంగాల ప్రదర్శన మూడున్నరేండ్ల కనిష్ఠానికి పతనమై 0.5 శాతానికి దిగజారింది. బొగ్గు, క్రూడాయిల్, సహజ వాయువు, సిమెంట్, విద్యుత్ రంగాల్లో ఉత్పత్తి భారీగా పడిపోవడమే ఇందుకు కారణమని సోమవారం విడుదలైన ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి. గతేడాది ఆగస్టులో ఈ ఎనిమిది (బొగ్గు, ముడిచమురు, సహజవాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, ఎరువులు, స్టీల్, సిమెంట్, విద్యుత్) రంగాల్లో నమోదైన 4.7 శాతం వృద్ధితో పోలిస్తే ఈసారి వృద్ధి భారీగా తగ్గింది. నవంబర్ 2015లో నమోదైన (–) 1.3 శాతం తర్వాత ఇదే కనిష్ఠ స్థాయి. ఆగస్టులో బొగ్గు రంగంలో 8.6 శాతం, క్రూడాయిల్ రంగంలో 5.4 శాతం, సహజవాయు రంగంలో 3.9 శాతం, సిమెంట్ రంగంలో 4.9 శాతం, విద్యుత్ రంగంలో 2.9 శాతం ప్రతికూల వృద్ధి నమోదయిందని, ఇదే సమయంలో ఎరువులు, స్టీల్ రంగాలు మాత్రం ఆశాజనక పనితీరును కనబర్చాయని కేంద్ర వాణిజ్య, పరిశ్రమలశాఖ గణాంకాలు స్పష్టంచేస్తున్నాయి. గతేడాది 5.1 శాతం వృద్ధిని నమోదు చేసుకున్న రిఫైనరీ ఉత్పత్తుల్లో ఈసారి వృద్ధి 2.6 శాతానికి పరిమితమైంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్–ఆగస్టు మధ్యకాలంలో ఎనిమిది కీలక రంగాల్లో వృద్ధి 2.4 శాతంగా నమోదైంది. గతేడాది ఇదే సమయంలో ఈ వృద్ధి 5.7 శాతంగా ఉన్నది.

## నేడు రాష్ట్ర క్యాబినెట్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర మంత్రివర్గ సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అధ్యక్షతన ప్రగతిభవన్‌లో జరిగే ఈ సమావేశంలో ఆర్టీసీలో తాజా పరిణామాలపై చర్చించే అవకాశం ఉన్నట్టు తెలుస్తున్నది. అలాగే ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలతో పాటు, సెక్రటేరియట్‌ను పూర్తిగా ఖాళీచేసిన నేపథ్యంలో నూతన సచివాలయం నిర్మాణానికి సంబంధించిన అంశంపై కూడా చర్చించే అవకాశం ఉన్నట్టు సమాచారం.

## పరిశుభ్రంగా పల్లెలు

30 రోజుల ప్రణాళికతో తొలగిపోతున్న సమస్యలు




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ :** 30రోజుల ప్రణాళిక పనులు గ్రామీణప్రాంతాల్లో మార్పును తెస్తున్నాయి. పల్లెల్లో తిష్ఠవేసిన సమస్యలు మూకుమ్మడిగా చేపడుతున్న శ్రమదానం కార్యక్రమాలతో తొలగిపోతున్నాయి. మరో ఐదురోజుల్లో 30 రోజుల కార్యాచరణ ముగుస్తుండగా ఇదే స్ఫూర్తితో వార్షిక ప్రణాళికలు రూపొందుతున్నాయి. 25 రోజులుగా జరుగుతున్న కార్యక్రమాలతో గ్రామాలన్నీ పరిశుభ్రంగా మారుతున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులతోపాటు గ్రామాల్లోని మహిళలు, యువత పెద్దఎత్తున శ్రమదానం కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. దసరా సెలవులకు ఊరికి వచ్చిన

మిగతా 5వ పేజీలో

# వందేండ్ల రికార్డు వాన

సెప్టెంబర్ నెలలో దంచికొట్టింది

ఒక్క నెలలోనే 247 మిల్లీమీటర్ల వర్షపాతం

సగటు వర్షపాతం కంటే 48% అధికం

**1994 తర్వాత 'భారీ వానాకాలం'.. సాధారణస్థాయికి మించిన వానలు**

**అధికారికంగా ముగిసిన వానాకాలం.. అయినా చురుకుగానే రుతుపవనాలు**

**నాలుగైదు రోజుల్లో పూర్తిగా ఉపసంహరణ**

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** ఈ వానాకాలంలో దేశంలో వర్షాలు దంచికొట్టాయి. దాదాపు వారంరోజులు ఆలస్యంగా దేశంలోకి ప్రవేశించిన రుతుపవనాలు.. మొదట్లో మందగమనంతో సాగి.. తీవ్ర అనుమానాలు రేకెత్తించినా, తర్వాతి నెలల్లో పుంజుకొని దేశమంతటా విస్తారంగా వానలు కురిపించాయి. పలురాష్ట్రాలు ప్రత్యేకించి ఉత్తరాది రాష్ట్రాలు భారీవరదలను చవిచూశాయి. 1994 తర్వాత అంటే.. సుమారు 25 ఏండ్లలో వానాకాలం సీజన్ (జూన్–సెప్టెంబర్)లో ఇంతస్థాయిలో వర్షాలు నమోదుకావడం ఇదే ప్రథమమని భారత వాతావరణ విభాగం ప్రకటించింది. అంతేకాకుండా.. 1901 నుంచి పోల్చితే.. మూడో గరిష్ఠ వర్షపాతంగా భారత వాతావరణ విభాగం రికార్డులు పేర్కొంటున్నాయి. ప్రత్యేకించి సెప్టెంబర్ మాసంలో అనేకచోట్ల కుండపోత వర్షాలు కురిశాయి. ఈ సీజన్ సెప్టెంబర్‌లో గత 102 ఏండ్లలో ఎన్నడూ లేనంతస్థాయిలో గరిష్ఠ వర్షపాతం నమోదైంది. ఫలితంగా

మిగతా 4వ పేజీలో



సోమవారం మహబూబాబాద్‌లో భారీ వర్షానికి ప్రధాన రహదారిపై నిలిచిన నీరు

### జగిత్యాల జిల్లాలో భారీ వర్షం

మేడిపల్లిలో 11.3 సెం.మీ.

హైదరాబాద్ పలుచోట్ల జోరువాన

మాదాపూర్, శేరిలింగంపల్లిలో 7.2 సెం.మీ

మహబూబాబాద్ జిల్లాలో పిడుగుపాటుకు వ్యక్తి మృతి

భూపాలపల్లిలో నిలిచిపోయిన బొగ్గు ఉత్పత్తి

9

## నాలుగున్నర వేల కోట్ల నష్టం!

8

11 ఏండ్లుగా పీఎంసీలో అక్రమాలు

బ్యాంక్ పెద్దలతో హెచ్‌డీఐఎల్ ప్రమోటర్ల కుమ్మక్కు

ఎఫ్‌ఐఆర్ నమోదు చేసిన పోలీసులు

పీఎంసీ బోర్డును రద్దు చేసిన ఆర్బీఐ

## నీలోఫర్ క్లినికల్ ట్రయల్స్‌పై విచారణ పూర్తి

వైద్యులతో భేటీ అయిన త్రిసభ్య కమిటీ

2



గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా అంబాజీ-దంత రహదారి కొండ మార్గంలో బోల్తా పడిన బస్సు

## అదుపు తప్పి బస్సు బోల్తా

21 మంది మృతి

గుజరాత్‌లో ఘటన

ఆలయాన్ని సందర్శించుకుని తిరిగి వెళ్తుండగా విషాదం

4

| చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.) | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 79.00 | రిటైల్ లైవ్ | 101.00 |
| డ్రెస్‌డ్ | 146.00 | స్కిన్‌లెస్ | 167.00 |

| గుడ్ల ధరలు (వందకు) (రూ.) | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 405.00 | రంగారెడ్డి | 405.00 |
| మెదక్ | 405.00 | కరీంనగర్ | 408.00 |
| వరంగల్ | 408.00 | చిల్లర ధర | 4.65 |




హుజూర్‌నగర్ ఉప ఎన్నికకు నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ చంద్రయ్యకు అందజేస్తున్న టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి. చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య యాదవ్ ఉన్నారు.

# హుజూర్‌నగర్ బరిలో 119 మంది

ముగిసిన నామినేషన్ల పర్వం

అక్టోబర్ 3 నామినేషన్ల ఉపసంహరణకు గడువు

**టీఆర్‌ఎస్ గెలిస్తే ప్రజలు గెలిచినట్టే.. ఎడమకాల్వ రైతులను ఏడిపించిన ఉత్తమ్**

**ఆయన కుటుంబాన్ని ఓడిస్తేనే నియోజకవర్గ అభివృద్ధికి మార్గం: మంత్రి జీ జగదీశ్‌రెడ్డి**

**హుజూర్‌నగర్ టీఆర్‌ఎస్ అభ్యర్థిగా నామినేషన్ వేసిన సైదిరెడ్డి**

**సూర్యాపేట ప్రతినిధి/ హుజూర్‌నగర్, నమస్తే తెలంగాణ:**

హుజూర్‌నగర్ ఉప ఎన్నికకు మొత్తం 119 నామినేషన్లు దాఖలయ్యాయి. చివరిరోజైన సోమవారం 103 నామినేషన్లు వచ్చాయి. మంగళవారం నామినేషన్లు పరిశీలిస్తారు. అక్టోబర్ 3 నామినేషన్ల ఉపసంహరణకు గడువు. బరిలోనిలిచే అభ్యర్థుల తుది జాబితాను అదే రోజు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ప్రకటిస్తారు. చివరిరోజైన సోమవారం టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి నామినేషన్ దాఖలుచేశారు. స్థానిక టీఆర్‌ఎస్ కార్యాలయం నుంచి పబ్లిక్‌క్లబ్ వరకు మంత్రి జగదీశ్‌రెడ్డి, ఉప ఎన్నిక ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్య యాదవ్, ఎమ్మెల్సీ తేరా చిన్నపరెడ్డి, మాజీ ఎమ్మెల్యే చందర్‌రావు, పార్టీ శ్రేణులతో కార్లలో సైదిరెడ్డి ర్యాలీగా వచ్చారు. ఆర్వో చంద్రయ్యకు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆ సమయంలో సైదిరెడ్డి వెంట మంత్రి జీ జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, బొల్లం మల్లయ్యయాదవ్ ఉన్నారు. అనంతరం మీడియాతో మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ, ఉపఎన్నికలో టీఆర్‌ఎస్ గెలిస్తే హుజూర్‌నగర్ ప్రజలు గెలిచినట్టేనని, ఉత్తమ్ కుటుంబాన్ని ఓడిస్తేనే నియోజకవర్గ అభివృద్ధికి దారులు పడుతాయని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా టీఆర్‌ఎస్‌కు సానుకూల పవనాలు వీస్తున్నాయని, హుజూర్ నగర్‌లో టీఆర్‌ఎస్‌ను గెలిపించుకోవాలని ప్రజలు ఆరాటపడుతున్నారని చెప్పారు. ఉత్తమ్ ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న 20 ఏండ్లలో సాగర్ ఎడమకాల్వ కింద పంటపొలాలను ఎండబెట్టారని, ఎడమకాల్వకు నీటిని ఇవ్వాలని ఎన్నడూ పోరాటం చేయలేదని విమర్శించారు. కానీ.. సాగర్‌లో డెడ్‌స్టోరేజీ ఉన్నా పంటలకు నీటిని అందించిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానిదని చెప్పారు. తెలంగాణ

మిగతా 2వ పేజీలో

మందుల కుంభకోణం

# మరో పెద్దచేప చిక్కింది!

సీనియర్ అసిస్టెంట్ సురేంద్రనాథ్ అరెస్ట్.. తప్పుడు బిల్లుల కోసం వైద్యురాలిపై ఒత్తిడి

వెలుగులోకి వచ్చిన ఆడియో క్లిప్పులు.. వెయ్యికోట్ల కుంభకోణం?.. లోతైన విచారణ జరుపుతున్న ఏసీబీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న ఇన్సూరెన్స్ మెడికల్ సర్వీసెస్ (ఐఎంఎస్) మందుల కొనుగోళ్ల కుంభకోణంలో తాజాగా మరో పెద్దచేప చిక్కింది. ఈఎస్‌ఐకి సరఫరాచేసే మందుల కొనుగోళ్లకు సంబంధించి వెలుగులోకి వచ్చిన ఆడియో క్లిప్పుల నేపథ్యంలో ఆర్సీపురం ఈఎస్‌ఐ దవాఖాన సీనియర్ అసిస్టెంట్ ముదిమెల సురేంద్రనాథ్‌బాబును ఏసీబీ అధికారులు సోమవారం అరెస్టుచేశారు. తప్పుడు బిల్లులు పెట్టాలంటూ ఈఎస్‌ఐ డాక్టర్లపై సెక్షన్ ఆఫీసర్ సురేంద్రనాథ్ ఒత్తిడి చేస్తున్నట్లు ఆడియో క్లిప్పుల ద్వారా వెల్లడైంది. మెడికల్ క్యాంపు పేరుతో రూ.10 లక్షల విలువచేసే మందులు పంపినట్లు రికార్డులు సృష్టించాలని ఓ మహిళా వైద్యురాలిపై సురేంద్రనాథ్ ఒత్తిడిచేస్తున్నట్టు ఆ సంభాషణల్లో ఉన్నది. తప్పుడు బిల్లులు తయారుచేసేందుకు సదరు మహిళా వైద్యురాలు అంగీకరించకపోవడంతో సురేంద్రనాథ్ ఆమెను బెదిరిస్తూ మాట్లాడాడు. దీని ఆధారంగా అవినీతి, చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడిన నేరానికిగాను సురేంద్రనాథ్‌ను అరెస్టుచేశారు. ఇప్పటికే ఈ కేసులో ఐఎంఎస్ డైరెక్టర్ దేవికారాణి, జేడీ పద్మ, ఏడీ ఇందిర సహా ఏడుగురిని అరెస్టు చేయగా.. వారికి ఏసీబీ కోర్టు 14రోజుల రిమాండ్ విధించిన సంగతి తెలిసిందే.



సురేంద్రనాథ్ బాబు

**వెయ్యికోట్ల అక్రమాలు..!**

ఐఎంఎస్‌లో మందుల కొనుగోళ్ల రూపంలో సుమారు వెయ్యికోట్ల రూపాయలకుపైగా అక్రమాలు జరిగినట్లు తెలుస్తున్నది. తొలుత రూ.200 కోట్ల వరకు ఉంటుందని అనుకున్నా.. దర్యాప్తు లోతుగా జరుగుతున్నకొద్దీ అక్రమాల చిట్టా కూడా పెరుగుతూ పోతున్నది. కనీసంగా రూ.700–800 కోట్ల వరకు అక్రమాలు జరిగి ఉంటాయని, వెయ్యికోట్లు దాటినా ఆశ్చర్యపోనక్కర్లేదని ఓ సీనియర్ అధికారి చెప్పారు. ఇదంతా వ్యవస్థీకృతంగా చేశారని, దీన్ని వెలికితీయడం ఏసీబీకి నిజంగా పెద్ద సవాలేనని ఈఎస్‌ఐలో పనిచేసి రిటైర్ అయిన అధికారి ఒకరు అభిప్రాయపడ్డారు. మందుల కొనుగోళ్లలో అక్రమాలు బయటకు పొక్కకుండా ఉండేందుకు ఇక్కడ పనిచేసే ఉద్యోగులు ఎవ్వరినీ ఇన్‌వాల్వ్ చేయలేదని, అధికారులు, కొంతమంది సిబ్బంది, ప్రైవేటు వ్యక్తులు సిండికేట్‌గా మారి వ్యవహారాన్ని నడిపించారని తెలుస్తున్నది.


**ఆడిటింగ్‌లేదు.. అధికారుల తిష్ఠ!**

ఎప్పటికప్పుడు ఆడిటింగ్ లేకపోవడం, ఏండ్ల తరబడి ఒకేపోస్టులో అధికారులు మకాంవేయడం ఐఎంఎస్‌లో అక్రమాలకు ఊతమిచ్చిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. బాధ్యతాయుతంగా

మిగతా 2వ పేజీలో

# రైతు సమాధి యత్నం

ధర్మగంట



మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలంలోని రామన్నగూడెంలో సజీవ సమాధికి సిద్ధమైన రైతు సుధాకర్‌రెడ్డి

- కలెక్టర్ ఆదేశంతో వన్‌బీ.. రైతుబంధుకు ఓకే
- పాస్‌బుక్కు ఇవ్వకుండా మండల అధికారుల సతాయింపు
- వ్యవసాయభూమిలో సగం పూడ్చుకుని ఆత్మహత్యాయత్నం
- సర్పంచ్ భరోసాతో బయటకు వచ్చిన రైతు
- తీరా వన్‌బీలో చూస్తే నాలుగున్నర ఎకరాలు మాయం
- రెవెన్యూ కార్యాలయంలోనే స్పృహ తప్పిపడిపోయిన బాధితుడు

**వారసత్వంగా** వచ్చిన వాటాకు సంబంధించి కలెక్టర్ ఆదేశాలతో వన్‌బీలో పేరు నమోదయింది.. రైతుబంధు వచ్చింది.. కానీ, మండల రెవెన్యూ అధికారులు మాత్రం పాస్‌పుస్తకం ఇవ్వకుండా సతాయించారు. కార్యాలయం చుట్టూ తిరిగినా స్పందన లేకపోవడంతో ఓ రైతు తన వ్యవసాయభూమిలోనే గుంత తీసుకుని అందులోనే సజీవ సమాధి అయ్యేందుకు యత్నించాడు. తాసిల్దార్‌తో మాట్లాడి సమస్య పరిష్కరిస్తాననే సర్పంచ్ హామీతో బయటకువచ్చిన ఆయన మొత్తం 5.26 ఎకరాలకు గాను వన్‌బీలో తాజాగా 1.06 ఎకరాలు మాత్రమే ఉండటం చూసి రెవెన్యూ కార్యాలయంలోనే స్పృహతప్పి పడిపోయాడు. మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలం రామన్నగూడెం రైతు సుధాకర్‌రెడ్డి దీనగాథ ఇదీ..

వివరాలు 7వ పేజీలో

# జోక్యం చేసుకోలేం..

**ఇంటర్ ఫలితాలే విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమని నిర్ధారించలేం: సుప్రీంకోర్టు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంటర్మీడియట్ ఫలితాల వల్లే విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఎలా నిర్ధారిస్తామని సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాష్ట్రంలో ఇంటర్ విద్యార్థుల ఆత్మహత్యలపై బాలల హక్కుల సంఘం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టేసింది. ఆత్మహత్యలపై తెలంగాణ హైకోర్టు ఇప్పటికే తీర్పును వెలువరించిందని, అందులో జోక్యం చేసుకోలేమని జస్టిస్ నవీన్‌సిన్హా, జస్టిస్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టంచేసింది. ఇదే అంశంపై ఇదివరకే దాఖలైన మరో పిటిషన్‌ను కొట్టేసినట్టు సుప్రీంకోర్టు గుర్తుచేసింది.



రాజ్‌భవన్‌లో మహిళలతో కలిసి బతుకమ్మ ఆడుతున్న గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్

## బతుకమ్మ ఆడిన గవర్నర్ తమిళిసై

**రాజ్‌భవన్‌లో 5 వరకు సంబురాలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాజ్‌భవన్‌లో బతుకమ్మ సంబురాలను గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్ సోమవారం సాయంత్రం ప్రారంభించారు. గవర్నర్ స్వయంగా మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. ఆవుల మంజులత, దీపికారెడ్డి, ఐనంపూడి శ్రీలక్ష్మి తదితరులు బతుకమ్మ ఆడారు. అక్టోబర్ 5 వరకు ప్రతిరోజు బతుకమ్మ వేడుకలు జరుగుతాయని, 1న మహిళా జర్నలిస్టులు, న్యాయవాదులు, 4న విద్యార్థులు, 5న రాజ్‌భవన్ మహిళా ఉద్యోగులతో సంబురాలు జరుగుతాయని గవర్నర్ కార్యదర్శి సురేంద్రమోహన్ తెలిపారు.



సోమవారం ఢిల్లీలో పరిశ్రమల శాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన టీఆర్‌ఎస్ పార్లమెంటరీ పార్టీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ కే కేశవరావు





హైకోర్టు-ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్ మధ్య షటిల్ బస్‌ను ప్రారంభిస్తున్న చీఫ్ జస్టిస్ ఆర్‌ఎస్ చౌహాన్

## హైకోర్టు- ఎంజీబీఎస్ మెట్రోస్టేషన్ మధ్య
# షటిల్ బస్సులు

- ప్రారంభించిన హైకోర్టు సీజే ఆర్‌ఎస్ చౌహాన్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** న్యాయవాదులు, కక్షిదారులకు అనుకూలంగా ఉండేలా హైదరాబాద్ మెట్రో రైల్ సంస్థ ఎంజీబీఎస్-హైకోర్టు మెట్రోస్టేషన్ మధ్య షటిల్ బస్సు సర్వీసులను ఏర్పాటుచేసింది. సోమవారం ఉదయం హైకోర్టు ఆవరణలో చీఫ్‌జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్ పూజలు నిర్వహించి, బస్సు సర్వీసులను ప్రారంభించారు. సోమవారం నుంచి శనివారం వరకు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రతి 15 నిమిషాలకు ఒక సర్వీసును నడుపుతారు. ఈ సందర్భంగా సీజే మాట్లాడుతూ.. రద్దీ వేళల్లో ఎక్కువ సర్వీసులను నడుపాలని, నగరంలోని ఇతర కోర్టులకు సమీపంలోని మెట్రోస్టేషన్ల నుంచి కూడా షటిల్ బస్సులను నడుపాలని హెచ్‌ఎంఆర్‌ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డికి సూచించారు. ట్రాఫిక్ సమస్య, కాలుష్య నియంత్రణకు ప్రజారవాణాను ఉపయోగించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ.. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలను ప్రవేశపెట్టి, ప్రజల్లో హరిత చైతన్యాన్ని పెంపొందించాలని సూచించారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి మాట్లాడుతూ.. మొదటివారం షటిల్ సర్వీసులను ఉచితంగా నడిపి, తర్వాత రూ.15 చార్జి వసూలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఏ రాజశేఖర్‌రెడ్డి, జస్టిస్ అభిషేక్‌రెడ్డి, జస్టిస్ చల్లా కోదండరాం, హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు టీ సూర్యకరణ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శులు రజినీకాంత్, ఎం సుదర్శన్, ఎల్‌అండ్‌టీ ఎండీ కేవీబీ రెడ్డి, అధికారులు అనిల్‌కుమార్ సైనీ, బాలకృష్ణ, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

# 10 నుంచి లాసెట్ కౌన్సెలింగ్

- అదేరోజు నుంచి వెబ్‌కౌన్సెలింగ్
- షెడ్యూల్ జారీచేసిన లాసెట్ కన్వీనర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** లాసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ఈ నెల 10 నుంచి ప్రారంభం కానున్నది. అదేరోజు నుంచి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలనతోపాటు వెబ్ కౌన్సెలింగ్ ప్రక్రియ మొదలవుతుంది. లా మూడేండ్లు, ఐదేండ్లతోపాటు, ఎల్‌ఎల్‌ఎంలో ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరుగుతుందని లాసెట్ కన్వీనర్ ప్రొఫెసర్ రమేశ్‌బాబు సోమవారం నోటిఫికేషన్ జారీచేశారు. మూడేండ్లకు 10న, ఐదేండ్లకు 13న ఉదయం తొమ్మిది గంటల నుంచి, ఎల్‌ఎల్‌ఎం అభ్యర్థులకు మధ్యాహ్నం 1 గంట నుంచి సర్టిఫికెట్ల పరిశీలిన, వెబ్ కౌన్సెలింగ్ జరుగుతుంది. కౌన్సెలింగ్ నిర్వహణకు జేఎన్టీయూహెచ్, నిజాం కాలేజీ, కేఎంఐటీ ఇంజినీరింగ్ కాలేజీ, కాకతీయ యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టరేట్‌లో సహాయ కేంద్రాలు ఏర్పాటుచేశారు. 10న ఎన్‌సీసీ, 11న క్యాప్, పీహెచ్‌సీ వారికి కౌన్సెలింగ్ ఉంటుంది. వీరి కోసం హైదరాబాద్ నిజాం కాలేజీలో, వరంగల్ కాకతీయ యూనివర్సిటీలో సహాయకేంద్రాలు ఏర్పాటుచేశారు. పూర్తి వివరాలకు lawcetadm.tsche.ac.in కు లాగిన్ కావచ్చని కన్వీనర్ సూచించారు.

**ముహూర్తం**

సూర్యోదయం: 6.07 గంటలకు

సూర్యాస్తమయం: 6.01 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, శుక్లపక్షం, తదియ మధ్యాహ్నం 1.54 వరకు, తదుపరి చతుర్థి, నక్షత్రం: స్వాతి మధ్యాహ్నం 2.20 వరకు, తదుపరి విశాఖ, అమృతఘడియలు: ఉదయం 6.19 నుంచి 7.46 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.02 నుంచి సాయంత్రం 4.32 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.30 నుంచి 9.17 వరకు, తిరిగి రాత్రి 11.10 నుంచి 11.58 వరకు, వర్జ్యం: సాయంత్రం 7.35 నుంచి 9.05 వరకు.

## డీఈవోలుగా ఏడుగురికి పదోన్నతులు

**ఉత్తర్వులు జారీచేసిన విద్యాశాఖ కార్యదర్శి**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పాఠశాల విద్యాశాఖలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న ఏడుగురు అధికారులకు డీఈవోలుగా పదోన్నతులు కల్పిస్తూ రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. డీఈవోలుగా పదోన్నతులు పొందినవారిలో బీ సువర్ణలతకు టెట్‌లో డిప్యూటీ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కాగా, ఆమె పదోన్నతి పొందిన నాడే ఉద్యోగ విరమణ చేయడం గమనార్హం. ఎన్ దుర్గాప్రసాద్‌కు కరీంనగర్ డీఈవోగా, ఏ ఉషారాణికి మహబూబ్‌నగర్, ఎస్ వెంకటేశ్వర్లకు మంచిర్యాల, జగన్నాథ్‌రెడ్డికి భద్రాద్రి కొత్తగూడెం, పీ రేవతిరెడ్డికి వరంగల్ అర్బన్ డీఈవోగా పదోన్నతి కల్పించారు. వీరితోపాటు ఆర్ రోషిణికి డీఈవో పదోన్నతి కల్పిస్తూ పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయంలో డిప్యూటీ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. కాగా మహబూబ్‌నగర్ డీఈవో ఎఫ్‌ఏసీలో ఉన్న ఎన్ రాజేశ్, భద్రాద్రి కొత్తగూడెం డీఈవోగా ఉన్న డీ వసంతిని రిలీవ్‌చేశారు.

**లోకం పోకడ**





పంక్చర్ వేయమంటే వేస్తాంగానీ, సైకిల్ లేని టైరుతో ఎలా వెళ్తారు?

## నీలోఫర్ క్లినికల్ ట్రయల్స్‌పై విచారణ పూర్తి

**వైద్యులతో భేటీ అయిన త్రిసభ్య కమిటీ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నీలోఫర్ దవాఖానలో క్లినికల్ ట్రయల్స్ నిర్వహణపై విచారణ పూర్తయింది. త్రిసభ్య కమిటీ సభ్యులు రాజారావు, లక్ష్మీకామేశ్వరి, విమలాథామస్ సోమవారం నీలోఫర్‌కు వచ్చి విచారణ జరిపారు. అక్కడి వైద్యులతో భేటీ క్లినికల్ ట్రయల్స్ నిర్వహణకు సంబంధించిన వివరాలను సేకరించారు. తమ పరిశీలనలో వెల్లడైన వివిధ అంశాలను నివేదిక రూపంలో వైద్యవిద్య డైరెక్టరేట్‌కు కమిటీ సభ్యులు అందివ్వనున్నారు. అనంతరం పూర్తివివరాలతో కూడిన నివేదికను డీఎంఈ ప్రభుత్వానికి సమర్పిస్తారు.

# సీఎం కేసీఆర్ నమ్మకాన్ని నిలబెడుతా

- సభలో అన్ని బిల్లుల ఆమోదానికి కృషిచేస్తా
- చీఫ్‌విప్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్‌భాస్కర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ముఖ్యమంత్రి కేసీఆర్ తనపై ఎంతో నమ్మకంతో చీఫ్‌విప్ పదవిని అప్పగించారని, ఆయన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్ అన్నారు. సోమవారం అసెంబ్లీ ఆవరణంలోని ఆయన కార్యాలయంలో పదవీబాధ్యతలు స్వీకరించిన సందర్భంగా వినయ్‌భాస్కర్ మాట్లాడుతూ.. తెలంగాణ పునర్నిర్మాణంలోనూ సీఎం కేసీఆర్ అడుగుజాడల్లో నడుస్తానని చెప్పారు. తనకు చీఫ్‌విప్ పదవి అప్పగించిన సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు ఈ సందర్భంగా ఆయన ధన్యవాదాలు తెలిపారు. సీఎం కేసీఆర్ ప్రజాసంక్షేమం కోసం సభలో ప్రవేశపెట్టే అన్నిబిల్లులు ఆమోదంపొందేలా అన్నిపక్షాలను కలుపుకొనిపోతానని చెప్పారు. చీఫ్‌విప్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్‌భాస్కర్‌కు మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీలు పసునూరి దయాకర్, బండా ప్రకాశ్, మాజీ మంత్రి కడియం శ్రీహరి, ఎమ్మెల్యే రేగా కాంతారావు, కుడా చైర్మన్ మర్రి యాదవరెడ్డి, టీఆర్‌ఎస్ ఎల్పీ కార్యదర్శి రమేశ్, వరంగల్‌కు చెందిన పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.



చీఫ్ విప్‌గా బాధ్యతలు స్వీకరించిన వినయ్‌భాస్కర్‌ను అభినందిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి, వేముల ప్రశాంత్‌రెడ్డి. చిత్రంలో ఎంపీ పసునూరి దయాకర్, విప్ రేగా కాంతారావు ఉన్నారు.



విప్ రేగా కాంతారావును అభినందిస్తున్న మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రశాంత్‌రెడ్డి

**వినయ్‌భాస్కర్‌కు వినోద్ శుభాకాంక్షలు**

వినయ్‌భాస్కర్‌కు రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. నూతన బాధ్యతల్లో వినయ్‌భాస్కర్ విజయం సాధించాలని ఆకాంక్షించారు.

## కోయలను గుర్తించిన ఘనత సీఎం కేసీఆర్‌దే

**విప్‌గా బాధ్యతలు స్వీకరించిన రేగా కాంతారావు**

తనపై ఎంతో నమ్మకంతో ప్రభుత్వ విప్‌గా అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు చెప్పారు. సోమవారం అసెంబ్లీలో విప్‌గా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మాట్లాడుతూ... 70 ఏండ్లలో ఏ ప్రభుత్వం కోయ సామాజికవర్గాన్ని గుర్తించలేదని, కానీ సీఎం కేసీఆర్ కోయలను గుర్తించి తనకు విప్‌గా బాధ్యతలప్పగించారని సంతోషం వ్యక్తంచేశారు. సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌తోపాటు తనను ఈ స్థాయికి తీసుకొచ్చిన నియోజకవర్గ ప్రజలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# హుజూర్‌నగర్ బరిలో 119 మంది


మొదటిపేజీ తరువాయి...


ప్రభుత్వం 24 గంటలపాటు కరంట్ ఇవ్వడమే కాకుండా రైతుబంధు, రైతుబీమా పథకాలతో రైతులను ఆదుకొంటున్నదని అన్నారు. హుజూర్‌నగర్ రైతులు సీఎం రుణం తీర్చుకోవాలనుకుంటున్నారని చెప్పారు. తండాలను గ్రామ పంచాయతీలుగా మార్చడంతో నియోజకవర్గంలో 40 తండాలు పంచాయతీలుగా మారాయన్నారు. ఇన్నేండ్లలో ఉత్తమ్ ఒక్కనాడు కూడా నియోజకవర్గ అభివృద్ధి కోసం సీఎంనుగానీ, జిల్లా మంత్రినైన తననుగానీ, కలెక్టర్‌నుగానీ కలువలేదని, ఎన్నడూ సమీక్షాసమావేశాలకు రాలేదని విమర్శించారు. మోసపూరిత వాగ్దానాలు, మాయమాటలతో రెండుసార్లు గెలిచిన ఉత్తమ్.. మరోసారి సానుభూతితో తన భార్యను గెలిపించుకోవాలని కుటిలయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. ఓటు వేసిన ప్రజలను ఉత్తమ్ ఎన్నడో మర్చిపోయారని అన్నారు. టీఆర్‌ఎస్ అభ్యర్థి సైదిరెడ్డి స్థానికుడు, సమస్యలు తెలిసిన వ్యక్తి అని, ఆయనను గెలిపిస్తే అభివృద్ధికి బాటలు వేసుకున్నట్లేనని మంత్రి జగదీశ్‌రెడ్డి చెప్పారు.

**ఎన్నికలు రావడం హుజూర్‌నగర్ అదృష్టం: టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి**

ఏడాది తిరుగకుండానే హుజూర్‌నగర్‌కు ఎన్నికలు రావడం హుజూర్‌నగర్ ప్రజల అదృష్టమని టీఆర్‌ఎస్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆరేండ్లలో నియోజకవర్గంలో ఒక్క పనికూడా ఉత్తమ్ చేయలేదన్నారు. 141 గ్రామపంచాయతీలకుగాను 113 గ్రామపంచాయతీల్లో టీఆర్‌ఎస్ సర్పంచ్‌లు ఉన్నారని, ఎమ్మెల్యేగా టీఆర్‌ఎస్ అభ్యర్థి గెలిస్తేనే పంచాయతీలకు నిధులు అందే అవకాశం ఉన్నదని చెప్పారు. తనను గెలిపిస్తే ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానన్నారు.



సోమవారం నేరేడుచర్లలో జరిగిన టీఆర్‌ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న హుజూర్‌నగర్ ఉపఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి. చిత్రంలో శాసనమండలిలో విప్ కర్నె ప్రభాకర్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# అభివృద్ధా? అరాచకమా?

- తేల్చుకునే సమయం ఆసన్నం
- టీఆర్‌ఎస్‌ను గెలిపించి సీఎం కేసీఆర్‌కు బహుమతిగా ఇద్దాం
- మండలిలో విప్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**నేరేడుచర్ల:** హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అభివృద్ధి జరుగాలా? లేదా ఉత్తమ్ కుమార్‌రెడ్డి అరాచకం కావాలా? నియోజకవర్గ ప్రజలు తేల్చుకునే సమయం ఈ ఉప ఎన్నిక ద్వారా ఆసన్నమైందని శాసనమండలి విప్, నియోజకవర్గ టీఆర్‌ఎస్ ఎన్నికల ఇంచార్జి పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం నేరేడుచర్లలో మండల టీఆర్‌ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో అన్ని నియోజకవర్గాలు అభివృద్ధిలో దూసుకుపోతుంటే హుజూర్‌నగర్ మాత్రం ఆమడదూరంలో ఉండిపోయిందని, అందుకు కారణం ఉత్తమ్‌కుమార్‌రెడ్డేనని చెప్పారు. ఇక్కడ కాంగ్రెస్ గెలిస్తే ఉత్తమ్ కుటుంబం లాభపడుతుందని, అదే టీఆర్‌ఎస్ గెలిస్తే నియోజకవర్గం అభివృద్ధి చెందుతుందన్నారు. సైదిరెడ్డిది ఆంధ్రా అని పిచ్చి ఆరోపణలు చేస్తున్న ఉత్తమ్ దంపతులది హుజూర్‌నగర్ నియోజకవర్గమేనా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఎప్పుడు, ఎక్కడ ఏ ఎన్నికలు జరిగినా టీఆర్‌ఎస్‌నే ప్రజలు ఆశీర్వదిస్తున్నారని శాసనమండలి విప్ కర్నె ప్రభాకర్ అన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే తిప్పన విజయసింహారెడ్డి, టీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శులు, ఎన్నికల ఇంచార్జులు తాతా మధుసూదన్, చాడా కిషన్‌రెడ్డి, కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబుయాదవ్, ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణలో వందశాతం ఓడీఎఫ్

- 12,751 గ్రామాల్లో 30.75 లక్షల మరుగుదొడ్ల నిర్మాణం
- రూ.2,238 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా.. వందశాతం ఓడీఎఫ్ సాధించిన రాష్ట్రంగా తెలంగాణ మరో రికార్డు సృష్టించింది. రాష్ట్రంలో 2014 నుంచి సోమవారం నాటికి మొత్తం 30.75 లక్షల మరుగుదొడ్లను నిర్మించారు. ఈ అక్టోబర్ 2 నాటికి 12,751 గ్రామాల్లో 30.75 లక్షల వ్యక్తిగత మరుగుదొడ్లను నిర్మించాలని లక్ష్యంగా నిర్దేశించుకోగా.. దానిని వందశాతం సాధించింది. ఇందుకోసం మొత్తం రూ.2,238.27 కోట్లను స్వచ్ఛభారత్ మిషన్‌లో వెచ్చించారు. వీటి కోసం ఉపాధి హామీ నిధులను సైతం వినియోగించుకునేందుకు వెసులుబాటు కల్పించారు. ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండాలని నిబంధనలు విధించారు. తాజాగా పల్లెప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రంలో 51,699 మరుగుదొడ్లను నిర్మించారు. రాష్ట్రం ఏర్పడేనాటికి తెలంగాణలో మరుగుదొడ్ల వినియోగం 28.42 శాతంగా ఉండేది. అది 2015-16లో 50.58కి చేరింది. ఆ తర్వాత 2016-17లో 64.59 శాతం, 2017-18లో 83.93 శాతం వృద్ధి సాధించింది. గత ఆగస్టు నాటికి మరుగుదొడ్ల వినియోగం 94.59 శాతం ఉండగా.. స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా అక్టోబర్ 2 వరకు 100 శాతం సాధించిన జాబితాలో తెలంగాణ చేరింది.



ఢిల్లీలో జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ సదస్సుకు హాజరైన కేంద్ర మంత్రి మహేంద్రనాథ్‌పాండేతో తెలంగాణ ఉపాధి, కార్మికశాఖల మంత్రి చామకూర మల్లారెడ్డి

# సులభ వాణిజ్యంలో తెలంగాణ ఫస్ట్

- ఢిల్లీలో మీడియాతో మంత్రి మల్లారెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సులభతర వాణిజ్య విధానం (ఈవోడీబీ)లో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం మొదటిస్థానంలో కొనసాగుతున్నదని రాష్ట్ర ఉపాధి, కార్మికశాఖల మంత్రి చామకూర మల్లారెడ్డి చెప్పారు. ఢిల్లీలోని ప్రవాసభారతి కేంద్రంలో స్కిల్ డెవలప్‌మెంట్‌శాఖ మంత్రి మహేంద్రనాథ్ పాండే ఆధ్వర్యంలో సోమవారం జరిగిన జాతీయ సదస్సుకు అన్ని రాష్ట్రాల నైపుణ్యాభివృద్ధి శాఖల మంత్రులు హాజరయ్యారు. తెలంగాణ నుంచి పాల్గొన్న మంత్రి మల్లారెడ్డి సదస్సు అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఐటీఐ పూర్తిచేసిన తొమ్మిది వేల మంది విద్యార్థులకు అప్రెంటిస్‌షిప్ కల్పిస్తున్నట్టు తెలిపారు. ఇందుకోసం కేంద్ర నైపుణ్యాభివృద్ధి మంత్రిత్వశాఖతో ఒప్పందం కుదుర్చుకొని ఎంవోయూ పత్రాలను కేంద్ర మంత్రికి అందించినట్టు చెప్పారు. అన్ని రాష్ట్రాలు ఎంఎస్‌డీఈ కింద డిప్లొమా అభ్యర్థులకు అప్రెంటిస్‌షిప్ ఇవ్వాలని కోరినట్టు పేర్కొన్నారు. ఎంబీబీఎస్ విద్యార్థులకు మాదిరిగానే నిరుద్యోగులకు కూడా అప్రెంటిస్ ఇవ్వాలని సదస్సులో నిర్ణయం తీసుకొన్నట్టు తెలిపారు.

# సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలి

- ఉద్యోగ వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న కేంద్ర ప్రభుత్వం
- ఢిల్లీలో ఉద్యోగుల మహాధర్నాలో టీఎన్జీవో అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ సుల్తాన్‌బజార్:** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ఉద్యోగ వ్యతిరేక విధానాలను వీడి.. సీపీఎస్ విధానాన్ని రద్దుచేయాలని, పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం (టీఎన్జీవో) సెంట్రల్ యూనియన్ అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఢిల్లీలో అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య సారథ్యంలో ఉద్యోగులు, కార్మికుల మహాధర్నాలో ఆయన మాట్లాడుతూ.. సీపీఎస్ రద్దుపై రాష్ట్రాలు నేరుగా నిర్ణయాలు తీసుకునేలా కేంద్రం చర్యలు తీసుకోవాలని, ఇప్పటికే చాలా రాష్ట్రాలు సీపీఎస్ రద్దుకు ముందుకు వస్తున్నాయని, కొన్ని రాష్ట్రాల్లో కమిటీలు వేసి ఉద్యోగులకు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటున్నాయని, తెలంగాణలో కూడా సీపీఎస్ రద్దుకు మార్గాలు వెతకాలని సీఎం కేసీఆర్ అధికారులకు ఆదేశాలిచ్చారని వెల్లడించారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ విధానాలను రద్దు చేసి, ఉద్యోగుల సర్వీసును క్రమబద్ధీకరించాలని కోరారు. ఉద్యోగుల ఐటీ పరిమితిని రూ.5 లక్షలకు పెంచాలన్నారు. ఉద్యోగుల డిమాండ్లపై కేంద్రం అనుకూల నిర్ణయం తీసుకోకపోతే వచ్చే ఏడాది జనవరి 8న దేశవ్యాప్త సమ్మెకు దిగాలని నిర్ణయించినట్టు ప్రకటించారు. ధర్నాలో టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్, ప్రతినిధులు రామినేని శ్రీనివాస్‌రావు, చంద్రశేఖర్, జగదీశ్వర్, కాళీచరణ్, రాయకంటి ప్రతాప్, ముత్యాల సత్యనారాయణ గౌడ్, సుశీల్‌బాబు, రవి, లక్ష్మణ్‌రావు, సురేశ్‌బాబు, రామ్మోహన్, ప్రభాకర్‌రెడ్డి, శ్రీనివాస్, మల్లారెడ్డితోపాటు అన్ని జిల్లాల నుంచి దాదాపు 50 మంది టీఎన్జీవో ప్రతినిధులు పాల్గొన్నారు.





ఢిల్లీ మహాధర్నాలో మాట్లాడుతున్న టీఎన్జీవో కేంద్రసంఘం అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి

## మరో పెద్దచేప చిక్కింది!


మొదటిపేజీ తరువాయి...


ప్రవర్తించాల్సిన అధికారులతోపాటు కొందరు కిందిస్థాయి సిబ్బంది కూడా కుమ్మక్కయ్యారు. ఎక్కడా ఉపయోగం లేని మందులను కొనుగోలు చేయడమే కాకుండా.. విచిత్రంగా అసలు ఫార్మా కంపెనీలు లేకుండానే మందులు కొనుగోలు చేసిన వైనం ఏసీబీ అధికారులను సైతం ఆశ్చర్యానికి గురిచేస్తున్నది. ఈ కుంభకోణంలో మున్ముందు మరింత మంది సిబ్బంది అరెస్టులు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది.

## మాకూ మద్దతివ్వండి

**మరోసారి మఖ్దూంభవన్‌కు కాంగ్రెస్ నేతలు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సీపీఐ మద్దతు కోసం కాంగ్రెస్ ప్రయత్నాలు కొనసాగిస్తున్నది. హుజూర్‌నగర్ ఉప ఎన్నికల నోటిఫికేషన్ వెల్లడైనరోజే పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సీపీఐ కార్యాలయానికి వెళ్లి మద్దతు కోరగా.. సోమవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు మరోసారి మఖ్దూంభవన్‌కు వెళ్లారు. కాంగ్రెస్ నేతలు కోదండరెడ్డి, ప్రసాద్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి తదితరులు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డితో సమావేశమయ్యారు. అయితే రాష్ట్ర కమిటీ ఇంకా నిర్ణయం తీసుకోలేదని చాడ వెంకట్‌రెడ్డి కాంగ్రెస్ నేతలకు చెప్పినట్టు సమాచారం. టీఆర్‌ఎస్‌కు అండగా ఉండాలని సీపీఐ నిర్ణయం తీసుకొంటున్నట్టు తెలుస్తున్నది.

## పత్తిసాగుకు అనుగుణంగా కొనుగోలు కేంద్రాలు

**వెల్లడించిన మంత్రులు నిరంజన్‌రెడ్డి, కమలాకర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ఆయా ప్రాంతాల్లో పత్తిపంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేయనున్నట్లు వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ వెల్లడించారు. సీఎం కేసీఆర్ సూచనలతో సంబంధితశాఖల అధికారులతో మంత్రులు సోమవారం హైదరాబాద్‌లో సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో పుష్కలంగా వర్షాలు, సాగు నీరున్న కారణంగా పంటల సాగు విస్తీర్ణం పెరిగిందన్నారు. యాసంగి సాగుకు విత్తనాలు, ఎరువుల లభ్యతపై చర్చించడంతోపాటు ఎరువుల బఫర్‌స్టాక్ పెంచేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంటల దిగుబడికి అనుగుణంగా కొనుగోళ్ల విషయంలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సీ పార్థసారథి, కమిషనర్ రాహుల్‌బొజ్జా, పౌరసరఫరాలశాఖ కమిషనర్ అకున్‌సబర్వాల్, సహకారశాఖ కమిషనర్ వీరబ్రహ్మయ్య, ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రాంరెడ్డి, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరావు, విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, మార్క్‌ఫెడ్ ఎండీ భాస్కరాచారి తదితరులు పాల్గొన్నారు.

Sleepwell

# INDIA'S HEALTHIEST Festive OFFER

**NEEM FRESCHE** రక్షణతో వస్తున్న ప్రతి స్లీప్‌వెల్ ఉత్పత్తి మీ కుటుంబాన్ని చర్మ మరియు శ్వాస సంబంధ ఎలర్జీల బారి నుండి సురక్షితంగా ఉంచుతుంది.

ఆరోగ్యం & సౌకర్యం ఇంతకంటే గొప్పగా ఎక్కడా దొరకవు.
ఇప్పుడు ప్రతి జత స్లీప్‌వెల్ మ్యాట్రస్‌లతో, మీరు పొందుతారు

| FREE* | FREE* | FREE* | ఒక అవకాశం |
|---|---|---|---|
| neem fresche తో ఆరోగ్యం | MY PILLOW సెట్ | ప్రీమియం బ్లాంకెట్ లేదా ప్లష్ టవల్స్ | 100%* వరకూ తగ్గింపు పొందేందుకు |




*నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి

neem fresche Health & Hygiene inspired by Nature and Science

08 DOWN PAYMENT EMI's BAJAJ FINSERV

TO GET A CALL FROM OUR NEAREST DEALER GIVE A MISSED CALL ON 79981 79981

A **Sheela Foam** Product


www.sleepwellproducts.com • Toll Free: 1800 103 6664

**Exclusive Outlets: Godavarikhani:** 9849826038, **Huzurabad:** 9866435836, **Jagtial:** 9849273395, **Karimnagar:** 9440070015, **Korutla:** 9618636780, **Mancherial:** 9866703084, **Peddapally:** 9849027721, **Ramagundam:** 8106540468, **Siricilla:** 9985099000, **Vemulawada:** 9248036225. **For Trade Enquiries:** 040-65307190, 9866459896, 9440070015.

epaper.ntnews.com

## 'సర్దార్.. మైనే ఆప్‌కే నమక్ ఖాయా'

**'షోలే' నటుడు 'విజు ఖోటే' కన్నుమూత!**



**ముంబయి, సెప్టెంబర్ 30:** బాలీవుడ్ క్లాసిక్ సినిమా షోలేలో 'సర్దార్, మైనే ఆప్‌కే నమక్ ఖాయా హై' (నేను మీ ఉప్పు తిన్నాను) అనే డైలాగ్‌తో ప్రేక్షకుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన నటుడు విజు ఖోటే (77) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం తుది శ్వాస విడిచారని విజు మేనకోడలు, నటి భావన బాల్సవర్ తెలిపారు. ఐదు దశాబ్దాల పాటు సినీ పరిశ్రమలో ఉన్న ఆయన 300కుపైగా హిందీ, మరాఠీ చిత్రాల్లో నటించారు. ఖయామత్ సే ఖయామత్ తక్, వెంటిలేటర్, జబాన్ సంభాల్కే వంటి టీవీ షోల్లోనూ ప్రేక్షకులను అలరించారు.

## హర్యానా ఎన్నికల బరిలో క్రీడాకారులు

- యోగేశ్వర్‌దత్, బబితా ఫోగట్, సందీప్ సింగ్‌లకు చోటు
- 78 మందితో బీజేపీ తొలి జాబితా విడుదల



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** హర్యానా అసెంబ్లీ ఎన్నికల బరిలో ముగ్గురు ప్రముఖ క్రీడాకారులకు టిక్కెట్ లభించింది. ఒలింపిక్స్ రెజ్లింగ్ విభాగం స్వర్ణ పతక విజేత యోగేశ్వర్ దత్, మహిళా రెజ్లర్ బబితా ఫోగట్, హాకీ ఇండియా మాజీ సారథి సందీప్‌సింగ్‌లకు బీజేపీ టిక్కెట్లు కేటాయించింది. ఇటీవలే తమ పార్టీలో చేరిన వీరితోపాటు 78 మందితో కూడిన అభ్యర్థుల తొలి జాబితాను బీజేపీ విడుదల చేసింది. దాద్రి స్థానానికి ప్రముఖ జాట్ నాయకుడు దేవీలాల్ మనుమడు ఆదిత్య అభ్యర్థిత్వం ఖరారైంది. హర్యానా సీఎం మనోహర్‌లాల్ ఖట్టర్.. 2014 ఎన్నికల్లో విజయం సాధించిన కర్నాల్ నుంచే తిరిగి బరిలో నిలువనున్నారు. ఏడుగురు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తిరిగి అవకాశం కల్పించలేదు. 38 మంది సిట్టింగ్ ఎమ్మెల్యేలకు తొలి జాబితాలో చోటు దక్కింది. ఇద్దరు ముస్లింలు, తొమ్మిది మంది మహిళలకు సీట్లు ఖరారు చేసినట్లు బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి అరుణ్ సింగ్ తెలిపారు.

## ఆర్టికల్ 370 రద్దే.. జవాన్లకు అసలైన నివాళి!

### ప్రధాని మోదీ ఆ పని చేశారు: హోంమంత్రి అమిత్ షా



**అహ్మదాబాద్, సెప్టెంబర్ 30:** జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370ని రద్దు చేసి.. అమరులైన దాదాపు 35 వేల మంది జవాన్లకు ప్రధాని మోదీ నిజమైన నివాళులర్పించారని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా పేర్కొన్నారు. అహ్మదాబాద్‌లో సోమవారం నిర్వహించిన ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్‌ఏఎఫ్) పరేడ్‌లో పాల్గొన్న ఆయన మాట్లాడారు. 'ఆర్టికల్ 370 రద్దు నిర్ణయాన్ని తీసుకోవడంతో ప్రధాని మోదీ.. అమరులైన దాదాపు 35వేల మంది జవాన్లకు సరైన నివాళి అర్పించారు' అని షా అన్నారు. త్వరలోనే కశ్మీర్ అభివృద్ధిబాట పడుతుందని ఆయన ఆకాంక్షించారు.

# 'అనాసక్తి'పై బాపూజీ ఆసక్తి




### రెండ్రోజుల కోసం వచ్చి రెండు వారాలు సేదతీరిన మహాత్ముడు

- హిమాలయ సోయగంతో ముగ్ధుడైన గాంధీజీ
- 'అనాసక్తి యోగ్' పేరిట వ్యాసాలు

**కౌసానీ(ఉత్తరాఖండ్), సెప్టెంబర్ 30:**

స్వాతంత్ర్య సంగ్రామంలో భాగంగా యావత్ జాతిని ఏకతాటిపైకి తీసుకొచ్చే పనులతో తలమునకలై ఉన్న బాపూజీని ఉత్తరాఖండ్‌లోని బగేశ్వర్ జిల్లాలో ఉన్న అనాసక్తి ఆశ్రమం ఎంతగానో ఆకర్షించింది. రెండు రోజులపాటు అక్కడ గడపడానికి వచ్చిన ఆయన అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం, హిమాలయ సోయగాలకు మంత్ర ముగ్ధుడై రెండు వారాల పాటు సేద తీరారు. బాపూజీని కౌసానీకి వచ్చి ఓ రెండు రోజులు విశ్రాంతి తీసుకోవాలని అక్కడి ఓ టీ ఎస్టేట్ యజమాని కోరారు. అందుకు బాపూ కూడా అంగీకరించారు. 1929లో వేసవికాలంలో వీలు చూసుకొని గాంధీ కౌసానీకి వెళ్లారు. ముందు నిర్ణయించుకున్న ప్రణాళిక ప్రకారం రెండు రోజులు గడిచిపోయాయి. మూడు.. నాలుగు.. ఐదు.. రోజులు గడుస్తూనే ఉన్నాయి. తిరుగు ప్రయాణం అవ్వాలన్న ఊసే మరిచారు మహాత్ముడు. హిమాలయాల చెంతనున్న కౌసానీ ఆయన్ని అమితంగా ఆకర్షించింది. అక్కడ ఉన్న 'అనాసక్తి ఆశ్రమం'లో 14రోజులు ఆయన సేదతీరారు. ఇప్పటికీ, అక్కడి వాతావరణం బాపూలానే ఎంతో ప్రశాంతతతో నిండి ఉన్నది.



**మహాత్ముడి జ్ఞాపకాలు**

తొంబై ఏండ్లు గడిచినప్పటికీ, ఉత్తరాఖండ్‌లోని బగేశ్వర్ జిల్లాలో ఉన్న 'అనాసక్తి ఆశ్రమం' నేటికీ బాపూ జ్ఞాపకాలతో అలరారుతూనే ఉన్నది. ఆశ్రమం భవనం ముందు ప్రశాంతతతో ఉన్న మహాత్ముడి విగ్రహం దర్శనమిస్తుంది. దాని పక్కనే, మహాత్ముడు బోధించిన 'చెడు చూడకు, చెడు వినకు, చెడు మాట్లాడకు' వ్యాఖ్యలను సూచించే మూడు కోతులు పర్యాటకులకు స్వాగతం పలుకుతాయి. బాపూజీ జీవితంలోని కీలక ఘట్టాల్ని తెలిపే చిత్రాలను ఆశ్రమంలోని గోడలపై అలంకరించారు. అలాగే, మరో గోడపై మహాత్ముడి కుటుంబ వంశ వృక్షాన్ని చిత్రీకరించారు. ఆశ్రమంలో పొందిన మధురానుభూతులను లేఖల రూపంలో గాంధీజీ రాశారు. ఆశ్రమంలో అన్ని రోజులు ఉండటానికి గల కారణాలు, హిమాలయ పర్వతాలను చూస్తూ పొందిన ప్రశాంతత.. డబ్బు, ధనంపై మోహం ఉండకూడదని చెప్పే 'అనాసక్తి యోగ్' పేరిట వ్యాసాలను గాంధీజీ రాశారు. ఆ లేఖల్లోని అంశాల్ని కూడా నిర్వాహకులు గోడలపై చిత్రీకరించారు. పాతిక గదులున్న ఈ ఆశ్రమంలో ప్రార్థన, యోగా చేయడానికి ప్రత్యేక గదులు ఉన్నాయి. గాంధీ సిద్ధాంతాలు, వినోభా బావేకు సంబంధించిన పుస్తకాలు, వ్యవసాయ సంబంధిత పుస్తకాలతో ఓ గ్రంథాలయం ఉన్నది. కొన్ని సంవత్సరాల వరకు అనాసక్తి ఆశ్రమం ఓ అతిథి గృహంగా, ఆ తర్వాత డాక్ బంగ్లాగా ఉండేది. 1963లో సుచేతా కృపలానీ ఉత్తర్‌ప్రదేశ్ సీఎంగా బాధ్యతలు చేపట్టాక.. ఈ ఆశ్రమాన్ని గాంధీ స్మారక్ నిధి సంస్థకు అప్పగించారు.

**'అనాసక్తి ఆశ్రమం' అర్థం ఏమిటి?**

అనాసక్తి అంటే దేనిపైనా మక్కువ ఉండకపోవడం. తాము చేసిన కర్మలకు లభించిన ఫలితంపై(డబ్బు, ధనం) ఆసక్తి పెంచుకోకూడదు అని చెప్పే గీత సారాన్ని 'అనాసక్తి ఆశ్రమం' గుర్తుచేస్తుంది. ఈ ఉద్దేశంతోనే ఈ ఆశ్రమానికి ఆ పేరు పెట్టారు.



● అనాసక్తి ఆశ్రమం



ఉత్తరాఖండ్‌లోని బగేశ్వర్ జిల్లాలో ఉన్న అనాసక్తి ఆశ్రమం. (కింద) చెడు మాట్లాడకు, చెడు చూడకు, చెడు వినకు అని బోధించే కోతుల బొమ్మలు.

**సాధారణంగానే 150 జయంతి కార్యక్రమం**

మహాత్ముడి 150వ జయంతి ఉత్సవాల్ని అంగరంగవైభవంగా చేయడానికి యావత్ దేశం సంసిద్ధమవుతున్నది. అయితే, గాంధీజీ ఎంతో పరవశించిపోయిన 'అనాసక్తి ఆశ్రమం'లో ఆయన 150వ జయంతి ఉత్సవాలు సాధారణంగానే జరుగనున్నాయి. ఉత్తరాఖండ్ రాష్ట్రంలో పంచాయత్ ఎన్నికలు త్వరలో జరుగనున్నాయి. దీంతో ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ఈ నేపథ్యంలో బుధవారం జాతీయ జెండా ఎగురవేసి, ప్రభాత్ భేరి నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

**కొడుకు కోడలికి మహాత్ముడి లేఖ**

'అనాసక్తి ఆశ్రమం'లో గడిపినప్పుడు తాను పొందిన అనుభూతులను మహాత్ముడు తన కొడుకు, కోడలుకు లేఖగా రాశారు. 'మంచుతో స్నానం చేస్తున్న హిమాలయాలను చూస్తూ నేను ఈ లేఖ రాస్తున్నా. రోజు మొత్తం బాల్కనీలో కూర్చొని ఈ హిమాలయాల సౌందర్యాన్ని చూస్తూ.. 'అనాసక్తి యోగ్' రాశాను' అని ఆయన లేఖలో పేర్కొన్నారు.



భారతీయులపై మహాత్ముడి ప్రభావం గణనీయంగా ఉంది. గాంధీతత్వం మన మనస్సుల్లోకి చొచ్చుకుపోయింది. ఇది బయటకు కనిపించకపోయినా సమాజంలో ఏదో ఒకచోట కారుణ్యం, మానవత్వం రూపేణా అది ప్రతిబింబిస్తూనే ఉంటుంది. భారతీయ తత్వం, ఆచారవ్యవహారాల నుంచే గాంధీ బోధనలు పుట్టాయి. ఆ విలువలను ఆయన తిరిగి మన ముందుకు తెచ్చారు. బాపూజీ సిద్ధాంతాలకు ప్రతిఘటన ఎదురైన సందర్భాలు ఎప్పుడూ ఉన్నాయి. ఆయన జీవించి ఉన్నప్పుడు కూడా ఇది జరిగింది. ఎందుకంటే సమాజంలో అల్లుకుపోయిన కుల వ్యవస్థ వంటి వాటిని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. సహచరులపై దయ, మానవత్వం చూపడమే మహాత్ముడికి మనమిచ్చే అసలైన నివాళి.

\- శ్యామ్ బెనగల్, ప్రముఖ దర్శకుడు

## ప్రపంచానికి శాంతిమార్గం

- గొప్ప ఆధ్యాత్మిక సంపదను అందించారు
- మహాత్ముడిని కొనియాడిన చైనా ప్రభుత్వం
- 150వ జయంతి ఉత్సవాలకు భారీ ఏర్పాట్లు
- భారత్‌తో బలమైన సంబంధాలు కోరుకుంటున్నామని వెల్లడి

**బీజింగ్:** ప్రపంచానికి మహాత్మా గాంధీ శాంతి మార్గాన్ని చూపడమేకాకుండా గొప్ప ఆధ్యాత్మిక సంపదను వారసత్వంగా అందించారని చైనా కొనియాడింది. 'భారత్, చైనా సహ ప్రయాణికులు. ఈ ప్రయాణంలో రెండు దేశాలు బాధను, దుఃఖాన్ని పంచుకుంటున్నాయి' అన్న గాంధీజీ వ్యాఖ్యలను ఉటంకించింది. బీజింగ్‌లోని చావోయాంగ్ పార్క్‌లో చైనా ప్రభుత్వం 2005లో మహాత్మా గాంధీ విగ్రహాన్ని ప్రతిష్టించింది. దాన్ని ప్రముఖ శిల్పి యువాన్ జికున్ రూపొందించారు. నాటి నుంచి ఏటా అక్టోబర్ 2న చైనా ప్రభుత్వం చావోయాంగ్ పార్క్‌లో గాంధీ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నది. గాంధీజీ 150వ జయంతి ఉత్సవాల నేపథ్యంలో ఈసారి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సందర్భంగా చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి జెంగ్ షువాంగ్ మాట్లాడుతూ.. గాంధీజీ తన బోధనలు, నడవడి ద్వారా ప్రపంచానికి గొప్ప ఆధ్యాత్మిక వారసత్వ సంపదను అందించారని కొనియాడారు. తాము భారత్‌తో బలమైన సంబంధాలను కోరుకుంటున్నట్టు చెప్పారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ త్వరలో భారత్‌లో పర్యటించనున్న నేపథ్యంలో జెన్ ఈ వ్యాఖ్యలు చేసినట్టు తెలుస్తున్నది. చెన్నై సమీపంలోని మామల్లపురంలో ఈ నెల 11 నుంచి 13 వరకు జరుగనున్న సదస్సులో జిన్‌పింగ్ పాల్గొననున్నారు.



**దశాబ్దాలపాటు గాంధీని పట్టించుకోని చైనా**

నిజానికి చైనా కొన్ని దశాబ్దాలపాటు గాంధీజీని పట్టించుకోలేదు. ఆయన సమకాలీనుడైన మావో జెడాంగ్ చైనా విముక్తి ఉద్యమ నేత కావడమే ఇందుకు ప్రధాన కారణం. చైనా విముక్తి కోసం మావో జెడాంగ్ హింసా మార్గాన్ని ఎంచుకోగా, గాంధీజీ భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని అహింసామార్గంలో నడిపించారు. వీరిద్దరివీ భిన్న మార్గాలు కావడంతో బాపూజీ చరిత్రను చైనీయులకు ఆ దేశ ప్రభుత్వం పెద్దగా తెలియనీయలేదు.

## ఆలయంలోకి గాంధీజీకి అనుమతి నిరాకరణ!

**తిరువనంతపురం, సెప్టెంబర్ 30:** దేవాలయాల్లోకి నిమ్న వర్గాలకు ప్రవేశం కల్పించేందుకు ఎంతో పోరాడిన మహాత్మాగాంధీకి కూడా ఒకసారి ఒక ఆలయంలోకి అనుమతిని నిరాకరించారు. అయితే అందుకు కారణం కులమో, మతమో కాదు. విదేశాలకు వెళ్లిరావడమే కారణం! సముద్రాలను దాటి విదేశాలకు వెళ్లిరావడాన్ని అప్పట్లో అపచారంగా భావించేవారు. పాపహరణ తంతు తర్వాతే వారిని అనుమతించేవారు. 1925లో కన్యాకుమారిలోని భగవతి అమ్మాన్ ఆలయంలోకి వెళ్లేందుకు గాంధీజీకి ఆలయ అధికారులు అనుమతించలేదు. ఆయన ఇంగ్లండ్‌లో పర్యటించి వచ్చారనే కారణంతో గర్భగుడిలోకి వెళ్లేందుకు అనుమతి నిరాకరించారు. దీనిపై తాను నిర్వహిస్తున్న వారపత్రిక నవజీవన్‌లో గాంధీజీ ఆవేదన వ్యక్తం చేశారు. 'ప్రదక్షిణం చేసేందుకు నన్ను అనుమతించారు. కానీ, గర్భగుడిలోకి మాత్రం అనుమతించలేదు. ఎందుకంటే నేను ఇంగ్లండ్‌కు వెళ్లిరావడమే కారణం. దీన్ని ఎలా సహించాలి? కన్యాకుమారి కలుషితమవుతుందా? ప్రాచీన కాలం నుంచీ ఈ ఆచారాన్ని పాటిస్తున్నారా? ఇలాంటి ఆచారాలను అడ్డుకోవాలి. ఇది ప్రతి హిందువు బాధ్యత' అని గాంధీజీ అందులో పేర్కొన్నారు. ఆ తర్వాత 1933లో ట్రావెన్‌కోర్ రాజు శ్రీ చితిరా తిరునాళ్ బలరామ వర్మ ఆ నిషేధాన్ని ఎత్తివేశారు.

## మన్మోహన్‌కు పాక్ ఆహ్వానం

- కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి పిలిచిన పొరుగుదేశం
- మోదీని కాదని మన్మోహన్‌కు
- వెళ్లే అవకాశం లేదన్న కార్యాలయ వర్గాలు



**ఇస్లామాబాద్, సెప్టెంబర్ 30:** జమ్ము కశ్మీర్ ప్రత్యేక ప్రతిపత్తిని రద్దుచేసినందుకు భారత ప్రధాని నరేంద్ర మోదీ పట్ల కినుక వహించిన పాకిస్థాన్.. కర్తార్‌పూర్ కారిడార్ ప్రారంభోత్సవానికి మోదీని కాకుండా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌ను ఆహ్వానించాలని నిర్ణయించింది. పాకిస్థాన్ విదేశాంగ మంత్రి షా మహ్మద్ ఖురేషి సోమవారం ఒక టీవీ చానెల్‌తో మాట్లాడుతూ..'భారీ స్థాయిలో కర్తార్‌పూర్ కారిడార్‌ను ప్రారంభించడానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకలకు భారత్ మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్‌ను ఆహ్వానించాలని నిర్ణయించాం. త్వరలో ఆయనకు లాంఛనంగా ఆహ్వానం పంపుతాం' అని చెప్పారు. సిక్కు సామాజిక వర్గానికి మన్మోహన్ సింగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. అయితే పాకిస్థాన్ ఆహ్వానంపై తమకు ఎటువంటి సమాచారం లేదని మన్మోహన్ సింగ్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి ఆయన హాజరు కాబోరని ఆ వర్గాలు పేర్కొన్నాయి. పాకిస్థాన్‌లోని కర్తార్‌పూర్ దర్బార్ సాహిబ్‌తో పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో గల డేరా బాబా నాయక్ పుణ్య క్షేత్రాన్ని అనుసంధానించేందుకు ఈ కారిడార్‌ను నిర్మించారు.

## 'ఒకదేశం-రెండు వ్యవస్థలు'యథాతథం

**బీజింగ్:** హాంకాంగ్‌లో 'ఒకదేశం, రెండు వ్యవస్థలు' విధానాన్ని కొనసాగిస్తామని చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్ వెల్లడించారు. నెలల తరబడి ప్రజాస్వామ్య అనుకూల వాదులు ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఆయన వ్యాఖ్యలకు ప్రాధాన్యం ఏర్పడింది. మంగళవారం చైనా 70వ ఆవిర్భావ దినోత్సవ సంబురాలు ప్రారంభానికి ముందు జరిగిన విందు భేటీలో జిన్‌పింగ్ మాట్లాడారు. హాంకాంగ్, మకావు మాతృభూమిలో భాగస్వామి అవుతాయన్న విశ్వాసం ఉందన్నారు.

## వందేండ్ల రికార్డు వాన

› మొదటిపేజీ తరువాయి...

జూన్-సెప్టెంబర్ వానాకాలం సీజన్ అధిక వర్షపాతం సీజన్‌గా నిలిచింది. సెప్టెంబర్‌లో 247.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. అంటే.. సాధారణ స్థాయికంటే 48శాతం అధికం. సోమవారం నాటి లెక్కలు కూడా కలుపుకొంటే సెప్టెంబర్ సగటు వర్షపాతం 1983 నాటి రికార్డు అయిన 255 మిల్లీమీటర్లు దాటిపోతుంది. గుజరాత్, బీహార్‌లలో ఇంకా రెడ్ అలర్ట్ కొనసాగుతుండటం గమనార్హం. ఇక దేశవ్యాప్తంగా చూస్తే.. ఆదివారం వరకు 956.1 మిల్లీమీటర్ల సగటు నమోదైంది. ఇది సాధారణ వర్షపాతం 877 మిల్లీమీటర్లకు 9శాతం అధికం.

**ఇంకా చురుకుగానే రుతుపవనాలు**

అధికారికంగా సోమవారంతోనే వానాకాలం సీజన్ ముగిసిపోయినా.. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఇంకా రుతుపవనాలు చురుకుగానే ఉన్నాయి. రుతుపవనాల ఉపసంహరణ విషయంలో ఈ సీజన్ రికార్డు నెలకొల్పిందని ఐఎండీ వర్గాలు పేర్కొంటున్నాయి. రుతుపవనాలు ఉపసంహరణ జాప్యంలో బహుశా ఇదే సుదీర్ఘకాలమని చెప్తున్నాయి. రుతుపవనాల ఉపసంహరణకు మరో నాలుగైదు రోజులు పడుతుందని ఐఎండీ వర్గాలు పేర్కొంటున్నాయి. దేశవ్యాప్తంగా 36 వాతావరణ సబ్‌డివిజన్లు ఉండగా.. మధ్యప్రదేశ్, సౌరాష్ట్ర-కచ్ డివిజన్లలో 'అత్యంత గరిష్ఠ వర్షపాతం' నమోదైంది.

**మెల్లగా మొదలై.. జోరు వానలు**

జూన్ ఒకటో తేదీన సాధారణంగా నైరుతి రుతుపవనాలు కేరళ తీరాన్ని తాకుతాయి. అప్పటినుంచి దేశంలో అధికారికంగా వర్షాకాలం మొదలవుతుంది. కానీ.. ఈ ఏడాది దాదాపు వారంరోజులు ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించాయి. అంతేకాదు.. జూన్ నెలాఖరు వరకు మందగమనంలో ఉండటంతో 33% లోటు వర్షపాతం నమోదైంది. ఒక దశలో ఈ ఏడాది కరువు తప్పదేమోనన్న అనుమానాలు రేకెత్తాయి. కానీ.. జూలైలో పుంజుకొన్న రుతుపవనాలు.. ఆ నెలలో సాధారణంకంటే 33శాతం అధికంగా వానలు కురిపించాయి. ఆగస్టులోనూ సాధారణస్థాయికంటే 15% అధికంగా వర్షాలుపడ్డాయి. ఇక సెప్టెంబర్ మాసం.. రికార్డులను బద్దలుకొట్టింది. అంతేకాదు.. ఆగస్ట్-సెప్టెంబర్.. ఈ రెండునెలల్లో కురిసిన వర్షాన్ని లెక్కిస్తే.. గత 31 ఏండ్లలో ఇదే గరిష్ఠం. ఆగస్టు తర్వాత రుతుపవనాలు పుంజుకోవటానికి ప్రధానంగా రెండు కారణాలను ఐఎండీ వర్గాలు చెప్తున్నాయి. మొదటిది.. సాధారణంగా రుతుపవనాలను అడ్డుకునే ఎల్‌నినో పరిస్థితులు జూలై నెలతో సమసిపోయాయి. అదే సమయంలో హిందూ మహాసముద్రం రుతుపవనాలకు అనుకూలంగా మారింది. ఈ రెండింటితోపాటు బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు ఏర్పడటం కూడా విస్తారంగా వర్షాలు కురిసేందుకు కారణమైంది.

# ఇది నవ భారత శకం

### యావత్ ప్రపంచం మనవైపు చూస్తున్నది

- యువత ఆవిష్కర్తలుగా, వ్యాపారవేత్తలుగా మారాలి
- మద్రాస్ ఐఐటీ స్నాతకోత్సవంలో ప్రధాని మోదీ పిలుపు

**చెన్నై, సెప్టెంబర్ 30:** ప్రపంచం మొత్తం ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నదని ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు. ఇటీవలి తన అమెరికా పర్యటనలో ఆసాంతం 'నవ భారత్' గురించి ఆశావాద దృక్పథం కనిపించిందని తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు శాస్త్రసాంకేతిక రంగాల్లో తమదైన ముద్ర వేశారని ప్రశంసించారు. సోమవారం చెన్నైలోని మద్రాస్ ఐఐటీలో జరిగిన 56వ స్నాతకోత్సవంలో ప్రధాని పాల్గొన్నారు. ఐఐటీలోని రీసెర్చ్ పార్క్‌లో రెండురోజులపాటు నిర్వహించిన 'సింగపూర్-ఇండియా హ్యాకథాన్ 2019'లో విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. 'భారతదేశం అవకాశాల స్వర్గమంటూ ప్రపంచదేశాలన్నీ భారత్‌వైపు చూస్తున్నాయి. ఇటీవలి నా అమెరికా పర్యటనలో అనేకమంది దేశాధ్యక్షులను, పారిశ్రామికవేత్తలను, ఆవిష్కర్తలను, వ్యాపారవేత్తలను కలిశాను. మా మధ్య జరిగిన అంతర్గత చర్చల్లో అందరూ నవ భారత్ పట్ల ఆశావాద దృక్పథంతో కనిపించారు. భారతదేశ యువత సామర్థ్యంపై వారికి అపార విశ్వాసం ఉన్నది' అని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో విద్యార్థులు బయటి ప్రపంచంలోకి అడుగుపెడుతుండటం సంతోషంగా ఉన్నదన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న భారతీయులు ప్రతిరంగంలోనూ రాణిస్తున్నారని, ముఖ్యంగా శాస్త్రసాంకేతిక రంగంలో, వినూత్న ఆవిష్కరణల్లో తమదైన ముద్రవేశారని కొనియాడారు. వీరిలో ఎక్కువ శాతం మంది ఐఐటీ విద్యార్థులే కావడం విశేషమన్నారు.

**దేశం గురించి ఆలోచించండి**

కళాశాల నుంచి బయటికి వెళ్లే విద్యార్థులు నిర్భయంగా ముందడుగు వేయాలని మోదీ సూచించారు. 'బయట అడుగుపెట్టే సమయానికి మీకోసం ఎన్నో అవకాశాలు ఎదురు చూస్తూ ఉంటాయి. వాటిని సద్వినియోగం చేసుకోండి. అయితే నాదొక చిన్న విన్నపం. మీరు ఎక్కడ? ఎలాంటి ఉద్యోగంలో ఉన్నా.. మాతృభూమిని మాత్రం మరిచిపోవద్దు. మీ శ్రమ, మీ ఆవిష్కరణ, మీ పరిశోధన ఫలితాలు మిగతా భారతీయులకు ఏదో ఒక రూపంలో సహాయపడేలా చూడండి' అని ప్రధాని కోరారు. విద్యార్థుల ఆవిష్కరణలు సామాజిక కోణంలోనే కాకుండా వ్యాపార కోణంలోనూ విజయం సాధించేలా ఉండాలని సూచించారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపేదిశగా భారత్ కృషిచేస్తున్నదని మోదీ పేర్కొన్నారు. తమిళ ప్రజలను కలువడమంటే తనకు ఎంతో ఇష్టమంటూ తమిళంలో చెప్పారు. తమిళ భాష అమెరికాలో సైతం ప్రతిధ్వనిస్తున్నదని పేర్కొన్నారు.



మద్రాస్ ఐఐటీ స్నాతకోత్సవంలో విద్యార్థినికి డిగ్రీ పట్టా అందజేస్తున్న ప్రధాని మోదీ

## బోల్తా పడ్డ బస్సు.. 21 మంది మృతి

- 53 మందికి గాయాలు
- 35 మంది పరిస్థితి విషమం
- గుజరాత్‌లో ఘటన



పల్టీలు కొట్టి బోల్తా పడిన బస్సు.. కొనసాగుతున్న సహాయక చర్యలు

**అహ్మదాబాద్, సెప్టెంబర్ 30:** ఆలయాన్ని సందర్శించుకొని వారంతా ఆనందంగా ఇంటికి వెళ్తున్నారు. ఇంతలోనే ఊహించని మలుపులో మృత్యువు వారి మీద విరుచుకుపడింది. ఏకంగా 21 మంది మృత్యువాత పడ్డారు. మరో 53 మంది గాయాలపాలయ్యారు. ఈ విషాద ఘటన గుజరాత్‌లోని బనస్కాంత జిల్లా పరిధిలో చోటుచేసుకుంది. అంక్లేవ్ అనే గ్రామానికి చెందిన వాళ్లు అంబాజీ పట్టణంలోని అంబాజీ దేవాలయాన్ని సందర్శించుకోవటానికి ఒక ప్రైవేట్ బస్సులో వెళ్లి.. సోమవారం సాయంత్రం తిరుగు ప్రయాణమయ్యారు. అంబాజీ-దంత రహదారి సమీపాన కొండ మార్గంలో త్రిశూలియా ఘాట్ వద్ద బస్సు అదుపు తప్పి బోల్తా పడి తలకిందులైంది. 21 మంది అక్కడికక్కడే మరణించగా, మరో 53 మంది గాయపడ్డారు. వారిలో 35 మంది పరిస్థితి విషమంగా ఉంది. భారీ వర్షాలు కురవడం, కొండ ప్రాంతం కావడంతో టైర్లు అదుపుతప్పి ఈ ప్రమాదం జరిగినట్టు తెలుస్తున్నది.

## నీట మునిగిన పడవ.. ఇద్దరు గల్లంతు

**38 మందిని రక్షించిన సహాయ సిబ్బంది.. పశ్చిమ బెంగాల్‌లో ఘటన**

**మిడ్నాపూర్, సెప్టెంబర్ 30:** పశ్చిమబెంగాల్‌లోని ఈస్ట్ మిడ్నాపూర్ జిల్లా పరిధిలో రూప్‌నారాయణ్ నదిలో పడవ మునిగిపోవడంతో ఇద్దరు వ్యక్తుల ఆచూకీ గల్లంతైంది. 38 మంది ప్రయాణికులను రక్షించారు. సోమవారం ఉదయం ఎనిమిది గంటలకు ఈస్ట్ మిడ్నాపూర్ జిల్లా మాయచార్ నుంచి అమృత్‌బెరియా వైపు బయలుదేరి వెళుతున్న పడవను పెద్ద అల తాకడంతో ప్రవాహంలో మునిగిపోయింది. పశ్చిమబెంగాల్ రాష్ట్ర రవాణాశాఖ మంత్రి సువేందు అధికారి మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే జిల్లా పోలీసులు, కోస్ట్ గార్డ్ సిబ్బంది సహాయ చర్యలు చేపట్టారని తెలిపారు. ఈ ఘటనలో ఒకరిద్దరి ఆచూకీ గల్లంతై ఉండొచ్చునని చెప్పారు. జిల్లా కలెక్టర్ పార్థా ఘోష్ మాట్లాడుతూ నీట మునిగిన పడవలో 40 మంది వరకు ప్రయాణికులు ఉండవచ్చునన్నారు. తాము 38 మందిని రక్షించామన్నారు. పడవల యజమానులు నిత్యం వాటి సామర్థ్యాన్ని మించి ప్రయాణికులను తరలిస్తుంటారని స్థానికులు ఆరోపించారు.

## జస్టిస్ తహిల్ రమణిపై సీబీఐ దర్యాప్తు!

**న్యూఢిల్లీ:** మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్ పదవికి రాజీనామా చేసిన విజయ కమలేశ్ తహిల్ రమణిపై స్థిరాస్థి అక్రమ లావాదేవీలకు సంబంధించి చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి కేంద్ర దర్యాప్తు సంస్థ(సీబీఐ)కి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ గొగొయ్ ఆమోదం తెలిపారు. మద్రాస్ హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఉన్నప్పుడు కొన్ని స్థిరాస్తి లావాదేవీలకు సంబంధించిన అంశాల్లో ఆమె అక్రమాలకు పాల్పడ్డారని ఇంటెలిజెన్స్ బ్యూరో(ఐబీ) ఆరోపించినట్టు సమాచారం. పరిపాలన నిర్ణయాల్లో కూడా అక్రమాలు జరిగాయంటూ తహిల్ రమణికి వ్యతిరేకంగా ఐబీ ఐదు పేజీల నివేదికను సుప్రీంకోర్టుకు సమర్పించినట్టు తెలిసింది. దీన్ని పరిగణలోకి తీసుకున్న జస్టిస్ రంజన్ గొగొయ్.. తహిల్ రమణిపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి సీబీఐకి సోమవారం అనుమతిచ్చినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి.

## సీఎం పదవిపై శివసేన కన్ను!

**ముంబై:** ఈ నెల 21న జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీ సాధించి, సీఎం పదవిని కైవసం చేసుకోవాలని శివసేన ప్రణాళికలు రచిస్తున్నట్లుగా తెలుస్తున్నది. దీంట్లోభాగంగానే తన కుమారుడు ఆదిత్య ఠాక్రేను ఎన్నికల బరిలోకి పార్టీ అధ్యక్షుడు ఉద్ధవ్ ఠాక్రే దింపారని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. వాస్తవానికి 1966లో శివసేన పార్టీని బాల్‌ఠాక్రే ఏర్పాటు చేసినప్పటి నుంచి.. ప్రభుత్వాలను వెనుకనుంచి నియంత్రించటమేగానీ, ఆ కుటుంబం నుంచి ఎవరూ కూడా ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేయలేదు. ఈ సంప్రదాయాన్ని పక్కనబెట్టి తొలిసారిగా ఆదిత్య.. ఎన్నికల బరిలో వర్లీ నుంచి పోటీ పడనున్నారు. శివసేన భారీ మెజార్టీ సాధిస్తే కాబోయే సీఎం ఆదిత్యనే అని ఆ పార్టీ ప్రచారం చేస్తున్నది.

## మహారాష్ట్రలో మరో ఏడు స్థానాలకు మజ్లిస్ అభ్యర్థులు

**ఔరంగాబాద్, సెప్టెంబర్ 30:** మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మరో ఏడు స్థానాల్లో మజ్లిస్ పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. దీంతో అక్టోబర్ 21న జరిగే మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో మజ్లిస్ పార్టీ పోటీ చేసే స్థానాల సంఖ్య 24కు చేరుకున్నది. ఇంతకుముందు వంచిత్ బహుజన్ ఆఘాదితో పొత్తు పెట్టుకున్న మజ్లిస్ పార్టీ ఈ దఫా సొంతంగానే పోటీ చేస్తున్నది.

## 'కశ్మీర్‌ను భారత్ ఆక్రమించింది'



**న్యూఢిల్లీ:** కశ్మీర్ అంశంలో మలేషియా ప్రధాని మహతీర్ మహ్మద్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. భారత్ దాడి చేసి కశ్మీర్‌ను ఆక్రమించిందని ఆరోపించారు. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశంలో ప్రసంగించిన సందర్భంగా ఆయన ఈ వాఖ్యలు చేశారు. జమ్ముకశ్మీర్‌లో భారత్ చేపట్టిన చర్యలకు ఎలాంటి కారణాలు ఉన్నప్పటికి అది ముమ్మాటికి తప్పేనని మహతీర్ అన్నారు. పాకిస్థాన్‌తో చర్చించి సమస్యను పరిష్కరించుకోవాలని భారత్‌కు సూచించారు. అనంతరం ఐరాస ప్రధాన కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన మహతీర్, కశ్మీర్ సమస్యను దాడులతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సెప్టెంబర్ 5న రష్యాలో సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోదీకి చెప్పానన్నారు. జమ్ముకశ్మీర్‌కు స్వయం ప్రతిపత్తి కల్పించే అధికరణ 370ని ఎందుకు రద్దు చేశామన్నది మోదీ తనకు వివరించినప్పుడు ఈ సూచన చేసినట్లు తెలిపారు.

## ఖషోగ్గి హత్యకు ఆదేశించాననడం అవాస్తవం

**న్యూయార్క్:** తన ఆదేశాల మేరకే గతేడాది అక్టోబర్ రెండో తేదీన టర్కీ రాజధాని ఇస్తాంబుల్‌లోని తమ దౌత్య కార్యాలయంలో వాషింగ్టన్ పోస్ట్ సౌదీ జర్నలిస్టు జమాల్ ఖషోగ్గి దారుణ హత్య జరిగిందన్న ఆరోపణలు అవాస్తవం అని సౌదీ యువరాజు మహ్మద్ బిన్ సల్మాన్ పేర్కొన్నారు. ఇది అత్యంత క్రూరమైన నేరం అని అభివర్ణించారు. సీబీఎస్ చానెల్ నిర్వహించిన '60 మినిట్స్' కార్యక్రమానికి ఇచ్చిన ఇంటర్వ్యూలో సల్మాన్ మాట్లాడుతూ.. సౌదీ అరేబియా అధినేతగా ఈ ఘటనకు తాను పూర్తిగా బాధ్యత వహిస్తున్నానని చెప్పారు. కాగా 'జమాల్‌ను ఎందుకు చంపారు? ఆయన మృతదేహం ఎక్కడుంది? ఈ హత్య వెనుక ఉద్దేశం ఏమిటి?' అని ఖషోగ్గి ప్రియురాలు హేటిక్ సెంగిజ్ ప్రశ్నించారు. సల్మాన్ సమాధానం చెప్పాలన్నారు.

## ఆఫ్ఘన్ అధ్యక్ష ఎన్నికల్లో విజయం నాదే

**కాబూల్, సెప్టెంబర్ 30:** ఆఫ్ఘనిస్థాన్ అధ్యక్ష పదవికి జరిగిన ఎన్నికల్లో తనదే విజయం అని ఆ దేశ ముఖ్య కార్య నిర్వహణాధికారి (సీఈఓ) అబ్దుల్లా అబ్దుల్లా పేర్కొన్నారు. అబ్దుల్లాకు ప్రస్తుత దేశాధ్యక్షుడు అశ్రఫ్‌ఘనీ ప్రత్యర్థి. అబ్దుల్లా సోమవారం మీడియాతో మాట్లాడుతూ 'మాకు అత్యధిక ఓట్లు పోలయ్యాయి' అని చెప్పారు. అయితే, తన ప్రకటనకు సరైన ఆధారాలను చూపలేదు. కేంద్ర ఎన్నికల సంఘం (ఐఈసీ) తుది ఫలితాలను వెల్లడించాల్సి ఉందన్నారు. రెండో విడుత పోలింగ్‌కు వెళ్లాల్సిన అవసరం లేదన్నారు. తానే ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తానన్నారు. అబ్దుల్లా ప్రకటనపై సీనియర్ ఐఈసీ అధికారి హబీబ్ రహ్మాన్ నాంగ్ మండిపడ్డారు. విజేత ఎవరో తామే ప్రకటించాల్సి ఉంటుందన్నారు.



ఇరాన్ దూకుడుకు ముకుతాడు వేయటానికి ప్రపంచమంతా కలిసికట్టుగా పనిచేయకపోతే, చమురు ధరలు ఊహించని విధంగా పెరిగిపోతాయి. చమురు సరఫరాలో అంతరాయం ఏర్పడితే మన జీవితకాలంలో ఎన్నడూ చూడని స్థాయిలో పెట్రోలియం ధరలు ఉంటాయి.


**మహ్మద్ బిన్ సల్మాన్, సౌదీ అరేబియా రాజు**

బాధితురాలి అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టిన ప్రదర్శనను యూపీ ప్రభుత్వం అడ్డుకున్నది. మాజీ కేంద్రమంత్రి, లైంగికదాడి నిందితుడు చిన్మయానందను రక్షించటం కోసం బీజేపీ ప్రయత్నిస్తున్నది. షాజహాన్‌పూర్ బిడ్డ ఆక్రందనను ప్రభుత్వం అణిచివేస్తున్నది.

**ప్రియాంక గాంధీ వాద్రా, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి**



**చరిత్రలో నేడు**




**1843**

లండన్ నుంచి 'న్యూస్ ఆఫ్ ది వరల్డ్' ప్రచురణ ప్రారంభం.

**1864**

కలకత్తాను ముంచెత్తిన భయంకర తుఫాను. సుమారు 70వేల మంది మృతి.





**1867**

కార్ల్ మార్క్స్ 'దాస్ కాపిటల్' ముద్రణ.

యూఎన్ఓ వేదికపై ఊహించినట్లుగానే పాక్ అధ్యక్షుడు ఇమ్రాన్ ఖాన్ ఎప్పట్లాగే భారత్‌పై బురదజల్లాడు. భారత్ కశ్మీర్ విషయంలో హక్కుల హననానికి పాల్పడుతున్నదని నిందించాడు. ప్రపంచ దేశాలు పట్టించుకోనట్లయితే ఉద్రిక్తతలు పెరిగి అణుయుద్ధం దాకా పోతే అంతర్జాతీయ సమాజం బాధ్యత వహించాలని బెదిరింపులకు దిగారు. కానీ ప్రధాని మోదీ ఉగ్రవాదంపై అన్నిదేశాలు దృష్టిసారించాలని చెబుతూనే వాతావరణ మార్పు, పేదరిక నిర్మూలన లాంటి విషయాలను ప్రస్తావించి భారత్ తీరుకు ప్రతీకగా నిలిచిన విధానం ముదావహం.

**ది టైమ్స్ ఆఫ్ ఇండియా**

పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో ఆపరేటివ్ బ్యాంక్ (పీఎంసీ) కూడా దివాలా తీసిందన్న వదంతులతో పలు రాష్ట్రాల్లోని వేలాదిమంది ఖాతాదారులు భయపడుతున్నారు. ఇటీవల రిజర్వ్‌బ్యాంకు పీఎంసీ నుంచి ఖాతాదారులు రూ.1000 కన్నా ఎక్కువ తీసుకోరాదన్న ప్రకటనతో ఈ బ్యాంకు కూడా దివాలా తీసిందన్న వదంతులు వచ్చాయి. మహారాష్ట్ర కేంద్రంగా ఆవిర్భవించిన ఈ బ్యాంకు ఢిల్లీ, గోవా, గుజరాత్, కర్ణాటక రాష్ట్రాల్లో ప్రజలకు సేవలందిస్తున్నది. మహారాష్ట్రలో కొన్నిరోజుల్లో ఎన్నికలు రాబోతున్న వేళ పీఎంసీ బ్యాంకు వ్యవహారం తీవ్ర చర్చనీయాంశమవుతున్నది.

**ది హిందూ**



# వైపరీత్యాల బాధ

వాతావరణ మార్పును అరికట్టడంపై ఇటీవలే ఐక్యరాజ్యసమితి సదస్సు ప్రధాని మోదీ సహా అనేకమంది దేశాధినేతలు ప్రసంగించారు. మరోవైపు భారత్ భారీ వానలు, వరద సమస్యలతో సతమతమవుతున్నది. దేశవ్యాప్తంగా కురుస్తున్న వానలకు దాదాపు రెండువందల మంది బలయ్యారు. ఉత్తరప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తరాఖండ్, జమ్ముకశ్మీర్ మొదలైన రాష్ట్రాలలో వానలు తీవ్ర ప్రాణ, ఆస్తి నష్టం కలిగించడంతోపాటు జన జీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఇతర రాష్ట్రాలలో కూడా వానలు ఇంత భారీనష్టాన్ని కలిగించనప్పటికీ తీవ్ర వరద సమస్యను సృష్టిస్తున్నాయి. హైదరాబాద్‌తో పాటు అహ్మదాబాద్, పుణె, లక్నో తదితర నగరాల్లో జడివానలు బీభత్సం సృష్టిస్తున్నాయి. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా దాదాపు 110 మంది ప్రాణాలు కోల్పోయారు. బిహార్‌లో దాదాపు 30 మంది మరణించారు. దాదాపు 26 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. పడవల ద్వారా సహాయ కార్యక్రమాలను చేపడుతున్నారు. ఆకాశం నుంచి చూస్తే పాట్నా నగరం ఒక చెరువు మాదిరిగా మధ్యలో ఇండ్ల నిర్మాణాలు కట్టినట్టుగా కనిపిస్తున్నదని చెబుతున్నారు. మహారాష్ట్రలోని పుణె జిల్లాలోనూ ఇరువై మందికిపైగా మరణించారు. వేలాదిమందిని ముంపు ప్రాంతాల నుంచి తరలించారు. ఇప్పటికే పలు రాష్ట్రాలలో ప్రకృతి బీభత్సాలను ఎదుర్కొనే వ్యవస్థలు ఏర్పాటయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వాలు విపత్తుల నిర్వహణ బృందాల తోడ్పాటుతో సహాయక చర్యలను చేపడుతున్నాయి. అయినా మన దేశంలో ప్రకృతి సృష్టిస్తున్న బీభత్సాలను ఎదుర్కొనడంలో ఇంకా నేర్చుకోవలసింది, చేయవలసింది ఎంతో ఉన్నదని ఈ అనుభవాలను బట్టి తెలుస్తున్నది.

ఐరాస ఆధ్వర్యంలోని 'వాతావరణ మార్పుపై అంతర్ ప్రభుత్వ కమిటీ' (ఐపీసీసీ) వాతావరణ మార్పు ప్రభావాలపై సెప్టెంబర్ 25న ఒక నివేదికను విడుదలచేసింది. ఇందులో భారత్‌కు సంబంధించిన అంశాలు పరిశీలనార్హమైనవి. హిమాలయాలలోని మంచు కరుగుడు ప్రభావం దేశ ప్రజలపై విపరీతంగా ఉంటుంది. ఈ మంచు పది భారీ నదులకు ఆధారం. ఇక్కడి జీవ వైవిధ్యానికి, జీవనానికి ఆయువుపట్టు. రెండువందల కోట్లమంది జీవితాలపై ఈ ప్రభావం ఉంటుంది. వాతావరణ మార్పు వల్ల సముద్ర మట్టాలు పెరుగుడు ప్రభావం కూడా భారత్‌పై తీవ్రంగా ఉంటుంది. భారత్‌లో రుతుగమనాల రాకపోకలు మారిపోయి, అంచనా వేయడం కష్టంగా మారుతున్నది. తుఫానులు తీవ్రంగా మారుతయి. గంగా, బ్రహ్మపుత్ర వరదలు మరింత కల్లోలం సృష్టిస్తాయి. 7,500 కిలోమీటర్ల పొడుగునా ఉండే తీర ప్రాంతంలోని 56 కోట్ల మంది జీవితాలపై ఈ ప్రభావం ఉంటుంది. తీర ప్రాంత నగరాలైన ముంబయి, కోల్‌కతా, చెన్నై మరింత తీవ్రరీతిలో వరద ముప్పును ఎదుర్కొంటాయి. సముద్ర నీటిమూలంగా తీర ప్రాంత భూములు వ్యవసాయానికి పనికిరాకుండాపోతాయి. మంచి నీటి సమస్య కూడా తలెత్తుతుంది. వరదలే కాదు, కరువులూ ఈ ప్రాంత ప్రజలను పీడిస్తాయి. కొన్ని ప్రాంతాలు వరదమయం అవుతుంటే మరికొన్ని ప్రాంతాలు నీటికి కటకటలాడుతయి. ఈ సమస్యలన్నీ ఇప్పటికే అనేక సార్లు చర్చించుకున్నవే. కానీ ఇప్పుడు అనుభవానికి వచ్చిన సందర్భమిది. పైగా ప్రకృతి వైపరీత్యాలు ఏ రూపంలో ఎట్లా వస్తాయో ఊహించేటివి కావు. వాటి ప్రభావాలు కూడా అనూహ్యమే. అన్ని ప్రాంతాలలో ఒకేవిధమైన ప్రభావం ఉండదు. వైపరీత్యాలు ప్రతిసారి అదే రీతిలో సంభవించవు. అందువల్ల వీటిని ఎదుర్కొనడం ప్రభుత్వాలకు పెద్ద సవాలు.

> **ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడం, సహాయం అందించడం నగరాలలో ఒక రీతిలో, పల్లెలో మరోవిధంగా ఉంటుంది. అందువల్ల ప్రజలను ఈ వైపరీత్యాలకు తట్టుకునేవిధంగా సమాయత్తం చేయాలె. నగరాల నిర్మాణాలు, జనజీ వనంలో మార్పు రావాలె. మనం ఒక పెద్ద ఉత్పాతాన్ని తరచు ఎదుర్కొంటూ ఉంటామనే స్పృహ ప్రభుత్వాలకు, ప్రజలకు ఏర్పడాలె. దేశంలో ఎక్కువమంది ఆధారపడేది వ్యవసాయం మీదనే. అందువల్ల ప్రకృతి వైపరీత్యాల ప్రభావం దేశ ఆర్థికవ్యవస్థపై కూడా ఉంటుంది.**

సెప్టెంబర్ చివరివారంలో ఇంత భారీగా వానలు కురువడమేమిటనేది చాలా మందిని ఆశ్చర్యపరుస్తున్నది. ఈ పాటికి రుతుపవనకాలం ముగింపునకు వచ్చేదశ ఇది. కానీ వానలు ఇంకా కొనసాగడమే కాదు, అక్టోబర్‌లో కూడా కురియవచ్చునని వాతావరణ వేత్తలు అంటున్నారు. రాజస్థాన్‌లో సెప్టెంబర్ ఒకటి నాటికి వెనుకకు మళ్ళాల్సిన రుతుపవనాలు అక్టోబర్ రెండవ వారంలో కానీ తిరోగమించవని ఒక అంచనా. ఒకసారి రుతుపవనాలు గతితప్పిన తర్వాత ఎప్పుడు వస్తాయో, ఏ విధమైన బీభత్సాన్ని చూపిస్తాయో చెప్పలేం. వాతావరణ మార్పు ప్రభావాలు ఏ విధంగా ఉండబోతున్నాయనే అంచనాలు ఇప్పటివరకు స్పష్టంగా లేవు. అవి మన అంచనాకు అందకపోవచ్చు. అయినా అధ్యయనాలు సాగించవలసిందే. ప్రకృతి ఆగ్రహం ఏ రూపంలో వచ్చినా తట్టుకునేవిధంగా విపత్తు నిర్వహణ వ్యవస్థలను రూపొందించుకోవాలె. ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోవడం, సహాయం అందించడం నగరాలలో ఒక రీతిలో, పల్లెలో మరోవిధంగా ఉంటుంది. అందువల్ల ప్రజలను ఈ వైపరీత్యాలకు తట్టుకునేవిధంగా సమాయత్తం చేయాలె. నగరాల నిర్మాణాలు, జనజీవనంలో మార్పు రావాలె. మనం ఒక పెద్ద ఉత్పాతాన్ని తరచు ఎదుర్కొంటూ ఉంటామనే స్పృహ ప్రభుత్వాలకు, ప్రజలకు ఏర్పడాలె. దేశంలో ఎక్కువమంది ఆధారపడేది వ్యవసాయం మీదనే. అందువల్ల ప్రకృతి వైపరీత్యాల ప్రభావం దేశ ఆర్థికవ్యవస్థపై కూడా ఉంటుంది. ఆహార భద్రత కూడా దెబ్బతింటుంది. ఐరాస ఐపీసీసీ నివేదిక కూడా ఈ హెచ్చరికను చేసింది. ఈ రంగాలలో కూడా ప్రభుత్వాలు సమాయత్తం కావాలె.

**నీటిపారుదల**



**శ్రీధర్‌రావు దేశ్‌పాండే**

# తలసరి నీటినిల్వ పెరుగాలె

**ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్పులకు అనేక కారణాలున్నప్పటికీ అడవుల నరికివేత ప్రధానమైన కారణంగా ముందుకువచ్చింది. ఈ మార్పులు రుతుపవనాల మీద ఆధారపడిన వ్యవసాయిక దేశాలైన భారత్, పాక్, బంగ్లా, శ్రీలంక, నేపాల్, మయన్మార్ తదితర దక్షిణాసియా దేశాల మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకప్పుడు వానకాలం 4 నెలలు వర్షపాతం ఉండేది. ఇప్పుడు సగటు వర్షపాతంలో తగ్గుదల లేకపోయినా వర్షం కురిసే దినాలు సుమారు 25-30 రోజులకు పడిపోయాయి.**

సెప్టెంబర్ 1-4 వరకు ఇండోనేషియా, బాలి ద్వీపంలో ఇరిగేషన్ డ్రైనేజ్‌పై ఒక అంతర్జాతీయ సదస్సు జరిగింది. ఈ సదస్సులో సమర్పణ కోసం తెలంగాణ ఇంజినీర్లు రాసిన మూడు సాంకేతికపత్రాలు ఎంపియ్యాయి. తెలంగాణ నుంచి నాతో పాటు మరో నలుగురు ఇంజినీర్లం ఈ సదస్సులో పాల్గొన్నాం. 4 రోజులపాటు జరిగిన ఈ సదస్సులో పలు దేశాలకు చెందిన ప్రతినిధులు పత్రాలను ప్రవేశపెట్టారు. ఆ పత్రాలపై విస్తృత చర్చ జరిగింది. భారత్ నుంచి ఇతర రాష్ట్రాల ప్రతినిధులు, కేంద్ర జలసంఘం ప్రతినిధులు ప్రవేశపెట్టిన పత్రాల్లో తెలంగాణలో అమలవుతున్న కార్యక్రమాల ప్రస్తావన ఉండటం విశేషం. గ్రామీణ ప్రాంతాల్లో నీటి, ఆహారభద్రత సాధించడానికి, గ్రామీణ ప్రజలకు స్థానికంగా ఉపాధి కల్పనకు, గ్రామాల నుంచి పట్టణాలకు వలసల నివారణకు తెలంగాణ రాష్ట్రం అమలుచేస్తున్న చెరువుల పునరుద్ధరణ కార్యక్రమం మిషన్ కాకతీయ మిగతా రాష్ట్రాలకు ఆదర్శమని కొనియాడారు. కాలువల ద్వారా నీటి సరఫరాలో చివరి భూములకు నీరందివ్వడంలో విఫలమవుతున్నామని, నిర్దేశిత ఆయకట్టుకు, నీరందుతున్న ఆయకట్టుకు మధ్య 40 శాతం గ్యాప్ ఉందని, ఈ వైఫల్యాన్ని అధిగమించడానికి, ఈ గ్యాప్ పూరించడానికి తెలంగాణలో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులో జయప్రదంగా అమలుచేసిన కింద నుంచి ఎగువకు నీటి నిర్వహణ పద్ధతి అనుసరణీయమని వక్తలు కొనియాడారు. నదుల మీద నిర్మించే జలాశయాలకు పూడిక అనేది ఒక ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది. ప్రపంచంలోని అన్నిదేశాల్లోని జలాశయాలకు ఈ సమస్య ఉన్నదని పేర్కొన్నారు. ఈ సమస్యను అధిగమించడానికి వారు ఆఫ్‌లైన్ జలాశయాలను నిర్మించాలని సూచించినారు. ఈ సూచన తెలంగాణలో ఇప్పటికే కాళేశ్వరం, పాలమూరు రంగారెడ్డి, డిండి తదితర ఎత్తిపోతల పథకాల్లో అమలవుతుండటం విశేషం. సదస్సులో మరో కీలక అంశం చర్చకు వచ్చింది. రాబోయే దశాబ్దాల్లో ప్రజలకు నీటిభద్రత, ఆహార భద్రతకు పూచి ఇవ్వాలంటే ప్రపంచదేశాలు తలసరి నీటి లభ్యతను, తలసరి నీటినిల్వను పెంచుకోవాలని సూచన చేశారు. ఈ అంశంపై కేంద్ర జలసంఘం మాజీ చైర్మన్, ప్రస్తుతం ఐసీఐడీ సెక్రెటరీ జనరల్‌గా ఉన్న ఏబీ పాండ్యగారి పత్రం 'Role of Storages and Basin Mana-gement Strategies in India' నన్ను, నా సహచరులను ఆకర్షించింది. అం దులో ఆయన చర్చించిన అంశాలను చూద్దాం.

ప్రపంచవ్యాప్తంగా వాతావరణంలో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ మార్పులకు అనేక కారణాలున్నప్పటికీ అడవుల నరికివేత ప్రధానమైన కారణంగా ముందుకువచ్చింది. ఈ మార్పులు రుతుపవనాల మీద ఆధారపడిన వ్యవసాయిక దేశాలైన భారత్, పాక్, బంగ్లా, శ్రీలంక, నేపాల్, మయన్మార్ తదితర దక్షిణాసియా దేశాల మీద తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయి. ఒకప్పుడు వానకాలం 4 నెలలు వర్షపాతం ఉండేది. ఇప్పుడు సగటు వర్షాపాతంలో తగ్గుదల లేకపోయినా వర్షం కురిసే దినాలు సుమారు 25-30 రోజులకు పడిపోయాయి. వర్షం నెల, నెలన్నర రోజులు అసలే కురువదు. కురిస్తే రెండు, మూడ్రోజుల్లో భారీ వర్షం కురిసిపోతుంది. తర్వాత మళ్ళీ వర్షం పత్తా ఉండదు. ఈ దోబూచులాట మనం కొన్నేండ్లుగా చూస్తున్నాం. ఈ పరిస్థితి ఈయేడు కూడా మన అనుభవంలోకి వచ్చించి. జూన్, జూలైలలో వానలు లేక కరువు పరిస్థితులను చూశాం. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో తీవ్రమైన వర్షపాతం, నదుల్లో వరద బీభత్సం చూశాం. అక్టోబర్ నుంచి తిరిగి ఎండలు దంచికొట్టే పరిస్థితులు వస్తాయి. ఈ 25, 30 రోజుల్లో కురిసే భారీ వర్షపునీటిని ఒడిసిపట్టే జలాశయాలు దేశంలో తగినంత లేవు. ఈ కారణంగా దేశంలో చిత్రమైన పరిస్థితి నెలకొంటున్నది. కరువులు-వరదలు ఏటా పునరావతమవుతున్నాయి. భారతదేశంలో తలసరి నీటిలభ్యత, తలసరి నీటి నిల్వ సామర్థ్యం మిగతా దేశాలతో పోలిస్తే చాలా తక్కువ. వివరాలు కింది పట్టికలో చూడవచ్చు.

| దేశం | తలసరి నీటిలభ్యత (ఘనపు మీటర్లు) | తలసరి నీటి నిల్వ (ఘనపు మీటర్లు) |
|---|---|---|
| రష్యా | 31,883 | 6103 |
| ఆస్ట్రేలియా | 21,764 | 4733 |
| బ్రెజిల్ | 41,865 | 3145 |
| అమెరికా | 9802 | 1964 |
| టర్కీ | 2890 | 1739 |
| చైనా | 2060 | 1111 |
| భారత్ | 1545 | 210 |

పై పట్టికలోని సమాచారం ఆధారంగా పాండ్యా ఆసక్తికరమైన విశ్లేషణ చేశారు. ఏడాదికి తలసరి నీటి లభ్యత 1700 ఘనపు మీటర్లకు తగ్గితే అది నీటి ఒత్తిడికి సూచిక. 1000 ఘనపు మీటర్లకు తగ్గితే అక్కడ నీటి సంక్షోభానికి సూచన. ఈ సూచికకు నాలుగింతల ఎక్కువగా రష్యాలో తలసరి నీటిలభ్యత, తలసరి నీటి నిల్వ ఉన్నది. ఈ కారణంగా రష్యా నాలుగేండ్ల వరుస కరువులను తట్టుకోగలుగుతుంది. అదేవిధంగా ఆస్ట్రేలియా మూడేండ్ల వరుస కరువులను తట్టుకోగలుగుతుంది. భారత్‌లో తలసరి నీటి లభ్యత, తలసరి నీటి నిల్వ సామర్థ్యం చాలా తక్కువగా ఉన్న కారణంగా 3,4 నెలల కంటే మించి కరువును ఎదుర్కోలేదు. దేశంలోని అన్ని ప్రధాన నదులపై తగినంత నీటినిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాల్లేవు. గంగా, బ్రహ్మపుత్ర లాంటి అత్యధిక నీటిలభ్యత ఉన్న నదులపై కూడా తగినంత నీటినిల్వ సామర్థ్యం ఉన్న జలాశయాల్లేవు. ఈ నీరంతా సముద్రంలోకి వెళ్లిపోతున్నది. గంగానదిలో ఏటా సుమారు 18,000 టీఎంసీలు లభ్యమవుతాయి. తలసరి నీటి లభ్యత లెక్కగడితే అది 900 క్యూబిక్ మీటర్లు. బ్రహ్మపుత్ర నదిలో ఏటా సుమారు 18,600 టీఎంసీల నీటి లభ్యత ఉంటే తలసరి నీటిలభ్యత 12,000 క్యూబిక్ మీటర్లు. బ్రహ్మపుత్ర నది బేసిన్‌లో జనాభా గంగా బేసిన్‌తో పోల్చినప్పుడు చాలా తక్కువ. అయితే దేశంలోనే అత్యధిక నీటి లభ్యత ఉన్న ఈ నదులపై తగినంత నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాల నిర్మాణం జరుగకపోవడం చేత అపారమైన ఈ నీరు వృథాగా సముద్రంలోకి వెళ్లిపోతున్నాయి. ఈ రెండు నదులతో పోలిస్తే గోదావరి, కృష్ణానదులు నీటిలభ్యత తక్కువ కానీ తలసరి నీటినిల్వ సామర్థ్యం వీటి కంటే మెరుగ్గా ఉన్నది. 18,600 టీఎంసీల నీటిలభ్యత ఉన్న బ్రహ్మపుత్ర నదిపై నికర నిల్వ సామర్థ్యం కేవలం 2.40 టీఎంసీలంటే నమ్మశక్యం కాదు. కానీ అది నిజం. అదేవిధంగా 18 వేల టీఎంసీల నీటి లభ్యత ఉన్న గంగా నదిపై నికర నిల్వ సామర్థ్యం 1992.68 టీఎంసీలు. 4156 టీఎంసీల నీటిలభ్యత ఉన్న గోదావరి నదిపై నికర నిల్వ సామర్థ్యం 1541 టీఎంసీలు. 3143 టీఎంసీల నీటిలభ్యత ఉన్న కృష్ణానదిపై నికరనిల్వ సామర్థ్యం 1920 టీఎంసీలు. గంగానది కంటే కొద్దిగా తక్కువ. తగినంత నీటి నిల్వ సామర్థ్యం లేని కారణంగా 4 నెలల వానకాలంలో గంగా, బ్రహ్మపుత్ర ఇతర ఉత్తరభారత నదులకు కరువులు-వరదలు-కరువులు ఎదుర్కోకతప్పటం లేదు. ఈ ఏడాది కూడా అదే పరిస్థితి ఎదురైంది.

దేశంలో ఉన్న అన్ని ప్రధాన నదులపై తగినంత నీటి నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాల నిర్మాణం జరుగనట్టయితే మారుతున్న వాతావరణ పరిస్థితుల వల్ల రాబోయేదశకాల్లో దేశం తీవ్ర నీటి సంక్షోభం, తద్వారా ఆహారభద్రతకు సంబంధించిన సవాళ్లు ఎదుర్కోవలసి ఉంటుందని ఆయన అభిప్రాయపడినారు. తెలంగాణ రాష్ట్రం ఈ అంశంలో సరైన దిశలోనే ప్రయాణిస్తున్నది. సీఎం కేసీఆర్ ప్రాజెక్టులను రీ ఇంజినీరింగ్ చేసే సమయంలో జలాశయాల నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవాల్సిన అవసరాన్ని గుర్తించారు. వానకాలం గడిచిపోయిన తర్వాత మన నదుల్లో నీటి ప్రవాహాలుండవు. ఆ సమయంలో మన సాగు, తాగునీటి అవసరాలు, పారిశ్రామిక అవసరాలను తీర్చేవి ఈ జలాశయాలే. ఉమ్మడి ఏపీ ప్రభుత్వాలు తెలంగాణ ఎత్తిపోతల పథకాల్లో తగినంత నిల్వ సామర్థ్యం ఏర్పాటుచేయా లన్న అంశంపై దృష్టిపెట్టలేదు. ప్రాణహిత చేవెళ్లలో 16 టీఎంసీలు, కల్వకుర్తిలో 4 టీఎంసీలు, నెట్టెంపాడులో 11 టీఎంసీలు, భీమాలో 8.50 టీఎంసీ లు, దేవాదులలో 8 టీఎంసీలు, ఎఎంఆర్‌పీలో 13 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రాజెక్టుల రీ ఇంజినీరింగ్‌లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులో 141 టీఎంసీలు, పాలమూరు రంగారెడ్డిలో 68 టీఎంసీలు, డిండిలో 25.56 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాలను ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఎక్కడ అనుకూలత ఉంటే అక్కడ జలాశయాలను ఏర్పాటుచేయాలని ఆయన భావిస్తున్నారు. కల్వకుర్తిలో నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి స్థలాల అన్వేషణ చేయాలని అధికారులను ఆదేశించారు. కడెం నదిపై 5.36 టీఎంసీల కుప్టి ప్రాజెక్టును ఆమోదించారు. గోదావరిపై సదర్‌మాట్, తుపాకులగూడెం ఆనకట్టల నిర్మాణం జరుగుతున్నది. కాళేశ్వరంలో భాగంగా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ఆనకట్టలు ఇప్పటికే పూర్తయినాయి. తుమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణం కోసం మహారాష్ట్రతో ఒప్పందం కుదిరింది. అక్కడ బరాజ్ నిర్మాణం కోసం అధ్యయనం జరుగుతున్నది. చనాఖా కోరాటా బరాజ్‌లో పిప్పల్కోటి, గోమూత్రి జలాశయాలను ఆమోదించారు. సీతారామ ప్రాజెక్టుకు నికరంగా నీటి సరఫరా కోసం దుమ్ముగూడెం ఆనకట్ట ఎత్తు పెంచి అక్కడ గోదావరి నదిపై నిల్వ సామర్థ్యాన్ని పెంచడానికి అధ్యయనం జరుగుతున్నది. దేవాదుల ప్రాజెక్టులో 10 టీఎంసీల లింగంపల్లి జలాశయాన్ని ఆమోదించారు. కాళేశ్వరం ప్రాజెక్టు రాడార్‌లో ఉన్న జలాశయాల్లో సుమారు 500 టీఎంసీల నీటిని నిల్వచేసుకునే వెసులుబాటు ఉన్నది. ఇవన్నీ రాష్ట్రంలో తలసరి నీటిలభ్యతను, తలసరి నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుకోవడా నికి దోహదం చేసేవి. ఈ అంశంపై అంతర్జాతీయంగా జరుగుతున్న చర్చకు అనుకూలంగానే సాగుతున్న ప్రక్రియ ఇది. బాలి సదస్సులో తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న పథకాలపై ప్రసంసాపూర్వక ప్రస్తావనలే అందుకు సాక్ష్యం.

> **తెలంగాణ ఏర్పాటు తర్వాత ప్రాజెక్టుల రీ ఇంజినీరింగ్‌లో భాగంగా కాళేశ్వరం ప్రాజెక్టులో 141 టీఎంసీలు, పాలమూరు రంగారెడ్డిలో 68 టీఎంసీలు, డిండిలో 25.56 టీఎంసీల నిల్వ సామర్థ్యం కలిగిన జలాశయాలను ముఖ్యమంత్రి ప్రతిపాదించారు. ఎక్కడ అనుకూలత ఉంటే అక్కడ జలాశయాలను ఏర్పాటుచేయాలని ఆయన భావిస్తున్నారు.**

**(వ్యాసకర్త: ముఖ్యమంత్రి ఓఎస్డీ)**

# మహాత్మా.. మళ్ళీ రా!

**గాంధేయవాదం**



**వేముగంటి శుక్తిమతి**

సత్యాహింసలు మూర్తీభవించి ప్రభవించిన వ్యక్తిగా విశ్వమంతటా ఖ్యాతిగాంచిన మహాత్మాగాంధీ 150వ జయంతి ఉత్సవాలు ఘనంగా జరుపుకుందాం. అహింస ఆయుధంతో పోరాడి పరాయి పాలనను అంతమొందించిన జాతీయవీరుడే గాంధీ. విశ్వమంతటా మానవసంబంధాలను అంతర్జాతీయ సహకారాన్ని వ్యాపింపజేసేందుకు ఆచరణాత్మక సూత్రాలను ప్రతిపాదించిన మాననీయుడు ఆయన.

గాంధీ దేశం సర్వతోముఖాభ్యుదయం కోసం ఆధ్యాత్మిక, పర్యావరణ, రాజకీయ, సాంఘికరంగాల్లో నిర్విరామంగా కృషిచేశాడు. అహింసాయుత సత్యాగ్రహ సమర మార్గాన్ని ఎంచుకున్నారు. అహింస ఆయుధంతోనే స్వరాజ్యాన్ని సాధించి ప్రపంచ చరిత్రలో మరెవ్వరూ పొందలేని స్థానాన్ని పొందారు. బ్రహ్మచర్య, వానప్రస్థ, సన్యాస, ఆశ్రమ ధర్మాలను నాలుగింటిని పాటించిన పూర్ణపురుషుడతడు. చతుర్విధ పురుషార్థముల అనుష్టించి సాధించుకున్న మహాయోగి. వీరి దృష్టిలో ఆధ్యాత్మికమనగా నైతికములు. ధర్మమనగా నీతి. సత్యమనగా స్వతంత్రం.

స్వాతంత్య్రం వచ్చాక ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వంలో ఆ పార్టీకి చెందనివారైన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్, శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ, సీడీ దేశ్‌ముఖ్‌లను ప్రభుత్వంలో మంత్రివర్గ సభ్యులుగా చేర్చుకోవాలని నెహ్రూకు సూచించిన రీతి ప్రజాస్వామికవ్యవస్థపై గాంధీకున్న ప్రగాఢ విశ్వాసానికి నిదర్శనం. అహింస స్వేచ్ఛాయుత సహకారం వల్లనే నిజమైన ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని వీరి నమ్మకం. ఏ ప్రభుత్వం ప్రజాపాలనలో తక్కువ జోక్యం కలిగించుకుంటుందో అదే శ్రేష్ఠమైన ప్రభుత్వం అని వీరి అభిప్రాయం.

1924 సెప్టెంబర్‌లో శ్రద్ధానందస్వామి ఢిల్లీ ప్రాంతంలో లేవదీసిన శుద్ధి ఉద్యమం ఫలితంగా హిందూ ముస్లింల మధ్య అల్లర్లు జరిగాయి. ఈ కలహాన్ని నిరసిస్తూ హిందూముస్లింల ఐక్యతనే తన జీవితంలో ప్రధాన ఉద్దేశమని ప్రకటించాడు. దేశ స్వాతంత్య్ర ప్రకటనతో దేశమంతా జయజయ ధ్వనులతో మార్మోగుతున్న తరుణంలో బెంగాల్‌లో జరుగుతున్న హిందూ ముస్లింల అల్లర్లను అణిచివేయటానికి ఉపవాసదీక్ష అనే అస్త్రంతో ప్రజ లను ఏకం చేయటానికి ప్రయత్నించాడు. ప్రపంచంలో అణుబాంబు కూడా నాశనం చేయనిదేదైనా ఉందంటే అదే అహింస అని గాంధీజీ ప్రకటించారు. అంతేగాక అహింసా ఆయుధాగారంలో నిరాహార దీక్ష ఆఖరి అస్త్రంగా తలిచాడు.

పాకిస్థాన్ నుంచి ఇండియాకు బాకీ ఉన్న ఒక పద్దులోని మొత్తాన్ని రాబట్టుకునేందుకుగాను ఇండియా తాను పాకిస్థాన్‌కు ఇవ్వవలసిన రూ.55 కోట్లు ఇవ్వటానికి ఆలస్యం చేసినప్పుడు గాంధీజీ మాటపై ఆ మొత్తం వెంటనే వారికి జమకట్టి వేశారు. ఇది వారి నైతికతకు ఉదాహరణ.

భారత నాగరికత వ్యవసాయిక నాగరికత అని ప్రపంచానికి అన్నం పెట్టే వ్యవసాయకుడు సంఘానికి మూలవిరాట్టుగా తలిచాడు. విచక్షణా రహిత యంత్ర వృద్ధిని వ్యతిరేకించారు. కానీ ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని వ్యతిరేకించలేదు. వీరి దృష్టిలో స్త్రీలకు అత్యంత గౌరవస్థానం ఉండేది. అన్నిరంగాల్లో స్త్రీలు ముందంజ వేయాలని, స్త్రీల పట్ల వివక్ష కూడదని సమాజానికి పిలుపునిచ్చారు. గాంధీ అంటరానితనాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తూ అంబేద్కర్‌తో సమానంగా దాని నిర్మూలన కోసం జీవితాంతం కృషి చేశారు.

స్వాతంత్య్ర పోరాటంలో ప్రజలను చైతన్యపరుస్తూ ఉపన్యాసాలు ఇస్తున్నప్పుడు, నిర్ణయాలు తీసుకుంటున్నపుడు, ఆశ్రమంలో ఉన్నప్పుడు గానీ ఎవరు తన అభిప్రాయాలను తిరస్కరించినా మహాత్ముడు ఓర్పుతో విని అవసరమైన సలహాలను తీసుకునేవాడు. ముస్లిం పక్షపాతిగా గాంధీని తలిచి హిందూ మతోన్మాది ఆ మహాత్మున్ని తుపాకీతో కాల్చి హత్యచేయటం పెద్ద విషాదం. మహాత్మాగాంధీ జీవితాంతం ఏ ఆశయాల కోసం పోరాడారో అవన్నీ నేడు భూస్థాపితమైపోతున్నాయి. ఏటా అక్టోబర్ 2న ఆయన ఫొటోకు బూజుదులిపి పూలదండల అలంకరణ, ఉపన్యాసాలు యథావిధిగా జరుగుతున్నవి. రానురాను కొత్తతరాలకు గాంధీ అనే పేరు మాత్రమే తెలిసి, గాంధీ జయంతి ఒక విగ్రహారాధన ప్రక్రియగా మారిపోయే ప్రమాదం పొంచి ఉన్నది.

దేశంలో గాంధీ స్మారకచిహ్నాలు పలుచోట్ల ఉన్నాయి. విజయవాడలో ఒక కొండకు గాంధీపర్వతం అని పేరు. భూతలం మీదనేగాక ఆకాశంలో కూడా ఆయన పేరుతో గాంధీ నక్షత్రమని నామకరణం చేయాలని ఆలోచన ఉందట! కానీ గాంధీ ఆయనను వ్యక్తిగతంగా కీర్తించడం, భజన చేయడం ఏవగించుకునేవాడు. కేవలం తన ఆశయాలను, నైతికతను, అహింసామార్గాన్ని, వాదాన్ని గౌరవిస్తూ అవి పాటించాలని కోరేవారు. కానీ ఆ ఆశయాలన్నీ మృగ్యమైపోయాయి. నేటి సమాజంలో పదవి, ధనానికే పట్టాభిషేకం జరుగుతున్నది. రోజురోజుకూ ప్రజాస్వామ్య విలువలు అంతరించిపోతున్నాయి. మత కల్లోలాలు మారణహోమాలు పెరిగిపోతున్నాయి. మానవ ప్రవృత్తి రోజురోజుకు సంకుచితమై, స్వార్థంతో నీచమైపోతున్నది. ఇలాంటి తరుణంలో ఈ పరిస్థితులను ప్రక్షాళన చేయాలంటే గాంధేయ వాదులు ఇంకా విస్తారంగా గాంధేయ సిద్ధాంతాల ఆశయాల సాహిత్యాన్ని విస్తృతంగా ప్రచారం చేయాలి.

నేటి సమాజానికి యువతకు దేశానికి గాంధీ ప్రబోధాలు అవసరం ఎంతో ఉన్నది. ఆయన బోధనలకు తిలోదకాలిస్తూ, ఆయనను కరెన్సీ నోట్లపై బొమ్మగా, రాయిగా చివరకు నక్షత్రంగా మార్చాలనుకోవడం అవివేకం. 'ఇంతటి మహనీయుడైన వ్యక్తి ఈనేలపై నడిచాడా!' అని భావితరాల వారు విస్తుపోతారని ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రవేత్త ఐన్‌స్టీన్ అన్నారు. మానవ ఔన్నత్యం కోసం మహాత్మాగాంధీ బోధించిన విలువలు, నైతిక ధర్మాలు నేటి సమాజానికి మార్గదర్శకం కావాలి. ఆయన ప్రబోధించిన సత్యం, అహింస, నైతికవర్తన విలువలను నేటి యువతలో పాదుకొల్పాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నది. ఈ మార్గంలో పయనిస్తూ గాంధీ ఆదర్శాలను సమాజంలో నెలకొల్పినప్పుడే ఓ ఉన్నతమైన మానవీయ సమాజం ఆవిష్కృతమవుతుంది. భావితరాలు ప్రగతిబాటలో పయనిస్తాయి. అదే సమగ్ర సమాజ ఉన్నతి.

> **గాంధీ ఆయనను వ్యక్తిగతంగా కీర్తించడం, భజన చేయడం ఏవగించుకునేవాడు. కేవలం తన ఆశయాలను, నైతికతను, అహింసామార్గాన్ని, వాదాన్ని గౌరవిస్తూ అవి పాటించాలని కోరేవారు. కానీ ఆ ఆశయాలన్నీ మృగ్యమైపోయాయి. నేటి సమాజంలో పదవి, ధనానికే పట్టాభిషేకం జరుగుతున్నది. రోజురోజుకూ ప్రజాస్వామ్య విలువలు అంతరించిపోతున్నాయి. మత కల్లోలాలు మారణహోమాలు పెరిగిపోతున్నాయి. మానవ ప్రవృత్తిరోజురోజుకు సంకుచితమై, స్వార్థంతో నీచమైపోతున్నది.**

**జనగళం**

## అందాల బతుకమ్మ



**అందాల బతుకమ్మ**
తెలంగాణ బతుకమ్మ
సిన్నాపెద్దా వాళ్లంతా సేరి
సిగురుపూలు ఏరికోరి తెచ్చి పేర్చిన బతుకమ్మ
తెలంగాణ బతుకమ్మ

జాజిపూల జాతరతో సాగుతున్న బతుకమ్మ
రెల్లుపూల నవ్వులలో హరివిల్లులాంటి బతుకమ్మ
సందమామ ఎన్నెల్లో
సల్లసల్లని బతుకమ్మ
అందాల తెలంగాణలో సిన్నారి నవ్వుల బతుకమ్మ

తంగేడు పూలతోటి బంగారుకాంతుల తోటి
గునుగుపూల సందడుల తోటి
గుప్పుమనే సూరీడు నవ్వుల తోటి
మెరిసిపోయే బతుకమ్మ

మా అందాల బతుకమ్మ
అందసందాల బతుకమ్మ
సిందులేయు ఆడపడుచుల
పసుపుకుంకుమల బతుకమ్మ
సిన్నారి బతుకమ్మ.

**– తిరునగరి శరత్‌చంద్ర**
**6309873682**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Katta Shekar Reddy.** Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

# వేగంగా బొగ్గు రవాణా

రైల్వేతో సింగరేణి ఒప్పందం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బొగ్గు రవాణాను వేగవంతానికి సోమవారం (ఇంజిన్ ఆన్ లోడింగ్) ఒప్పంద పత్రంపై రైల్వే చీఫ్ కమర్షిల్ మేనేజర్ ఎస్ క్రిస్టఫర్, సింగరేణి ఈడీ జే ఆల్విన్, ఏజీఎం ఎన్వీకే శ్రీనివాసులు సంతకాలు చేశారు. మంగళవారం నుంచి అమల్లోకి వచ్చే ఒప్పందం ప్రకారం సైడింగులకు వచ్చిన రేక్ (58 వ్యాగన్ల రైలు)ను 3 గంటల వ్యవధిలోనే నింపి బయటికి పంపేయాల్సి ఉంటుంది. ఇలా చేస్తే వెయిటింగ్ చార్జీలను రైల్వేశాఖ వసూలు చేయదు.

# పెద్ద శేషవాహనంపై శ్రీవారు

**తిరుమల, నమస్తే తెలంగాణ:** తిరుమలలో సోమవారం శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. సాయంత్రం 5.23 గంటల నుంచి 6 గంటల మధ్య మీన లగ్నంలో ధ్వజారోహణ ఘట్టం వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవిసమేత శ్రీమలయప్పస్వామివారి సమక్షంలో వేదగానాలు, మంగళవాయిద్యాల నడుమ అర్చకులు బంగారు ధ్వజస్తంభంపై గరుడధ్వజాన్ని ఎగురవేశారు. రాత్రి ఉభయదేవేరిలతో కలిసి స్వామివారు పెద్దశేషవాహనంపై తిరుమాడ వీధుల్లో విహరించారు. బ్రహ్మోత్సవాల తొలిరోజు ఏపీ రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డి, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో ఏవీ ధర్మారెడ్డి, తిరుపతి జేఈవో పీ బసంత్‌కుమార్ , ఆలయ డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.



శ్రీవారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న ఏపీ సీఎం జగన్.. బ్రహ్మోత్సవాల్లో సోమవారం పెద్ద శేషవాహనంపై ఊరేగుతున్న శ్రీవారు

# ఆర్మూర్ విద్యార్థికి మైక్రోసాఫ్ట్ భారీ ప్యాకేజీ

రోహన్‌కు ఏడాదికి
రూ.41.6 లక్షల వేతనం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన అంకరిగారి బీ రోహన్ రూ.41.6 లక్షల వార్షిక వేతనంతో మైక్రోసాఫ్ట్ ఉద్యోగానికి ఎంపికయ్యాడు. ఆయన గోకరాజు రంగరాజు ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో సీఎస్ఈ నాలుగో సంవత్సరం చదువుతున్నాడు. తమ కాలేజీలో నిర్వహించిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఇంత మొత్తం ప్యాకేజీ లభించడం ఇదే మొదటిసారి అని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్, డైరెక్టర్ ఎన్ జంధ్యాలమూర్తి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.





## ధర్మగంట



నర్సింహులపేట తాసిల్దార్ కార్యాలయం ఎదుట సొమ్మసిల్లి కింద పడిన రైతు సుధాకర్‌రెడ్డి

### పాస్‌పుస్తకం కోసం..

# సజీవసమాధికి యత్నం

భూమిలో సగం పూడ్చుకున్న రైతు.. సర్పంచ్ భరోసాతో బయటకు

**నర్సింహులపేట:** వారసత్వంగా రావాల్సిన భూమికి సంబంధించి పాస్‌పుస్తకం ఇవ్వకుండా తాసిల్దార్ వేధింపులకు గురిచేయడాన్ని నిరసిస్తూ మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేట మండలానికి చెందిన రైతు గుంతలో సగం పూడ్చుకుని సజీవసమాధికి యత్నించాడు. నర్సింహులపేట మండల పరిధి రామన్నగూడెం గ్రామానికి చెందిన రైతు మేక సుధాకర్‌రెడ్డి 2001లో తండ్రి నుంచి వారసత్వంగా వచ్చిన 15 ఎకరాలను సోదరులతో కలిసి పంచుకున్నారు. వాటాలు సరిగా పంపకాలు కాలేదని.. పదహారేండ్ల తర్వాత సోదరులు కోరడంతో మళ్లీ పంచుకోవాలంటూ పెద్ద మనుషుల సమక్షంలో తీర్మానం చేసుకున్నారు. కానీ, పలు కారణాలతో పంపకాలు జరుగకపోవడంతో 2017 నుంచి భూమి బీడుగా ఉంటూ వస్తున్నది. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో గతంలో పనిచేసిన తాసిల్దార్ సమక్షంలో పట్టాదారు పాస్‌పుస్తకం కోసం దరఖాస్తు చేసుకున్నారు. కలెక్టర్ ఆదేశంతో పట్టాదారు పాస్‌పుస్తకం రాకపోయినా మేక సుధాకర్‌రెడ్డి పేరిట సర్వే నంబర్ 471/ఈ/2లో 4.20 ఎకరాలు, 477లో 1.6 ఎకరాలు కలిపి 5.26 ఎకరాలకు వన్‌బీ వచ్చింది. రైతుబంధు కూడా వర్తించింది. తర్వాత నర్సింహులపేట తాసిల్దార్‌గా వచ్చిన మాధవికి పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని పలుమార్లు విన్నవించుకున్నా ఫలితం లేకపోయింది. మరోసారి కార్యాలయానికి రావద్దంటూ ఇబ్బందులకు గురిచేశారు. తొర్రూరు ఆర్డీవో కార్యాలయంలోనూ విన్నించుకున్నారు. ఎట్టకేలకు గతనెల 13న జిల్లా కార్యాలయానికి పట్టాదారు పాసుపుస్తకం వచ్చిందని సుధాకర్‌రెడ్డి తెలిపారు. అయితే, తాసిల్దార్ మాత్రం పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వకుండా 'ఏం చేసుకుంటావో చేసుకోపో 'అంటూ బెదిరించారని పేర్కొంటున్నారు. పాస్‌పుస్తకం ఇవ్వకుండా తాసిల్దార్ వేధిస్తున్నారని సోమవారం తన పొలంలోనే గుంత తీసి అందులో శరీరాన్ని సగం పూడ్చుకుని ఆత్మహత్యకు యత్నించాడు. విషయం తెలుసుకున్న స్థానిక సర్పంచ్, పోలీసులు అక్కడకు చేరుకున్నారు. సర్పంచ్ నర్సయ్య తాసిల్దార్‌తో ఫోన్‌లో మాట్లాడటంతో బాధిత రైతు గుంతలో నుంచి బయటకు వచ్చారు. తర్వాత రైతు సుధాకర్‌రెడ్డి సర్పంచ్‌తో కలిసి రెవెన్యూ కార్యాలయానికి వెళ్లారు. అక్కడ మరోసారి వన్‌బీ తీయగా అందులో 471 సర్వే నంబర్‌లోని 4.20 ఎకరాలు మాయమవడంతో కార్యాలయంలోనే స్పృహతప్పి పడిపోయారు. దీంతో అక్కడే ఉన్న రైతులు, ప్రజలు తాసిల్దార్ తీరుపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ విషయంపై తాసిల్దార్ మాట్లాడుతూ మంగళవారం రామన్నగూడెంలోలో పర్యటించి రైతుకు న్యాయం జరిగేలా చర్య తీసుకుంటామని తెలిపారు.



ఎడపల్లి తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యకు యత్నిస్తున్న రైతు వెంకట్

### తాసిల్ కార్యాలయం ఎదుట

# ఆత్మహత్యాయత్నం

**ఎడపల్లి:** రెవెన్యూ అధికారుల తీరుతో విసిగిపోయిన ఓ రైతు తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఆత్మహత్యాయత్నంచేశారు. నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం కుర్నాపల్లి గ్రామానికి చెందిన వెంకట్ అనే రైతు.. సర్వేనంబర్ 101లో తనకు కేటాయించిన ఎకరం భూమికి పాస్‌పుస్తకం ఇవ్వాలని ఏడాదిగా రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. పాస్ బుక్ రాకపోవడంతో రైతుబంధు పథకం అందడంలేదు. దీంతో మనస్థాపం చెందిన బాధితుడు సోమవారం ఎడపల్లి తాసిల్ కార్యాలయం వద్ద ఒంటిపై పెట్రోల్ పోసుకొనేయత్నం చేశాడు. వెంటనే అక్కడున్న తాసిల్ కార్యాలయం అటెండర్, స్థానికులు పెట్రోల్ బాటిల్‌ను లాక్కొన్నారు. వెంకట్‌ను కుర్నాపల్లి వీఆర్వో భోజన్న తాసిల్ కార్యాలయంలోకి తీసుకెళ్లి, నచ్చజెప్పి ఇంటికి పంపించారు. కుర్నాపల్లి శివారులోని 101 సర్వే నంబర్‌లో 16 ఎకరాల భూమి ఉండగా.. అందులో 40 మందికి పట్టాలున్నాయని తాసిల్దార్ అశోక్‌కుమార్ తెలిపారు. అయితే, ఈ భూమిపై వివాదాలు ఉన్నాయని, దీనిపై విచారణ జరుగుతున్నదని వివరించారు. భూ వివాదాన్ని ఆర్డీవోకు కూడా విన్నవించినట్టు చెప్పారు. నిజమైన లబ్ధిదారులను గుర్తించి అర్హులైనవారికి పాస్‌పుస్తకాలు అందిస్తామని చెప్పారు.

# పోలవరం టు పెన్నాతో భారీ ప్రయోజనం

- 40 మీటర్లు లిఫ్ట్ చేసి 400 టీఎంసీలు మళ్లించే అవకాశం
- ఏపీ సర్కారుకు నవ్యాంధ్రప్రదేశ్ విశ్రాంత ఇంజినీర్ల నివేదిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పోలవరం నుంచి పెన్నా బేసిన్‌కు గోదావరిజలాల తరలింపుతో ఆంధ్రప్రదేశ్ భారీ ప్రయోజనాన్ని పొందవచ్చని నవ్యాంధ్రప్రదేశ్ విశ్రాంత ఇంజినీర్ల సంఘం అభిప్రాయపడింది. సముద్రంలో వృథాగా కలిసే గోదావరిజలాల సద్వినియోగానికి ఏపీ భూభాగంలోనే ప్రాజెక్టును చేపడితే బాగుంటుందని సూచించింది. పోలవరం రిజర్వాయర్ ఫోర్‌షోర్ నుంచి గోదావరి జలాలను మళ్లించే అలైన్‌మెంట్‌ను సంఘం రూపొందించింది. 40 మీటర్ల మేర లిఫ్టు చేసి.. పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల పరిధిలో (అమరావతి ఎగువన) గ్రావిటీ కాల్వ ద్వారా నీటిని తరలించవచ్చని, 400 టీఎంసీల గోదావరి జలాల వరకు మళ్లింపునకు అవకాశం ఉంటుందని సూచించింది. ఈ ప్రతిపాదిత ప్రాజెక్టు అంచనా వ్యయం సుమారు రూ.లక్ష కోట్లని స్పష్టంచేసింది. ఈ మేరకు నవ్యాంధ్రప్రదేశ్ విశ్రాంత ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు ఎం విశ్వేశ్వరరావు.. ఏపీ సీఎం జగన్‌కు ఎనిమిది పేజీల నివేదిక అందజేశారు. కృష్ణాబేసిన్‌లో ఇన్‌ఫ్లోలు సరిగా లేక ఏర్పడిన కొరత అధిగమించడం, భవిష్యత్ ప్రాజెక్టులకు సైతం గోదావరిజలాల్ని అందించేందుకు ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు ద్వారా పోలవరం నుంచి 120 రోజుల్లో 400 టీఎంసీలను మళ్లించవచ్చని వివరించారు. ప్రాజెక్టును మరింత విస్తరించడం ద్వారా కావేరీకి 50 టీఎంసీల గోదావరి జలాల్ని తరలించవచ్చని.. తద్వారా నదుల అనుసంధానం కింద కేంద్రం నుంచి నిధులు వస్తాయని నివేదికలో పొందుపరిచారు.

# ప్రాజెక్టులకు కొనసాగుతున్న వరద

- కృష్ణాబేసిన్‌లో నిండుకుండల్లా జలాశయాలు
- శ్రీశైలం, జూరాలకు స్థిరంగా ఇన్‌ఫ్లోలు
- నాగార్జునసాగర్‌లో నాలుగు గేట్ల నుంచి విడుదల
- శ్రీరాంసాగర్‌కు వరద తగ్గుముఖం





నాగార్జునసాగర్ నాలుగు గేట్ల నుంచి దిగువకు కృష్ణమ్మ పరుగులు.. సరస్వతి పంప్‌హౌస్‌లో 8వ మోటర్ వెట్‌రన్ సక్సెస్‌పై విజయసంకేతం చూపుతున్న ఈఎన్సీ నల్లా వెంకటేశ్వర్లు, ఈఈలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కృష్ణా, గోదావరి బేసిన్లలోని ప్రాజెక్టులకు వరద కొనసాగుతున్నది. కృష్ణాబేసిన్‌లో ఎగువనున్న ఆల్మట్టి, నారాయణపురతోపాటు, ఇటు తుంగభద్ర నుంచి స్వల్పంగా వస్తున్న నీటితో జూరాలకు ఇన్‌ఫ్లో స్థిరంగా నమోదవుతున్నది. శ్రీశైలం పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు మించి వస్తున్న నీటిని వచ్చినట్టు ప్రాజెక్టు అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి ఒకగేటు ద్వారా దిగువకు నీరు విడుదలవుతున్నది. నాగార్జునసాగర్‌లో నాలుగు క్రస్ట్‌గేట్ల ద్వారా పులిచింతలకు నీరు విడుదలవుతున్నది. పులిచింతల వద్ద ఇన్‌ఫ్లో 1.13 లక్షల క్యూసెక్కులకు పైగా ఉంది. జలాశయం నుంచి దిగువకు లక్ష క్యూసెక్కులకు పైగా వదులుతున్నారు. రెండు, మూడు రోజుల నుంచి ప్రాజెక్టుల నుంచి దిగువకు భారీస్థాయిలో వరదను వదులుతున్నందున ప్రకాశం బరాజ్ వద్ద సోమవారం వరద పోటెత్తింది. లక్ష క్యూసెక్కులకు పైగా వరదను దిగువన సముద్రంలోకి వదులుతున్నారు. మరోవైపు గోదావరి బేసిన్‌లో ప్రవాహం స్థిరంగా కొనసాగుతున్నది. శ్రీరాంసాగర్ జలాశయానికి 22 వేల పైచిలుకు క్యూసెక్కుల వరద వస్తుండటంతో నీటిమట్టం క్రమంగా పెరుగుతున్నది. శ్రీరాజరాజేశ్వర జలాశయానికి ఇన్‌ఫ్లో నిలిచిపోగా.. ప్రాజెక్టు నుంచి దిగువకు 2664 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎల్లంపల్లికి మాత్రం 20వేల పైచిలుకు క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో 27వేల క్యూసెక్కులకు పైగా నీటిని దిగువకు వదులుతున్నారు. భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం 22 అడుగులుగా నమోదయింది.

**ప్రాజెక్టులలో సోమవారం నీటిమట్టాల వివరాలు...**

| రిజర్వాయర్ | ఎఫ్ఆర్ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1704.72 | 129.72 | 128.19 | 30,000 | 20,000 |
| నారాయణపుర | 1615.00 | 1614.96 | 37.64 | 37.61 | 20,000 | 16,680 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 7,057 | 5,300 |
| జూరాల | 1045.00 | 1044.65 | 9.66 | 9.44 | 1,10,000 | 1,21,622 |
| తుంగభద్ర | 1633.00 | 1633.00 | 100.86 | 100.86 | 12,374 | 12,424 |
| శ్రీశైలం | 885.00 | 885.00 | 215.81 | 215.81 | 1,41,086 | 1,24,679 |
| నాగార్జునసాగర్ | 590.00 | 589.80 | 312.05 | 311.45 | 1,11,217 | 1,11,217 |
| పులిచింతల | 175.00 | 174.70 | 45.77 | 45.31 | 1,13,348 | 1,00,089 |
| సింగూరు | 1717.93 | 1673.47 | 29.91 | 0.72 | 261 | 30 |
| నిజాంసాగర్ | 1405.00 | 1387.00 | 17.18 | 2.95 | 1,860 | 51 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1086.90 | 90.31 | 72.91 | 22,570 | 759 |
| లోయర్‌మానేరు | 920.00 | 913.50 | 24.07 | 18.78 | 3,820 | 301 |
| శ్రీరాజరాజేశ్వర | 1043.31 | 994.26 | 25.873 | 3.69 | 0 | 2,664 |
| కడెం | 700.00 | 699.43 | 7.60 | 7.45 | 1,164 | 496 |
| ఎల్లంపల్లి | 485.56 | 484.88 | 20.18 | 19.59 | 20,168 | 27,890 |

## కాళేశ్వరంలో సరస్వతి పంప్‌హౌస్ రికార్డు

**కరీంనగర్ ప్రధాన ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో సరస్వతి పంప్‌హౌస్ రికార్డు సృష్టించింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేటలోని సరస్వతీ (అన్నారం) పంప్‌హౌస్‌లో రెండు టీఎంసీల నీటిని ఎత్తిపోసేందుకు ఏర్పాటుచేసిన ఎనిమిది మోటర్లు అందుబాటులోకి వచ్చాయి. ఇప్పటివరకు 7మోటర్ల వెట్‌రన్ పూర్తికాగా, తాజాగా సోమవారం రాత్రి కాళేశ్వరం ఈఎన్సీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో 8వ మోటర్‌కు వెట్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించారు. లింక్-1లోని లక్ష్మీపంప్‌హౌస్‌లో 11 మోటర్లకు 10, పార్వతీ పంప్‌హౌస్‌లో 9 మోటర్లకు ఎనిమిదింటి వెట్‌రన్ కాగా, పంప్‌హౌస్‌లో ఉన్న అన్నిమోటర్ల వెట్‌రన్ నిర్వహించిన ఘనత సరస్వతి పంప్‌హౌస్ దక్కించుకున్నది. ఎస్సారెస్పీ పునరుజ్జీవ పథకంలో భాగంగా జగిత్యాల జిల్లా మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌస్‌లో ఏడో మోటరుకు వెట్‌రన్‌ను సోమవారం విజయవంతంగా నిర్వహించారు.



రాంపూర్ పంప్‌హౌస్ డెలివరీ సిస్టర్న్ వద్ద ఉప్పొంగుతున్న జలాలు

# రాష్ట్రానికి అండగా నిలువాలి

- రైతులకు బ్యాంకర్లు సహకరించాలి
- వివిధ ప్రాజెక్టులకు మీ సహకారం మరువలేనిది
- భవిష్యత్తులోనూ ఇదే ఒరవడి కొనసాగాలి
- ఎస్సెల్బీసీ సమీక్షా సమావేశంలో ప్రభుత్వ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా



ఎస్సెల్బీసీ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభుత్వ కార్యదర్శి సందీప్‌కుమార్‌సుల్తానియా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్థిక మాంద్యం నేపథ్యంలో బ్యాంకులు రాష్ట్ర ప్రభుత్వానికి అండగా నిలువాలని ప్రభుత్వ కార్యదర్శి సందీప్‌కుమార్ సుల్తానియా విజ్ఞప్తి చేశారు. రైతుబంధు పథకంతోపాటు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం తదితర ప్రాజెక్టులకు బ్యాంకులు అందించిన సహకారాన్ని మరువలేమని ఆయన పేర్కొంటూ.. భవిష్యత్తులోనూ ఇదే సహకారాన్ని కొనసాగించాలని కోరారు. రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్సెల్బీసీ) 24వ త్రైమాసిక సమీక్షా సమావేశం హైదరాబాద్‌లోని మేరీగోల్డ్ హోటల్‌లో సోమవారం జరిగింది. ఎస్సెల్బీసీ అధ్యక్షుడు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) చీఫ్ జనరల్ మేనేజర్ ఓంప్రకాశ్ మిశ్రా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సర (2019-20) రుణప్రణాళిక అమలుతీరుపై చర్చించారు. ఈ సందర్భంగా సందీప్‌కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. వ్యవసాయరంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్నదని, బ్యాంకర్లు చిన్నచిన్న అంశాలను పట్టించుకోకుండా రైతులకు సకాలంలో రుణాలిచ్చి సహకరించాలని కోరారు. వడ్డీరహిత రుణాలకు సంబంధించిన బకాయిలను త్వరలోనే బ్యాంకులకు చెల్లిస్తామని తెలిపారు. మాంద్యం వల్ల దేశంలోని అన్ని రాష్ట్రాల్లో వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్లు తగ్గినప్పటికీ తెలంగాణలో మెరుగ్గా ఉన్నాయని పేర్కొన్నారు.

### డాటా అప్‌డేట్ చేయాలి

ఓంప్రకాశ్ మిశ్రా మాట్లాడుతూ.. క్షేత్రస్థాయి వ్యాపార ప్రణాళికలను బ్యాంకులు పకడ్బందీగా రూపొందించుకోవాలని, రిజర్వు బ్యాంకు నిబంధనల ప్రకారం ఎస్సెల్బీసీ నిర్దేశించుకున్న లక్ష్యాల మేరకు లబ్ధిదారుల డాటాను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవాలని అన్నారు. క్రెడిట్‌ప్లాన్‌ను సాధించడం లో 8 జిల్లాలు వెనుకబడి ఉన్నాయని, రాబో యే 15 రోజుల్లో పూర్తిస్థాయి ఫలితాలు సాధించాలని సూచించారు. ఎస్సెల్బీసీ పరిధిలోని బ్యాంకులు గత ఆర్థిక సంవత్సరంలో సాధించిన ప్రగతిని వివరిస్తూ.. ఈ ఏడాది జూన్ 30నాటికి బ్యాంకులు రూ.4,55,709.56 కోట్ల డిపాజిట్లు సేకరించినట్టు తెలిపారు. అప్పటికి అడ్వాన్స్‌లు రూ.5,33,106.75 కోట్లు ఉన్నాయని, 0.14 శాతం తగ్గుదల కనిపించిందని చెప్పారు. వ్యవసాయ రుణాల కింద బ్యాంకులు రూ. 7,345.65 కోట్లు మాత్రమే పంపిణీ చేయడంతో మొత్తం లక్ష్యంలో 25.12 శాతమే నెరవేరిందన్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.19,856 కోట్ల వ్యవసాయ రుణాలివ్వాలని లక్ష్యంగా నిర్ణయించగా.. ఇప్పటివరకు రూ. 2,911 కోట్లు ఇచ్చినట్టు తెలిపారు. ప్రాధాన్యతా రంగాల కింద తొలి త్రైమాసికం (ఏప్రిల్-జూన్)లో రూ.167.99 కోట్ల విద్యా రుణాలను, రూ.1,035 కోట్ల గృహరుణాలు, చిన్న, మధ్యతరహా పరిశ్రమల రంగానికి రూ. 16,249.25 కోట్లు, మైనార్టీలకు రూ. 601.71 కోట్లు, బలహీన వర్గాలకు రూ. 3,639 కోట్లు, ఎస్సీ, ఎస్టీలకు రూ.1,931 కోట్లు, ప్రధానమంత్రి ముద్రా యోజన లబ్ధిదారులకు రూ.978.28 కోట్ల రుణాలిచ్చామని ఓంప్రకాశ్ మిశ్రా వివరించారు. ఈ సమావేశంలో ఎస్సెల్బీసీ కన్వీనర్ యూఎన్ఎన్ మయా, ఆర్బీఐ రీజినల్ డైరెక్టర్ శంకర్, నాబార్డ్ సీజీఎం విజయకుమార్ పాల్గొన్నారు.

## ఎస్పీడీసీఎల్ సీజీఎం పదవీ విరమణ



**హైదరాబాద్ సిటీ బ్యూరో, నమస్తే తెలంగాణ:** దక్షిణ తెలంగాణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చీఫ్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్ అండ్ మెయింటెనెన్స్) ఏజీ సతీశ్‌కుమార్ సోమవారం పదవీ విరమణ చేశారు. సుమారు 12 ఏండ్లపాటు చీఫ్ జనరల్ మేనేజర్‌గా ఎస్పీడీసీఎల్‌కు సేవలందించారు. ప్రాజెక్ట్స్, పీఅండ్ఎంఎం, మెట్రో జోన్, కమర్షియల్, హెచ్ఆర్డీలోనూ పనిచేశారు. చేపట్టిన అన్ని పదవులకు వన్నెతెచ్చారని వీడ్కోలు సభలో సతీశ్‌కుమార్ సేవలను కొనియాడారు. వీడ్కోలు సమావేశానికి సంస్థ సీఎండీ రఘుమారెడ్డి హాజరయ్యారు.

**ఎస్పీడీసీఎల్‌లోసీజీఎంల బదిలీ**

దక్షిణ తెలంగాణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీఎస్ఎస్పీడీఎస్ఎల్) పరిధిలో పనిచేస్తున్న పలువురు చీఫ్ జనరల్ మేనేజర్లు (సీజీఎం) బదిలీ అయ్యారు. సోమవారం సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ గౌరవరం రఘుమారెడ్డి ఈ మేరకు ఉత్తర్వులు జారీచేశారు. సెంట్రల్ సర్కిల్ సూపరింటెండెంట్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న నరసింహస్వామిని మెట్రో జోన్ సీజీఎంగా, క్వాలిటీ కంట్రోల్ ఎస్ఈగా పనిచేస్తున్న బసవయ్యకు ప్రాజెక్ట్ సీజీఎంగా అదనపు బాధ్యతలు అప్పగించారు. హెచ్ఆర్డీ సీజీఎంగా లోల్యారావు నాయక్, కమర్షియల్ సీజీఎంగా కే సాయిబాబాను నియమించారు.

## ఏపీలో ఐదు జిల్లాల్లో విద్యుత్ కోతలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లోని ఐదు జిల్లాల్లో భారీగా విద్యుత్ కోతలను ప్రకటించారు. వినియోగానికి, లభ్యతకు మధ్య భారీ వ్యత్యాసం ఏర్పడటంతో అత్యవసర విద్యుత్ కోతలు విధిస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్ కే రాజబాపయ్య ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో 101 మెగావాట్లు, విజయనగరంలో 82, విశాఖలో 61, తూర్పుగోదావరిలో 191, పశ్చిమగోదావరిలో 122 మెగావాట్ల చొప్పున మొత్తం 557 మెగావాట్ల మేర విద్యుత్ కోత విధించారు. బొగ్గు ఆధారిత విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సరఫరా కాకపోవడం, ఒడిశా నుంచి బొగ్గు రాకపోవడం, బొగ్గు కార్మికుల సమ్మె, వర్షాలు, పవన విద్యుత్ ఉత్పత్తి తగినంత లేకపోవడం తదితర అంశాలు ఇందుకు కారణమని వివరించారు. గతంలో విద్యుత్ వినియోగం అధికంగా ఉన్నప్పుడు హర్యానా నుంచి విద్యుత్ దిగుమతి చేసుకున్నామని, ప్రస్తుతం హర్యానాకు ఆ విద్యుత్‌ను ఎగుమతి చేస్తున్నట్టు తెలిపారు. అత్యవసర విద్యుత్ కోతలు రెండు, మూడ్రోజుల పాటు కొనసాగే అవకాశం ఉన్నదని వివరించారు.

## టీడీపీకి సిద్ధాంతాల్లేవు

పార్టీకి టీ వీరేందర్‌గౌడ్ రాజీనామా

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉన్నత ఆదర్శాలు, సిద్ధాంతాలతో ఎన్టీఆర్ టీడీపీని స్థాపించారని, కానీ, ప్రస్తుతం పార్టీకి సిద్ధాంతాలులేవని మాజీ మంత్రి దేవేందర్‌గౌడ్ తనయుడు, తెలుగు యువత అధ్యక్షుడు తూళ్ల వీరేందర్‌గౌడ్ విమర్శించారు. సోమవారం ఆయన పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి, తెలుగు యువత అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించారు. ఈ మేరకు రాజీనామా లేఖను పార్టీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుకు పంపించారు. ఈ లేఖలో పలు అంశాలను ప్రస్తావించారు. కొంతకాలంగా రాజకీయ అవసరాల కోసం సిద్ధాంతాలకు భిన్నంగా టీడీపీ రాజీపడిందని.. ఇది తననే కాకుండా పార్టీ శ్రేణులను ఎంతగానో బాధిస్తున్నదని పేర్కొన్నారు.

## ఆహ్లాదంగా 'బతుకమ్మ' కవితాగానం



రవీంద్రభారతిలో పూల సింగిడిని ఆవిష్కరిస్తున్న కవయిత్రులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బతుకమ్మ సంబురాల్లో భాగంగా తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో నిర్వహించిన కవయిత్రుల కవితాగానం ఆహ్లాదంగా సాగింది. రవీంద్రభారతిలో సోమవారం 316 మంది కవయిత్రులు తమ కవితలను వినిపించారు. ఐనంపూడి శ్రీలక్ష్మి, జ్వలిత, సరోజ, వింజామర, అరుణ నారదభట్ల సంపాదకులుగా 316 మంది కవితలతో పూల సింగిడి పేరిట ముద్రించిన కవితా సంకలనాన్ని ఆవిష్కరించారు. దేశవిదేశాల్లోని కవయిత్రుల కవితలు ఇందులో ఉన్నాయి. రవీంద్రభారతి మెయిన్‌హాల్, మరో రెండు హాళ్లలో ఏకకాలంలో ఈ కవిసమ్మేళనం జరిగింది.

**కల్వకుంట్ల కవిత కృషితో ప్రపంచస్థాయి గుర్తింపు**

బతుకమ్మ సంబురాలు తెలంగాణలోనే కాకుండా ప్రపంచస్థాయి గుర్తింపు తెచ్చుకునేందుకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రధాన కారణమని ఈ సందర్భంగా కవయిత్రులు ప్రశంసించారు. దేశ చరిత్రలో ఇంత ఎక్కువ మంది కవయిత్రులతో కవి సమ్మేళనం జరుగలేదని, ఇంత పెద్ద కవయిత్రుల కవితా సంకలనం కూడా రాలేదని వక్తలు అభిప్రాయపడ్డారు. తెలంగాణ జాగృతి సాహిత్య విభాగం నాయకురాలు, ప్రముఖ కవయిత్రి జ్వలిత సభాధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఆలిండియా రేడియో డిప్యూటీ డైరెక్టర్ శైలజ సుమన్, ప్రముఖ రచయిత్రులు లక్ష్మీ నర్సమ్మ, తిరునగరి జానకీదేవి, సామాజిక కార్యకర్త, కవయిత్రి సిస్టర్ నివేదిత తదితరులు పాల్గొన్నారు.

## 30 నుంచి ఓపెన్ స్కూల్ పరీక్షలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో ఈ నెల 30నుంచి నవంబర్ 9 వరకు ఎస్సెస్సీ, ఇంటర్ పరీక్షలు నిర్వహించనున్నారు. పరీక్షల టైంటేబుల్‌ను సోమవారం సొసైటీ డైరెక్టర్ వెంకటేశ్వరశర్మ విడుదలచేశారు. నిత్యం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు.

# ఏపీలో నేటినుంచి కొత్త మద్యం విధానం

**అమరావతి:** విక్రయాలకు కొత్త విధానాన్ని అమల్లోకి తీసుకొస్తున్న ఏపీ ప్రభుత్వం.. మంగళవారం (అక్టోబర్ 1) నుంచి రాష్ట్రంలోని 3,500 మద్యం దుకాణాలను స్వయం గా నిర్వహించనున్నది. ఏపీ బేవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ పర్యవేక్షణలో నడువనున్న ఈ దుకాణాలు ఇకపై ఉదయం 10 నుంచి రాత్రి 9 వరకే తెరిచి ఉంటాయి. మద్యం దుకాణాలను ప్రభుత్వమే నిర్వహించనుండటంతో నకిలీ మద్యం విక్రయాలతోపాటు అధిక ధరలు కొంతవరకు తగ్గుతాయని అధికారులు భావిస్తున్నారు. మంగళవారం నుంచి ప్రభుత్వ దుకాణాలు ప్రారంభంకానున్నందున ప్రస్తుతం వ్యాపారుల వద్ద నిల్వ ఉన్న సరుకును సోమవారం రాత్రి 10 గంటల్లోగా అమ్ముకోవాల్సి ఉన్నది. ఈ వ్యవధి దాటిన తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాల్లో ఉన్న స్టాకును ఎక్సైజ్ శాఖకు అప్పగించాల్సి ఉండటంతో వ్యాపారులు ప్రీమియం బ్రాండ్లపై భారీగా డిస్కౌంట్లు ప్రకటించారు. దీంతో మందుబాబులు భారీ సంఖ్యలో మద్యం దుకాణాలకు క్యూకట్టారు.



హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్ష పదవీ బాధ్యతలను సోమవారం అధికారికంగా స్వీకరిస్తున్న మహమ్మద్ అజారుద్దీన్. రాజకీయాలకు అతీతంగా హెచ్‌సీఏ అభివృద్ధి కోసం అందరినీ కలుపుకుపోతానని ఈ సందర్భంగా అజార్ అన్నాడు. ప్రతిభ కల్గిన యువ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ జిల్లాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తానని హామీ ఇచ్చాడు. ఈ మీడియా సమావేశంలో కొత్తగా ఎన్నికైన ప్యానెల్ సభ్యులు కూడా పాల్గొన్నారు.

## వైజాగ్ టెస్టుకు వర్షం ముప్పు



**విశాఖపట్నం:** భారత్, దక్షిణాఫ్రికా తొలి టెస్టు వేదిక విశాఖపట్నంలో మ్యాచ్ జరిగే ఐదు రోజులూ వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం తెలిపింది. వైజాగ్‌లో గత వారం రోజులుగా ఎడతెరిపిలేని వర్షాలు కురుస్తున్నాయి. బుధవారం నుంచి కూడా ఇదే పరిస్థితి ఉండనున్నట్లు సమాచారం. టెస్టు సిరీస్‌కు ముందు విజయనగరం వేదికగా దక్షిణాఫ్రికా, బోర్డు ఎలెవన్ మధ్య జరిగిన మ్యాచ్‌ను కూడా వరుణుడు వెంటాడాడు.

## భారత్‌కు నాలుగో స్థానం అవసరం లేదు

■ యువరాజ్ సెటైర్



**న్యూఢిల్లీ:** టీమ్‌ఇండియా మేనేజ్‌మెంట్ మద్దతిచ్చి ఉంటే ఇంకో ప్రపంచకప్ ఆడి ఉండేవాడినని ఇటీవలే అసంతృప్తి వ్యక్తం చేసిన మాజీ స్టార్ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్.. మరోసారి తనదైన శైలిలో సెటైర్ వేశాడు. దేశవాళీ టోర్నీల్లో ఎన్ని పరుగులు చేస్తున్నా సూర్య కుమార్ యాదవ్‌ను టీమ్‌ఇండియాలోకి ఎందుకు తీసుకోవడం లేదంటూ మాజీ స్పిన్నర్ హర్భజన్ చేసిన ట్వీట్‌కు యువీ సోమవారం స్పందించాడు. నాలుగో స్థానం అత్యంత బలంగా ఉండడం టీమ్‌ఇండియాకు అవసరం లేదంటూ కామెంట్ చేశాడు. ఛత్తీస్‌గఢ్‌తో మ్యాచ్‌లో ముంబై తరఫున సూర్య కుమార్ యాదవ్ 31 బంతుల్లో 81 పరుగులు చేసిన సందర్భంగా హర్భజన్ స్పందించాడు. 'దేశవాళీ క్రికెట్‌లో ధారాళంగా పరుగులు చేస్తున్నా సూర్యకుమార్ యాదవ్ టీమ్‌ఇండియాకు ఎందుకు ఎంపిక కానున్నాడో నాకు తెలియట్లేదు. సూర్య నువ్వు ఇంకా కష్టపడు.. నీ సమయం వస్తుంది' అని టర్బోనేటర్ ట్వీట్ చేశాడు.

## మణిందర్ మెరుపులు



**పంచకుల (హర్యానా):** ప్రొ కబడ్డీ లీగ్ ఏడో సీజన్‌లో టాప్ జట్ల మధ్య జరిగిన సమరంలో బెంగాల్ వారియర్స్ విజయం సాధించింది. సోమవారం ఇక్కడ జరిగిన లీగ్ మ్యాచ్‌లో బెంగాల్ 42-33తో దబంగ్ ఢిల్లీపై గెలుపొందింది. వారియర్స్ తరఫున మణిందర్ సింగ్ 13 పాయింట్లు సాధించగా.. ఢిల్లీ తరఫున నవీన్ కుమార్ (15 పాయింట్లు) మరోసారి సూపర్-10తో మెరిశాడు. మణిందర్‌కు ఈ సీజన్‌లో ఇది పదో సూపర్-10 కావడం విశేషం. ఈ విజయంతో బెంగాల్ పాయింట్లు మెరుగు పర్చుకొని అగ్రస్థానానికి మరింత చేరువైంది. ప్రస్తుతం 20 మ్యాచ్‌లాడిన ఢిల్లీ 82 పాయింట్లతో టాప్‌లో ఉంటే.. అన్నే మ్యాచ్‌లు ఆడిన బెంగాల్ 78 పాయింట్లతో ద్వితీయ స్థానంలో ఉంది. ఈ రెండు జట్లతో పాటు హర్యానా స్టీలర్స్ జట్టు ఇప్పటికే ప్లేఆఫ్స్‌కు అర్హత సాధించిన విషయం తెలిసిందే. మరో మ్యాచ్‌లో యు ముంబా 36-32తో తమిళ్ తలైవాస్‌పై విజయం సాధించింది.

## విజేత నాగల్

135వ ర్యాంకుకు చేరిక

**బ్యూనస్ ఎయిర్స్(అర్జెంటీనా):** భారత టెన్నిస్ ఆటగాడు సుమిత్ నాగల్ బ్యూనస్ ఎయిర్స్ ఏటీపీ చాలెంజర్ టోర్నీ టైటిల్ గెలిచాడు. సోమవారం జరిగిన ఫైనల్లో నాగల్ 6-4, 6-2 తేడాతో ఫకుండో బోగ్నిస్(అర్జెంటీనా)పై అలవోక విజయం సాధించాడు. ఆతిథ్య దేశ ప్లేయర్‌ను 37 నిమిషాల్లోనే నాగల్ ఓడించడం విశేషం. 2017లో బెంగళూరు చాలెంజర్‌ను గెలిచిన సుమిత్‌కు... ఇది రెండో ఏటీపీ చాలెంజర్ టైటిల్. ఈ గెలుపుతో ఏటీపీ ర్యాంకింగ్స్‌లో 26 స్థానాలు ఎగబాకిన నాగల్ 135వ ర్యాంకుకు చేరుకున్నాడు.

# ఫ్రేసర్ బుల్లెట్‌లా...

■ మహిళల 100మీటర్ల పోటీలో జమైకన్ సత్తా
■ బోల్ట్ రికార్డును బద్దలు కొట్టిన ఫెలిక్స్
■ ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్

ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో అమ్మలు అద్భుతం చేశారు. మాతృత్వపు మాధుర్యాన్ని రుచి చూసిన తర్వాత బరిలోకి దిగిన తొలి విశ్వసమరంలోనే జమైకా స్టార్ స్ప్రింటర్ ఫ్రేసర్, అమెరికా దిగ్గజం ఫెలిక్స్, చైనా రేస్ వాకర్ లీ హోంగ్ స్వర్ణాలతో మెరిశారు. 100 మీటర్ల పరుగులో మెరుపు వేగంతో జమైకా ఆడపులి షెల్లీ అన్ ఫ్రేసర్ మరో స్వర్ణాన్ని తన ఖాతాలో వేసుకొని ఈ పోటీలో తానే ప్రపంచ పరుగుల రాణి అని చాటిచెప్పింది. ఇక ప్రపంచ చాంపియన్‌షిప్‌లో జమైకా చిరుత ఉసేన్ బోల్ట్ (11స్వర్ణాలు) రికార్డును అమెరికా మహిళా దిగ్గజ స్ప్రింటర్ అలీసన్ ఫెలిక్స్ బద్దలు కొట్టింది. 12వ స్వర్ణాన్ని సాధించి చాంపియన్‌షిప్ చరిత్రలో అత్యధిక పసిడి పతకాలను సొంతం చేసుకున్న అథ్లెట్‌గా అవతరించింది. 20 కిలోమీటర్ల రేస్‌వాక్‌లో చైనా అథ్లెట్ లీ హోంగ్ పసిడిని పట్టింది. మరోవైపు మహిళల జావెలిన్ త్రోలో భారత అథ్లెట్ అన్నూ రాణి ఫైనల్‌కు చేరుకుంది. ఈ ఘనత సాధించిన తొలి భారతీయ మహిళా అథ్లెట్‌గా నిలిచింది. అలాగే తన పేరిట ఉన్న జాతీయ రికార్డును సైతం తిరగరాసింది.




షెల్లీ అన్ ఫ్రేసర్

**దోహా:** ప్రపంచ చాంపియన్‌షిప్‌లో జమైకా స్టార్ షెల్లీ అన్ ఫ్రేసర్ ప్రైస్ మరోసారి సత్తా చాటింది. బిడ్డకు జన్మనిచ్చినా తనలోని వేగం ఏ మాత్రం తగ్గలేదని నిరూపించింది. సోమవారం ఇక్కడి ఖలీఫా స్టేడియంలో జరిగిన 100మీటర్ల మహిళల పరుగులో అందరినీ వెనక్కి నెట్టి స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. అమిత వేగంతో 10.71 సెకన్లలో లక్ష్యాన్ని ఛేదించింది. ఇక 10.83 సెకన్లలో 100మీటర్లను పూర్తి చేసిన ఆషెర్ స్మిత్(బ్రిటన్) రజతాన్ని, ఐవోరీకోస్ట్‌కు చెందిన మ్యారీ జోసీ(10.90సెకన్లు) కాంస్య పతకాన్ని గెలుచుకుంది. 'బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత ప్రపంచ చాంపియన్‌గా నిలువడం చాలా ఆనందంగా ఉంది' అని స్వర్ణ పతకం అందుకున్న ప్రైస్ చెప్పింది. 2009, 2013, 2015లోనూ స్వర్ణ పతకాలు సాధించిన జమైకా స్టార్ గర్భంతో ఉండడంతో 2017 చాంపియన్‌షిప్‌లో పాల్గొనలేదు.

### బోల్ట్ రికార్డు బద్దలు

జమైకా చిరుత ఉసేన్ బోల్ట్(11) పేరిట ఉన్న చాంపియన్‌షిప్‌లో అత్యధిక స్వర్ణాల రికార్డును అమెరికా దిగ్గజ మహిళా స్ప్రింటర్ అలీసన్ ఫెలిక్స్ బద్దలుకొట్టింది. 4x400 మీటర్ల మిక్స్‌డ్ రిలేలో అగ్రస్థానంలో నిలిచి చాంపియన్‌షిప్‌లో ఓవరాల్‌గా 12వ స్వర్ణాన్ని కైవసం చేసుకొని చరిత్ర సృష్టించింది. గత నవంబర్‌లో తల్లి అయ్యాక ఆమెకు ఇదే తొలి స్వర్ణం కావడం మరో విశేషం. ఫెలిక్స్, విల్‌బెర్ట్ లండన్, ఒకోలో, మైఖేల్ చెర్రీలతో కూడిన అమెరికా జట్టు రేస్‌ను 3నిమిషాల 9.34 సెకన్లలో ఛేదించి పసిడిని సాధించగా, జమైకా(3నిమిషాల 11.78సెకన్లు), బెహ్రయిన్(3:11.82) వరుసగా రజతం, కాంస్యం దక్కించుకున్నాయి. 2005 చాంపియన్‌షిప్ నుంచి 100, 200,400 మీటర్లతో పాటు టీం విభాగాల్లోనూ పాల్గొంటున్న అలీసన్ ఫెలిక్స్ ఇప్పటి దాకా 12 పసిడి పతకాలు సాధించడంతో పాటు ఆరు ఒలింపిక్స్ స్వర్ణాలతో ఆల్‌టైం గ్రేట్‌గా వెలుగొందుతున్నది.

20కిలోమీటర్ల మహిళల రేస్ వాక్‌లో చైనాకు చెందిన లీ హోంగ్ స్వర్ణ పతకాన్ని గెలుచుకుంది. గంటా 32 నిమిషాల 53సెకన్లలో లక్ష్యాన్ని చేరి అగ్రస్థానంలో నిలిచింది. అదే దేశానికి చెందిన క్వియాంగ్ షెంజీ (1:33:10), యాంగ్ లూ జింగ్(1:33:17) రజత, కాంస్య పతకాలను సాధించారు. 2016లో ఒలింపిక్స్‌లో చాంపియన్‌గా నిలిచిన హోంగ్ 2017-2018 మధ్య ప్రసూతి విరామం తీసుకున్న తర్వాత చాంపియన్‌షిప్‌లో బరిలోకి దిగింది.

> **మహిళల జావెలిన్ త్రో ఫైనల్**
> రాత్రి 11.50 గంటలకు
> ప్రత్యక్షప్రసారం
> స్టార్ స్పోర్ట్స్‌లో..

## ఫైనల్ చేరిన అన్నూరాణి



**భారత** జావెలిన్ త్రోయర్ అన్నూ రాణి చరిత్ర సృష్టించింది. ప్రపంచ చాంపియన్‌షిప్ జావెలిన్ త్రోలో ఫైనల్ చేరిన తొలి భారతీయ మహిళా అథ్లెట్‌గా నిలిచింది. సోమవారం జరిగిన జావెలిన్ త్రో క్వాలిఫికేషన్ రౌండ్ గ్రూప్-ఏలో బరిలోకి దిగిన రాణి.. రెండో ప్రయత్నంలో జావెలిన్‌ను 62.43 మీటర్లు విసిరి మూడో స్థానంలో నిలిచింది. తద్వారా తుదిపోరుకు చేరింది. పతకం కోసం మంగళవారం పోరాడనుంది. తొలి ప్రయత్నంలో 57.05 మీటర్లే సాధించి నిరాశ పరిచిన అన్నూ.... రెండో ప్రయత్నంలో 62.43 మీటర్లు విసిరి తన పేరిటనే ఉన్న జాతీయ రికార్డు (62.34)ను తిరగరాసింది. ఇక చివరి రౌండ్‌లో 60.50 మీటర్లకే పరిమితమైనా మూడో స్థానంలో నిలిచి తుదిపోరుకు చేరింది. క్వాలిఫికేషన్ గ్రూప్-ఏలో 67.27 మీటర్లను సాధించిన హుయ్‌హుయ్ లూ(చైనా) అగ్రస్థానంలో, హుస్సోంగ్ (జర్మనీ, 65.29) రెండో స్థానంలో నిలిచారు. మొత్తం 12 మంది ఫైనల్‌కు చేరారు.

మహిళల 200మీటర్ల పరుగు హీట్-2లో బరిలోకి దిగిన భారత స్ప్రింటర్ అర్చనా సుసీంద్రన్ 23.65 సెకన్లలో లక్ష్యాన్ని చేరి 8వ స్థానంలో నిలిచి, నిరాశ పరిచింది. 43 మంది పోటీ పడిన రేసులో 40వ స్థానంలో నిలిచింది.

ఇక 400 మీటర్ల మహిళల పరుగు పోటీలో భారత స్ప్రింటర్ అంజలీ దేవి హీట్-6లో బరిలోకి దిగి ఆరోస్థానంలో నిలిచింది. లక్ష్యాన్ని చేరుకునేందుకు 52.33 సెకన్ల సమయం తీసుకున్న అంజలీ తొలి రౌండ్‌తోనే పోరాటాన్ని చాలించింది. 46 మంది పోటీలో ఉండగా 36వ స్థానంలో నిలిలింది.

# వాణిజ్య

## ఇండ్ల అమ్మకాల్లో దూకుడు

2014-19 మధ్యకాలంలో హైదరాబాద్‌లో 76 శాతం పెరుగుదల

లయసెస్ ఫోరాస్, క్రెడాయ్ నేషనల్ తాజా సర్వే • ప్రభుత్వ విప్లవాత్మక నిర్ణయాలే కారణం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో ఇండ్ల అమ్మకాలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. కొత్తగా రాష్ట్రం ఏర్పాటైన నాటి నుంచి రాష్ట్రంలో సానుకూల పరిస్థితులు నెలకొనడం, తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న విప్లవాత్మమక నిర్ణయాలు, టీఎస్ ఐపాస్ వంటి వినూత్న విధానంతో ఇండ్ల అమ్మకాలు భారీగా పుంజుకున్నాయి. ప్రధానంగా హైదరాబాద్‌లో 2014 నుంచి 2019 మధ్యకాలంలో ఫ్లాట్ల అమ్మకాలు 76 శాతం పెరిగాయని లయసెస్ ఫోరాస్, క్రెడాయ్ నేషనల్‌లు కలిసి నిర్వహించిన తాజా సర్వేలో తేలింది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి రాగానే విప్లవాత్మక నిర్ణయాల్ని తీసుకోవడం, టీఎస్ ఐపాస్ వంటి వినూత్న విధానాన్ని అవలంభించడంతో ఇండ్ల అమ్మకాలు పెరగడానికి ప్రధాన కారణమని క్రెడాయ్ తెలంగాణ అభిప్రాయపడుతున్నది. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే విద్యుత్తు సమస్యను పరిష్కరించగలిగింది. పోలీసు వ్యవస్థను ప్రక్షాళన చేసి బలోపేతం చేసింది. మౌలిక సదుపాయాల అభివృద్ధికి పెద్దపీట వేయడం వంటి అంశాల వల్ల హైదరాబాద్ వృద్ధి చెందిందని క్రెడాయ్ తెలంగాణ ఛైర్మన్ గుమ్మి రాంరెడ్డి తెలిపారు.

### దేశంలోనే టాప్ త్రీ..

గత ఐదేండ్లలో దేశంలోని అన్ని నగరాల్లో ఇండ్ల అమ్మకాల్ని గమనిస్తే.. అహ్మదాబాద్, ముంబైల తర్వాత హైదరాబాద్ మూడో స్థానంలో నిలిచింది. 2014లో ఫ్లాట్ల కనీస ధర చదరపు అడుక్కీ రూ.3,914 ఉండగా.. 2019 నాటికి రూ.5,047కి పెరిగిందని తెలిపింది. 2018 ద్వితీయార్థం నుంచి 2019 ప్రథమార్థం వచ్చేనాటికి పశ్చిమ హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డు చుట్టుపక్కల ప్రాంతాల్లో అమ్మకాలు 145 శాతం పెరిగాయి. దీంతో అమ్ముడు కాని ఫ్లాట్ల సంఖ్య గణనీయంగా తగ్గింది. కాకపోతే, కనీస అమ్మకపు విలువ సుమారు రెండు శాతం తగ్గుముఖం పట్టడం గమనార్హం.

### 23 లక్షల చ.అ. ఆఫీసు స్థలం లీజు

దేశంలోని అన్ని మెట్రో నగరాల్లో ఆఫీసు సముదాయాలకు గిరాకీని క్షుణ్ణంగా పరిశీలిస్తే.. హైదరాబాద్ సరికొత్త రికార్డును సొంతం చేసుకుంది. జూన్ నెలలోనే 23 లక్షల చదరపు అడుగుల ఆఫీసు స్థలాన్ని వివిధ సంస్థలు తీసుకోవడం విశేషం. ఇందులో 95 శాతం ఐటీ, ఐటీఈఎస్ విభాగాలకు చెందిన కంపెనీలు లీజుకు తీసుకున్నాయి. ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న ఆఫీసు సముదాయాల విస్తీర్ణం ఎంతలేదన్నా 1.58 కోట్ల చదరపు అడుగుల దాకా ఉం టుంది. గతేడాదితో పోల్చితే 2019లో హైదరాబాద్ ఆఫీసు ప్లేస్‌కు 15 శాతం గిరాకీ పెరిగిందని క్రెడాయ్ హైదరాబాద్ కోశాధికారి పాండు రంగారెడ్డి తెలిపారు.

## గృహ రుణాలు మరింత చౌక!

**ముంబై:** గృహ రుణగ్రహీతలకు ఈ వారం శుభవార్త వినిపించే అవకాశం ఉన్నది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సూచించిన ప్రామాణికాలకు అనుగుణంగా రుణాలపై వడ్డీరేట్లను బ్యాంకులు సవరించే వీలున్నట్లు తెలుస్తున్నది మరి. దీనివల్ల వడ్డీరేట్లు గరిష్ఠంగా 30 బేసిస్ పాయింట్లు దిగేందుకు ఆస్కారమున్నట్లు సమాచారం. ఒక బేసిస్ పాయింట్.. 0.01 పాయింట్ శాతానికి సమానం. దీంతో 0.30 శాతం మేర కాస్ట్ ఆఫ్ ఫండింగ్ దిగొచ్చని పరిశ్రమ వర్గాలు అంటున్నాయి. ఆర్బీఐ ప్రామాణికాల్లో 5.4 శాతంగా ఉన్న రెపో రేటు, మూడు నెలల ట్రెజరీ బిల్లుల రేటు 5.28 శాతం, ఆరు నెలల ట్రెజరీ బిల్లుల రేటు 5.48 శాతం ఉన్నాయి. ప్రస్తుత మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్స్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్) కంటే ఈ రేట్లు రాకతో గృహ రుణాలు మరింతగా చౌక కానున్నాయి. ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి ఆగస్టు మధ్య రెపో రేటు 110 బేసిస్ పాయింట్లు తగ్గింది. అయినప్పటికీ ఎంసీఎల్ఆర్ 20 బేసిస్ పాయింట్లే తగ్గింది.

# రూ.4,355 కోట్ల నష్టం

11 ఏండ్లుగా పీఎంసీలో అక్రమాలు

బ్యాంక్ పెద్దలతో హెచ్‌డీఐఎల్ ప్రమోటర్ల కుమ్మక్కు • ఎఫ్ఐఆర్ దాఖలు చేసిన పోలీసులు



(ఫైల్ ఫొటో)

**ముంబై, సెప్టెంబర్ 30:** పంజాబ్ అండ్ మహారాష్ట్ర కో-ఆపరేటివ్ (పీఎంసీ) బ్యాంక్ కుంభకోణం భారీగానే కనిపిస్తున్నది. బ్యాంక్ పెద్దలు, హెచ్‌డీఐఎల్ ప్రమోటర్లు కుమ్మక్కై.. వేల కోట్లనే దండుకున్నట్లు తెలుస్తున్నది. 11 ఏండ్లుగా జరిగిన ఈ బాగోతంపై సోమవారం ముంబై పోలీసులు కేసు నమోదు చేశారు. బ్యాంక్‌కు 2008 నుంచి రూ.4,355.46 కోట్ల నష్టం వాటిల్లినట్లు పేర్కొన్నారు. ఆర్బీఐ నియమించిన అడ్మినిస్ట్రేటర్ ఫిర్యాదు ఆధారంగా ముంబై ఆర్థిక నేరాల విభాగం పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేశారు. ఇందులో బ్యాంక్ మాజీ చైర్మన్ వార్యం సింగ్, ఎండీ జాయ్ థామస్, ఇతర సీనియర్ అధికారులు, హెచ్‌డీఐఎల్ డైరెక్టర్ వాధవాన్‌ల పేర్లున్నాయి. ఐపీసీ సెక్షన్ 409 (ద్రోహం), 420 (చీటింగ్), 465, 466, 471 (ఫోర్జరీ) 120-బీ (నేరపూరిత కుట్ర)ల కింద వీరిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు వివరించారు. నకిలీ ఖాతాలను సృష్టించి అక్రమాలకు తెరలేపిన బ్యాంక్ వర్గాలు.. నకిలీ నివేదికలతో ఆర్బీఐని కూడా ఏమార్చాలని చూశారు. అయితే ఇదంతా ఆర్బీఐ పరిశీలనతోనే వెలుగులోకి వచ్చింది. కాగా, పీఎంసీ సంక్షోభానికి కారణమైన హెడీఐఎల్.. బ్యాంక్‌కు రూ.6,500 కోట్లు బకాయి పడింది. బ్యాంక్ మొత్తం రుణాల్లో (రూ. 8,880 కోట్లు) ఇది 73 శాతానికి సమానం కావడం గమనార్హం. గత 2-3 ఏండ్లుగా హెచ్‌డీఐఎల్.. ఈ రుణాలను చెల్లించడం లేదని ఇప్పటికే బ్యాంక్ మాజీ ఎండీ థామస్ చెప్పిన విషయం తెలిసిందే. అయితే తీసుకున్న రుణాలకు రెట్టింపు స్థాయిలో ఆస్తులను పూచీకత్తు పెట్టినందుకే హెచ్‌డీఐఎల్ రుణాల విషయాన్ని ఆర్బీఐకి చెప్పలేదని థామస్ సమర్థించుకున్నారు.

### భండూప్ శాఖ కేంద్రంగా..

పీఎంసీ బ్యాంక్ భండూప్ శాఖ కేంద్రంగా ఈ కుంభకోణం నడిచింది. బ్యాంక్ మేనేజ్‌మెంట్‌తో చేతులు కలిపిన హెచ్‌డీఐఎల్ ప్రమోటర్లు పెద్ద ఎత్తున రుణాలు పొందినట్లు పోలీసులు చెబుతున్నారు. తీసుకున్న రుణాలను చెల్లించకపోయినప్పటికీ వాటిని మొండి బకాయిలు (నిరర్థక ఆస్తులు లేదా ఎన్‌పీఏ)గా పేర్కొనకుండా, ఉద్దేశపూర్వకంగా దాచి పెట్టారని స్పష్టం చేశారు. ఆర్బీఐకి కూడా తెలియకుండా జాగ్రత్తపడ్డారని ఓ అధికారిక ప్రకటనలో పోలీసులు పేర్కొన్నారు. కాగా, ఈ కేసు విచారణ కోసం ఓ ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) కూడా ఏర్పాటైంది. సమగ్ర విచారణలో భాగంగా సిట్ దర్యాప్తునకు ముంబై ఆర్థిక నేరాల విభాగం సిద్ధమైంది. 137 శాఖలున్న పీఎంసీలో రూ.11 వేల కోట్లకుపైగా డిపాజిట్లున్నాయి. ఇదిలావుంటే ఆర్బీఐ ఆంక్షలను సవాల్ చేస్తూ బాంబే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. బ్యాంక్‌లో డిపాజిట్లు, ఖాతాలున్న ఎనిమిది మంది, మరో ముంబై ఆధారిత ఎన్జీవో దీన్ని దాఖలు చేశాయి. ఇదిలా ఉంటే పీఎంసీ వ్యవహారాన్ని ఆర్బీఐ అన్ని కోణాల్లో పర్యవేక్షిస్తున్నదని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు.

### ఆర్బీఐ చేతికి పీఎంసీ

పీఎంసీ బ్యాంక్ బోర్డును ఆర్బీఐ రద్దు చేసింది. ఈ మేరకు సోమవారం ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. కస్టమర్ల కోసం ఓ టోల్-ఫ్రీ నెంబర్‌నూ ఏర్పాటు చేసింది. బ్యాంక్‌లో చోటుచేసుకుంటున్న పరిణామాల నేపథ్యంలో ఖాతాదారులు ఆందోళనకు గురికాకుండా వారి సమస్యలు, సందేహాలను తీర్చేందుకు 1800223 993 అనే టోల్-ఫ్రీ నెంబర్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిబంధనల ఉల్లంఘన, నియంత్రణ లోపాల కారణంగా సెప్టెంబర్ 24న ఆర్బీఐ.. పీఎంసీపై ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. రుణాల మంజూరు, పెట్టుబడులు, డిపాజిట్ల సేకరణ వంటి వాటిపై నిషేధం విధించింది. అంతకుముందు ఆర్థిక సంవత్సరం (2017-18)తో పోల్చితే గత ఆర్థిక సంవత్సరం (2018-19)లో బ్యాంక్ మొండి బకాయిలు ఏకంగా రెండింతలకుపైగా పెరిగాయి. 1.05 శాతం నుంచి 2.19 శాతానికి ఎగబాకాయి. దీంతోనే ఆర్బీఐ అప్రమత్తమైంది. ఇప్పటికే ఆ బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ జాయ్ థామస్‌ను సస్పెండ్ చేసి, ఆయన స్థానంలో పర్యవేక్షకుడిగా జేబీ భోరియాను నియమించిన సంగతి విదితమే. ఈ క్రమంలో ఇప్పుడు మొత్తం బోర్డునే రద్దు చేసి బ్యాంక్‌ను తమ అధీనంలోకి తీసుకున్నది.

## దివాలా దిశగా ఫరెవర్ 21

■ ప్రపంచవ్యాప్తంగా మూతబడనున్న 500లకుపైగా స్టోర్లు
■ ఆసియా, ఐరోపా దేశాలవే ఎక్కువ




**న్యూయార్క్, సెప్టెంబర్ 30:** చౌక ధరల ఫ్యాషన్ దుస్తుల రిటైల్ స్టోర్ ఫరెవర్ 21.. దివాలా దిశగా వెళ్తున్నది. ఆదివారం అమెరికాలో చాప్టర్ 11 బ్యాంక్‌రప్సీని దాఖలు చేసింది. చాప్టర్ 11 బ్యాంక్‌రప్సీ.. రుణాల పునర్వ్యవస్థీకరణకు వీలు కల్పించి, ఇబ్బందుల్లో ఉన్న వ్యాపారాన్ని నిలదొక్కుకునేందుకు అవకాశాన్నిస్తుంది. జేపీమోర్గాన్ చేస్ బ్యాంక్ నుంచి 275 మిలియన్ డాలర్లు, టీపీజీ సిక్స్త్ స్ట్రీట్ పార్ట్‌నర్స్ నుంచి 75 మిలియన్ డాలర్లను ఫరెవర్ 21 పొందింది. 'మా సంస్థ భవిష్యత్తుకు ఇది కీలకం' అని ఫరెవర్ 21 ఎగ్జిక్యూటివ్ ఉపాధ్యక్షురాలు లిండా చాంగ్ అన్నారు. కాగా, ఈ సంస్థ అప్పులు, ఆస్తులు బిలియన్ డాలర్ల నుంచి 10 బిలియన్ డాలర్ల మధ్య ఉన్నాయని కోర్టుకు సమర్పించిన వివరాల ప్రకారం తెలుస్తున్నది.

### భారతీయ స్టోర్లపై లేని స్పష్టత


ఫరెవర్ 21కు ప్రపంచవ్యాప్తంగా 815 స్టోర్లున్నాయి. వీటిలో 530 వరకు స్టోర్లు మూతబడనున్నాయి. 178 స్టోర్లు అమెరికాలోనివైతే, మిగతా 350 స్టోర్లదాకా ఇతర దేశాలకు చెందినవి ఉన్నాయి. వీటిలో ఆసియా, ఐరోపా దేశాలకు చెందినవే ఎక్కువ. అయితే భారత్‌లోని స్టోర్లపై మాత్రం సంస్థ స్పష్టత ఇవ్వలేదు. మెక్సికో, లాటిన్ అమెరికా దేశాల్లోని స్టోర్లను కొనసాగిస్తామని ఫరెవర్ 21 తెలియజేసింది. 1984లో మొదలైన ఫరెవర్ 21.. 1990వ దశకంలో సమకాలీన బ్రాండ్లను వెనక్కి నెడుతూ యువతను విపరీతంగా ఆకట్టుకున్నది.

### ఆన్‌లైన్ దెబ్బ

అమెరికాలోని సంప్రదాయ వ్యాపారులకు ఆన్‌లైన్ మార్కెట్ సెగ గట్టిగానే తగులుతున్నది. ముఖ్యంగా వస్త్ర దుకాణదారులపై ఈ ప్రభావం పెద్ద ఎత్తున కనిపిస్తున్నది. పెరిగిన ఆన్‌లైన్ కొనుగోళ్లు, మారిన కస్టమర్ల ఆలోచనా ధోరణి కారణంగా ఇప్పటికే బార్నేస్ న్యూయార్క్, డీజిల్ యూఎస్ఏ వంటి ఫ్యాషన్ రిటైలర్లు చాప్టర్ 11 బ్యాంక్‌రప్సీకి దరఖాస్తు చేసుకున్నారు. ఇప్పుడు ఈ జాబితాలో ఫరెవర్ 21 కూడా చేరిపోయింది. ఇక పేలెస్ షూసోర్స్, చార్లోట్ రస్సే వంటి స్టోర్లు ఇప్పటికే మూతబడ్డాయి.

## రైతులకు ప్రత్యేక స్కీంలు

బీవోబీ తెలంగాణ రీజినల్ జీఎం శ్రీనివాస్




సమావేశంలో మాట్లాడుతున్న బీవోబీ ఉన్నతాధికారులు

**హిమాయత్‌నగర్, సెప్టెంబర్ 30 :** గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న రైతులకు మరిన్ని ఆర్థిక సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ) తెలంగాణ రీజినల్ జీఎం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం హైదర్‌గూడలోని బ్యాంక్ జోనల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. దేశానికి వెన్నుముకగా ఉంటూ సేవలు అందిస్తున్న రైతులకు అండగా ఉండాలనే సంకల్పంతో అక్టోబర్ 1 నుంచి 15 వరకు 'బరోడా కిషన్ పక్వాడా' పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా సంబరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలుగు రాష్ట్రాలోని రైతులకు రుణాలు అందించేందుకు ప్రత్యేక స్కీమ్‌లను ప్రవేశపెట్టినట్లు చెప్పిన ఆయన.. ఈ పదిహేను రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో బ్యాంకు నుంచి వ్యవసాయ రుణాలు ఎలా తీసుకోవాలనే అంశంపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామన్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఉన్న 484 శాఖల్లో రైతులతోని సత్సంబంధాలు పెంచుకునేందుకు కిసాన్ మేళాలు నిర్వహించడంతో పాటు అక్టోబర్ 16న వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా బరోడా కిసాన్ దివాస్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆయన చెప్పారు. బరోడా కిసాన్ క్రెడిట్ కార్డులపై, వ్యవసాయ రుణాలు పొందే సదుపాయాలపై అవగాహన కార్యక్రమాలకు శ్రీకారం చుట్టినట్లు ఆయన వెల్లడించారు.


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
ఈ పండుగకి సంతోషాలను అపారంగా ఇంటికి తీసుకురండి
హోండా
పండుగ
ధమాకా
₹11,000#
వరకు ప్రయోజనాలు
Shine
LIMITED EDITION
Activa 5G
HDFC BANK
We understand your world
₹8,900^
వరకు ఆదా
FREE
joyclub
₹2,100##
వరకు ప్రయోజనాలు
తక్కువ
డౌన్ పేమెంట్
₹1,100*
Paytm Cashback
Scan & Book!
₹7000^^
ప్రముఖ క్రెడిట్ మరియు డెబిట్ కార్డ్స్ పైన EMI+
EMI Powered by Pine Labs
ALWAYS WEAR A HELMET WHILE RIDING
Also available:
Annual Maintenance Contract**
Road Side Assistance**
Engine Health Assurance**
Follow us on
IndusInd Bank
Chola
IDFC FIRST Bank
muthoot CAPITAL
SHRIRAM City
హోండా అంటే HONDA
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
^Conditions apply, Rs 8,900 Savings calculated against the general market finance scheme considering the certain loan amount & may vary on the actual condition. ##Honda Joy Club Program is a paid loyalty program and only members can avail mentioned benefits with respect to program terms and conditions. For further details visit www.hondajoyclub.com or call 1800-532-2555 (Monday to Friday 9.30 am to 6.30 pm). #Benefits up to Rs 11,000 is the sum total of the savings on the HDFC finance scheme in row one and the Joy Club Benefits. *Rs 1,100 Low Down Payment Scheme is subject to financier policy and is available through preferred Finance partners at their sole discretion. ^^Paytm cashback offer is subject to Paytm and respective dealers terms and conditions at their sole discretion. +Contact your local HMSI dealership for details on EMI on leading credit & debit cards Powered by Pine Labs. The same is subject to availability at select dealerships. Multiple schemes & offers cannot be clubbed together, all the attached schemes and offers are applicable for a limited time period and can be withdrawn from the market without prior notice. All the schemes and offers are applicable on selected models or their variants. All the schemes and offers are available on selected dealerships. Product shown in the picture may vary from the actual product available in the market. Accessories shown in the picture are not a part of the standard fitment. **Conditions Apply.
Honda Exclusive Authorized Dealerships: KARIMNAGAR: Samrat Honda - 0878-2277299; 9441333665; Srikanth Honda - 0878-2224555, 7799946632; JAGATIAL: Samrat Honda - 9701200045, 9704500045; HUZURABAD: Samrat Honda - 8099979050; SIRCILLA: Srikanth Honda - 08723-233336, 7799700245; PEDDAPALLY: Srikanth Honda - 7799700259; SULTANABAD: Aradhna Honda - 9849885862; VEMULAWADA: Srikanth Honda - 9177662757; METPALLY: Saanvi Honda - 9581295818; JAMMIKUNTA: Srikanth Honda - 7799700263; DHARMARAM: Sairam Honda - 9642828885, 08728-270950; HUSANABAD: Laxmi Honda - 9949915222; ADILABAD: Sree Mahalakshmi Honda - 9010977757; RAMAGUNDAM: Sai Ram Krishna Honda - 8100779999; MANCHERIAL: Jagadamba Honda - 08736-259303; BELLAMPALLY: Thirumala Honda - 08735225975; 9059979909; NIRMAL: Sree Mahalakshmi Honda - 9010977757; ASIFABAD: Sainath Honda - 9010431431, 8500612233; KHANAPUR: Sri Ganesh Honda - 9010977757; BHAINSA: Sree Mahalakshmi Honda - 9010977757; KAGAZNAGAR: Sree Mahalakshmi Honda - 9010977757; ICHODA: Sree Mahalakshmi Honda - 9010977757.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com


happi mobiles
A Multi Brand Mobile Retail Chain
MEGA FESTIVE DHAMAKA
5 CRORE WORTH GIFTS
A GIFT ON EVERY PURCHASE GUARANTEED
1st MONTH EMI FREE
1 YEAR EXTENDED WARRANTY
DAMAGE PROTECTION
BETTER THAN ONLINE
5% CASHBACK
HDFC BANK
We understand your world
ICICI Bank Consumer Finance
On all Debit & Credit cards
iPhone 11Pro
UPTO 7000 CASHBACK
HDFC BANK
OPPO A9 2020
8GB | 128GB
0% Down Payment
vivo S1
4GB | 6GB
0% Down Payment
vivo V17 Pro
Shoot Beyond Limits
NEW ARRIVAL
10% CASHBACK
HDFC BANK
realme X
4GB |128GB
0% Down Payment
realme XT
64MP Quad Camera Xpert
PRE BOOKING
Xiaomi
SMART TV'S
55" 49" 43" 32"
BEST PRICE AVAILABLE
Karbonn K1 Prime
₹1799
1799 విలువగల Pedestal Fan ఉచితం
LAVA Magnum X1 Tab
52% డిస్కౌంట్
₹5500
Redmi A3
Created by Xiaomi. Innovations from Google
10% CASHBACK
HDFC BANK
Redmi GO
1GB | 16GB
Aapki Nayi Duniya
₹4499
Redmi K20 Pro
0% Down Payment
కెమెరా, టార్చ్ వీడియో ప్లేయర్
FLASH SALE
399
Only For 4 Days*
షోరూమ్ అడ్రస్ : 2-10-17, ముకరంపుర, 2 టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, వోడాఫోన్ స్టోర్ ఎదురుగా,
కరీంనగర్ -505001, తెలంగాణ. 9100798666
షోరూమ్ అడ్రస్ : 18-5-193, లక్ష్మీనగర్ , SBI బ్యాంక్ ఎదురుగా,
గోదావరి ఖని - 505209 , తెలంగాణ. 7893622666
EMI Options
BAJAJ FINSERV
IDFC FIRST Bank
HDFC BANK
HDB FINANCIAL SERVICES
ICICI Bank Consumer Finance
TVS CREDIT
HOME CREDIT
9100412345
www.happimobiles.com
Follow us:
Conditions apply*

నమస్తే తెలంగాణ
జిందగీ
మంగళవారం 1 అక్టోబర్ 2019
WWW. NTNEWS.COM
/nt.zindagi



# పాలవంటి చర్మం మీ సొంతం

- టమాటాను గుజ్జుగా మార్చి, దీనికి కొన్ని చుక్కల నిమ్మరసాన్ని కలపాలి.ఈ మిశ్రమాన్ని ముఖానికి అప్లై చేసి కనీసం 20 నిమిషాల పాటు ఉంచి, తరువాత కడగాలి. టమాటా చర్మాన్ని కాంతివంతంగా చేస్తుంది.
- తేనెలో యాంటీ ఆక్సిడెంట్లు ఎక్కువగా ఉంటాయి. ఒక చెంచా తేనెను తీసుకొని, దానికి చిటికెడు దాల్చిన చెక్క కలిపి ముఖానికి అప్లై చేయాలి. కొద్దిసేపటి తర్వాత కడిగేయాలి. ఇలా రోజూ చేయడం వల్ల ముఖకాంతి రెట్టింపవుతుంది.
- యాంటీ ఆక్సిడెంట్, విటమిన్ సి అధికంగా ఉండే ఉసిరి చర్మాన్ని ఆరోగ్యంగా మెరిసేలా చేస్తుంది. దీంతోపాటు చర్మ నిర్మాణాన్ని సరిచేస్తుంది. రోజూ రాత్రి పడుకోవడానికి ముందు ఒక చెంచా ఉసిరి రసాన్ని, ఒక చెంచా తేనెను కలిపి ముఖానికి అప్లై చేయాలి. మరుసటి రోజు కడిగిన తర్వాత మార్పులను గమనించవచ్చు.
- పెరుగుతో ఆరోగ్యానికే కాదు. చర్మ సౌందర్యాన్ని కూడా మెరుగుపర్చుకోవచ్చు. పెరుగును మన చర్మంపై రాసి కొద్ది నిమిషాలు అలాగే ఉంచి కడిగేయాలి. దీనిలోని లాక్టిక్ యాసిడ్ చర్మ రంధ్రాల్లో పేరుకుపోయిన దుమ్ము, ధూళి కణాలను తొలగిస్తుంది. పాల వంటి చర్మాన్ని అందిస్తుంది.
- ప్రతి రోజు స్నానానికి ముందు శరీరం శుభ్రం చేసుకునే బ్రష్‌తో ఒళ్లంతా రుద్దాలి. చర్మరంధ్రాల్లో వ్యాధిక్రిములు పుట్టించే విషపదార్థాలు తొలగిపోయి చర్మం ఆరోగ్యంగా ఉంటుంది.

శరన్నవరాత్రులు

## శాంతికి ప్రతీక చంద్రఘంట



**రూపం :** చంద్రఘంట.. అమృత భరితమైన నిత్యానంద రసాపానం లేదా చంద్రకాంతి సుధాపానం చేయడం ద్వారా ఒక అపూర్వ అంశ రూపొందింది. ఆ అద్భుత రూపమే చంద్రఘంట అవతారం. చల్లని వెన్నెల కాంతినీ, తెల్లని స్వచ్ఛమైన రూపాన్నే ప్రపంచానికి శాంతి. సౌఖ్యాల రూపాల్లో అందించేదే ఈ అమ్మ స్వరూపం. సకల ప్రాణికోటి సంతోషం లక్ష్యం, జీవన గమ్య ప్రశాంతత లోనే ఉందన్న సందేశాత్మకం చంద్రఘంటావతారం. భక్తితో ఈ తల్లిని ఆరాధించే వారికి తన చల్లని కరుణామృత చూపులతో శాంతి సౌభాగ్యాలు అందిస్తుంది.

**ధ్యానం :** **'పిండజ పరవరారూఢా చండకోపాస్త్రకైర్యుతా,**
**ప్రసాదం తనుతే మహ్యం చంద్రఘంటేతి విశ్రుతా.'**

**నైవేద్యం :** ఆశ్వయుజ శుద్ధ తదియ రోజు చంద్రఘంటా రూపంలో అమ్మవారిని స్వచ్ఛమైన, శుద్ధమైన మనసుతో ఆరాధిస్తారు. లోకానందకురాలైన చంద్రఘంటాదేవికి సమర్పించే కొబ్బరి అన్నం, పాయసం తదియ నైవేద్యం.

– **ఇట్టేడు**

## పుత్రశోకాన్ని దూరం చేస్తున్నారు!



**ముక్కూ మొహం తెలియని పసికందులు. పుట్టిన కొన్ని రోజుల వ్యవధిలోనే గుండెజబ్బుతో బాధపడుతున్నారు. ట్రీట్‌మెంట్‌కు నోచుకోలేని వారు మరణం వైపు అడుగులు వేస్తున్నారు. ఇది ఒక తల్లి బాధ కాదు. ఎందరో తల్లుల ఆవేదన. అలాంటి తల్లిదండ్రుల పుత్రశోకాన్ని దూరం చేయడానికే ఈ దంపతులు ఓ సంస్థకు నాంది పలికారు.**

లాల్మతి, మోహన్‌లాల్ దంపతులకు పదిహేడేండ్లకు బిడ్డ పుట్టాడు. తక్కువ నెలలతో పుట్టడం వల్ల శిశువు కిలో బరువు మాత్రమే ఉన్నాడు. చికిత్స పొందుతున్నప్పటికీ బరువు పెరుగడం లేదు. 23 రోజులకు బాబు పేటెంట్ డక్టస్ ఆర్టెరియోసస్(గుండె జబ్బు)తో బాధపడుతున్నట్లు తెలిసింది. ట్రీట్‌మెంట్‌కు వారి వద్ద డబ్బులేదు. ఏం చేయాలో తోచని పరిస్థితి. అదే సమయానికి గురుగ్రామ్‌కు చెందిన ప్రేమసాగర్ స్థాపించిన 'జెనెసిస్ ఫౌండేషన్' గురించి తెలిసింది. ఇది పిల్లలకు పుట్టుకతో వచ్చే గుండె జబ్బులకు(సిహెచ్‌డి) వైద్యం అందిస్తున్నది. దీని ద్వారా బాబుకు ఆపరేషన్ చేయించారు లాల్మతి, మోహన్‌లాల్. ప్రపంచవ్యాప్తంగా ఏడాదికి 2 లక్షలకు పైగా పిల్లలకు పుట్టుకతోనే గుండెజబ్బులు వస్తున్నట్లు పరిశోధనలో తేలింది. భారతదేశంలో 1000 మంది పిల్లల్లో 9 మందికి గుండె జబ్బు వస్తున్నట్లు తెలిసింది. నెలవారి జీతం 10 వేలు ఉన్నవారి పిల్లలకు ట్రీట్‌మెంట్ చేయించడానికి ఎంత కష్టమో అర్థం చేసుకొని ఈ సంస్థను స్థాపించినట్లు మరోతల్లి ప్రేమ చెబుతున్నది. ప్రేమ, జ్యోతి సాగర్ దంపతులకు ఎన్నో ఏండ్లకు పుట్టిన బిడ్డ కొన్ని రోజులకే గుండె జబ్బుతో మరణించాడు. బాబుకు సమీర్ అని పేరుపెట్టారు. అతని మరణం.. 1992లో జెనెసిస్ సంస్థ స్థాపించేలా చేసింది. క్యాన్సర్, తలసేమియా, గుండెకు సంబంధించిన సమస్యల వంటి దీర్ఘకాలిక వ్యాధులపై దృష్టి పెట్టింది. 2010 నాటికి పుట్టుకతో వచ్చే గుండె జబ్బులను ఈ సంస్థ తగ్గించింది. బెంగళూరులోని కొలంబియా ఆసియా, నోయిడాలోని జేపీ హాస్పిటల్, కొచ్చిలోని అమృత ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్, చెన్నైలోని ఎమ్ఐఓటీ హాస్పిటల్, ముంబైలోని బృహస్పతి హాస్పిటల్స్ ఈ సంస్థతో కలిసి పనిచేస్తున్నాయి.

వంటింటి చిట్కాలు



- బియ్యంలో మట్టిగడ్డలు ఎక్కువగా ఉంటే చారెడు ఉప్పు వేసి పది నిమిషాలు నాననిస్తే మట్టిగడ్డలు నీళ్లలో కరుగుతాయి.
- కాయగూరల్ని ముందుగా నీటిలో శుభ్రంగా కడిగి ఆ తరువాత తరగాలి. తరిగిన తర్వాత కడుగకూడదు.
- కూరగాయ ముక్కల్ని పసుపు కలిపిన నీటిలో ఉంచితే ఏమైనా క్రిములు ఉంటే అవి పైకి తేలుతాయి.
- ఫ్రిజ్‌లోంచి తీసిన నిమ్మకాయ గది ఉష్ణోగ్రతకు చేరిన తర్వాతనే కోయాలి. లేకుంటే రసం తక్కువగా వస్తుంది.
- పగిలిన గుడ్డును కొంచెం వెనిగర్ కలిపిన నీళ్లలో ఉడకబెడితే గుడ్డులోపలి ద్రవం బయటికి రాకుండా బాగా ఉడుకుతుంది.
- గుడ్లను ఉప్పు నీటిలో ఉడకబెట్టిన వెంటనే చన్నీళ్లలో ఉంచితే పెంకు ఒలవడం తేలికవుతుంది.
- కోడిగుడ్డును అల్యూమినియం లేదా వెండిపాత్రలోలలో పగులగొడితే అందులోని సల్ఫర్ కారణంగా పాత్రలు నల్లబడతాయి.



# ధూల్‌పేట పచ్చళ్లు!

**కరీంనగర్ జిల్లా ముల్కనూర్, కట్కూరు చిన్న గ్రామాలు. కొన్నేండ్ల కిందట కుటుంబ పోషణ కోసం సమస్యలెదుర్కొన్న ప్రాంతాలు. ధైర్యం కోల్పోకుండా పాడిపరిశ్రమ వైపు అడుగులు వేశాయి. మహిళలు పాల ఉత్పత్తినే ఉపాధిగా మల్చుకొన్నారు. సాధికారత దిశగా అడుగులు వేశారు. ఇలాంటి గ్రామాలు ఎన్నో ఉన్నాయి. సరిగ్గా ఇలాంటి సాధికారతనే కనిపిస్తున్నది ఇప్పుడు హైదరాబాద్ 'ధూల్‌పేట'మహిళల్లో కూడా..**

**ధూల్‌పేట్‌**లో 'గుడుంబా దందా'ను కవర్ చేయడానికి వెళ్తాడు న్యూస్ రిపోర్టరైన హీరో. అనుకున్నట్టుగానే అక్కడ విచ్చలవిడి వ్యాపారం సాగుతుంది. ట్యూబుల్లో, పెద్ద కుండల్లో గుడుంబాను యథేచ్ఛగా సరఫరా చేస్తుంటారు. సీక్రెట్ కెమెరాలతో దాన్నంతా చిత్రీకరిస్తాడు. విషయం నిర్వాహకులకు తెలుస్తుంది. స్థానికులతో కలిసి రిపోర్టర్ మీద దాడికి ప్రయత్నిస్తారు...

**'లోథాల్'- గుజరాత్ :** సింధులోయ నాగరికతలో ముఖ్యమైన దక్షిణ నగరం లోథాల్. యుద్ధవిద్యలు, దేహదారుఢ్యం, గుర్రాలకు, ఏనుగులకు శిక్షణ ఇవ్వడం ఇక్కడి వారి నేపథ్యం. మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు సారథ్యంలో వీరి ప్రయాణం హైదరాబాద్ వరకూ వచ్చింది. సైన్యానికి 'సారాయి'కూడా అందించేవారు. గోల్కొండ రాజ్య పతనం తర్వాత తిరిగి వెళ్లడకుండా ధూల్‌పేట్‌లో స్థిరపడ్డారు. తర్వాతి కాలంలో లోథాలు నిజాంకు వ్యతిరేకంగా పోరాడారు. రాజులు, రాజ్యాలు పోయాయి. లోథాల పరిస్థితి మారింది. యుద్ధవిద్యలకు దూరమై ప్రత్యామ్నాయ వృత్తులను నేర్చుకున్నారు. అందులో ఓ వృత్తిని రహస్యంగా కొనసాగించారు. అదే గుడుంబా, నాటు సారా..

**ధూల్‌పేట్..** రోజురోజుకూ గుడుంబా విస్తరిస్తున్నట్టు కనిపించే ప్రాంతం. గుట్టుచప్పుడు కాకుండా సారాయి, గుడుంబా సరఫరా జరిగేది. సారా కాయనిదే అక్కడ కొన్ని కుటుంబాలకు రోజు గడవని పరిస్థితులు వచ్చాయి. రానురానూ ఇది అనారోగ్యకరమైన వాతావరణానికి దారి తీసింది. ప్రభుత్వం దాన్ని పూర్తిగా నిషేధించింది. దీంతో సారా తయారీ కుటుంబాలు దాదాపు ప్రధాన ఆర్థిక వనరును కోల్పోవాల్సి వచ్చింది. అయినా గుట్టుచప్పుడు కాకుండా అక్కడక్కడా స్థావరాలు ఉండేవి. క్రమంగా గుడుంబా తయారీ తగ్గింది. చాలా కుటుంబాలు ఆర్థికంగా తట్టుకోలేకపోయాయి. ప్రత్యామ్నాయ వృత్తులు చేపట్టడం అనివార్యమైంది. స్వచ్ఛంద సంస్థలు, అధికారుల అవగాహనా కార్యక్రమాలతో స్థానికులు, ముఖ్యంగా మహిళలు చైతన్యవంతులయ్యారు.

### మార్పు మొదలైందిలా..

ధూల్‌పేటలో సుమారు 800 మంది గుడుంబా తయారీతో జీవనం సాగించేవారు. ప్రభుత్వాధికారులు, ఆయా సంఘాల కార్యక్రమాల తర్వాత పురుషులు తయారీ కేంద్రాలను మూసేశారు. ఆటో డ్రైవర్లుగా, కొందరు ఫర్నీచర్ తయారీదారులుగా పనులను ప్రారంభించారు. సాయంగా మహిళలు కూడా ఇతర పనులు చేయాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలోనే స్థానికంగా ఉన్న ఓ పాఠశాలలో పచ్చళ్ల తయారీపై వర్క్‌షాప్ జరిగింది. ఉపాధి కోసం వెతుకుతున్న ధూల్‌పేట మహిళలకు ఇది చక్కని మార్గంగా కనిపించింది. వెంటనే ఈ వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. పచ్చళ్లను తయారు చేసి ఉపాధి పొందవచ్చని తెలుసుకున్నారు. ఇట్లా మహిళలు ఒక బృందంగా ఏర్పడ్డారు. ఆయా వృత్తుల్లో ప్రావీణ్యం పొందారు. సుమారు 30 మంది ఈ శిక్షణ తీసుకుని ఇప్పుడు సాధికారత దిశగా మార్పు సాధించారు.

### ఫిక్కిసహాయంతో..

మహిళా సాధికారతకు కృషి చేస్తున్న ఫిక్కీ సంస్థ వీరికి ఆసరాగా నిలిచింది. కొత్త ఉపాధి మార్గాలను వెతుకుతున్న మహిళల్లోని ఆసక్తి గమనించిన ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ ఈ మహిళలు తయారుచేసే పచ్చళ్లను మార్కెటింగ్ చేయడానికి ముందుకు వచ్చింది. ఫిక్కీ ఆధ్వర్యంలో నిర్వహించే ఎగ్జిబిషన్లలో ధూల్‌పేట మహిళల కోసం ఉచితంగా స్టాల్‌ను కేటాయిస్తున్నది ఫిక్కీ. పచ్చళ్లు తయారు చేయడానికి మహిళలకు కావాల్సిన సాయం అందిస్తున్నది ఫిక్కీ..

**చాలాసార్లు ధూల్‌పేట్ అంటే గుడుంబాకు కేంద్రం అని వినిపించేది. సినిమాల్లో కూడా ఈ ధోరణి కనిపించడంతో అది మరింత బలపడింది. కానీ ధూల్‌పేట్‌లో చాలా మంది కళాత్మక వృత్తుల్లో నైపుణ్యులు. యుద్ధవీరులు, కళాకారులు. గాలిపటాలు, మాంజాలు, దేవుండ్ల విగ్రహాలు, ప్రధానంగా వినాయక విగ్రహాలు తయారు చేయడంలో వారిది అందెవేసిన చెయ్యి. ఇప్పటికీ ధూల్‌పేట్ వినాయక విగ్రహాలు అంటే తెలియని వారుండరు. రానున్న రోజుల్లో ఇలాంటి ఎన్నో కళాత్మక వృత్తుల, సాధికారతా కార్యక్రమాలకు ధూల్‌పేట్ కేరాఫ్ అడ్రస్‌గా మారుతుంది.**

### సీజనల్ పచ్చళ్లు..

ఫిక్కీ నుంచి ప్రోత్సాహం అందడంతో ఈ మహిళలు పచ్చళ్ల తయారీలో క్రియాశీలకంగా పని చేస్తున్నారు. సీజన్ వారిగా అనేక రకాల రుచుల పచ్చళ్లను తయారు చేసి ఉపాధి పొందుతున్నారు. అట్టడుగుస్థాయిలో ఉన్న తమ జీవితాల్లో పచ్చళ్ల రూపంలో మార్పు వచ్చిందని ఆ మహిళలు అంటున్నారు. మార్కెట్‌లో ఎప్పుడూ లభించే టమాటా, మిర్చి, మామిడికాయ పచ్చళ్లను తయారు చేయడంలో అనుభవం సాధించారు. వారు ఇంట్లోనే సొంతంగా తయారు చేస్తారు.

'నిజంగా పచ్చళ్లు మా జీవితాల్లో వెలుగు నింపాయి' అంటూ సంతోషం వ్యక్తం చేసింది బృంద సభ్యురాలు శారద. 'మా ప్రాంతంలో ఉన్న కుటుంబాల్లోని మహిళలు ఉపాధి శిక్షణ తీసుకుంటున్నారు. మేం తయారు చేస్తున్న పచ్చళ్లను ఇక్కడ క్యాంటీన్లకు, హొటల్స్‌కు, ఫంక్షన్ హాల్స్‌కు సరఫరా చేయడంతో పాటు విదేశాలకు కూడా ఎగుమతి చేసేందుకు సిద్ధంగా ఉన్నాం' అంటున్నారామె. 'భారతీయ భోజనంలో ముఖ్యంగా తెలుగువారి భోజనంలో పచ్చడికి ప్రత్యేక స్థానం ఉంది. అందుకే మేం చేస్తున్న పచ్చళ్లకు మంచి గిరాకీ వచ్చింది. ఇక మీదట మా ప్రాంతం పచ్చళ్ళకు ప్రసిద్ధిగా మారుతుంది. ప్రస్తుతం మేము ఆరుగురం తక్కువ పెట్టుబడితో ప్రారంభించాం. ఫిక్కీ ఇచ్చిన సహకారంతో మాకు మార్కెటింగ్ సులభం అయ్యింది. ఇప్పుడిప్పుడే పెద్దపెద్ద ఆర్డర్లు వస్తున్నాయి. మామిడి, చింతకాయ వంటి పచ్చళ్ళను మాత్రం సీజనల్‌గా తయారుచేస్తాం. ఇక ముందు పచ్చళ్ళతోపాటు పొడులు, వడియాలు వంటివి కూడా తయారుచేస్తాం' అని ఆమె చెప్తున్నది.

హైటెక్‌సిటీలో రెండురోజుల పాటు ఏర్పాటుచేసిన ఎగ్జిబిషన్‌లో ధూల్‌పేట పచ్ళ్ళకు మంచి ఆదరణ లభించింది. ఉమెన్ సేఫ్టీ వింగ్ ఐజీ స్వాతిలక్రా ఈ పచ్చళ్లు చాలా రుచిగా ఉన్నాయని అభినందించినట్టు



చెప్తున్నారు. 'చాలా ఐటీ కంపెనీల క్యాంటీన్ల నుంచి ఆర్డర్స్ కూడా వచ్చాయి. ఇది ఎంతో సంతోషాన్నిచ్చింది' అంటూ ఎగ్జిబిషన్‌లో పాల్గొన్న ప్రీతి ఆనందం వ్యక్తం చేసింది.

### విక్రయం ఇలా..

తక్కువ పెట్టుబడితో ప్రారంభించినా ఫిక్కీ సాయంతో మార్కెటింగ్ అవకాశాలను అందుకున్నారు. దీంతో విక్రయాలు పెరిగాయి. ఇప్పుడు పెద్ద ఆర్డర్లు వస్తున్నాయంటున్నారు. మున్ముందు పచ్చళ్లు, వడియాలతో పాటు మరిన్ని ఆహార పదార్థాలు తయారు చేస్తాం అని ధీమా వ్యక్తం చేస్తున్నారు.

...✍ వినోద్ మామిడాల

## అక్షరదీపం వెలిగించింది



**పర్వత ప్రాంతాల్లోని గ్రామాల్లో ఇప్పటికీ అక్షరజ్ఞానం లేదు. సరైన రవాణాసౌకర్యాలు లేక అక్కడి ప్రజలు విద్యకు దూరమవుతున్నారు. వారికి అక్షర జ్ఞానం అందించడానికి ఓ మహిళ ముందుకొచ్చింది.**

ఉత్తరాఖండ్‌లోని మారుమూల గ్రామం సీమ్. ఇక్కడ సరైన రవాణాసౌకర్యాలు లేక ఎంతో మంది ప్రజలు విద్యకు దూరమవుతున్నారు. అటువంటి గ్రామాల్లో అక్షర దీపం వెలిగించేందుకు ముంబైకి చెందిన జయ శ్రీకారం చుట్టింది. ప్రభుత్వపాఠశాలలున్నా అక్కడికి కొండలపై నుంచి వెళ్ళాల్సి రావడంతో ఎంతో మంది చదువుకు నోచుకోలేకపోతున్నారు. ఆ విషయాన్ని తెలుసుకున్న జయ 2016లో పదవీ విరమణ చేసింది. తన భర్తతో కలిసి సీమ్ గ్రామంలో ఓ ఇంటిని గ్రంథాలయంగా మార్చింది. చుట్టుపక్కల గ్రామాలకు అందుబాటులో ఉండేలా దానిని ఏర్పాటు చేసింది. చిన్నారుల నుంచి వృద్ధుల వరకూ కుటుంబంలో ఉండే మూడు తరాల వారిని విద్యావంతులుగా తీర్చిదిద్దుతున్నది. తన వద్ద ఉన్న డబ్బుతో కొంతమంది మాత్రమే చదువుకోగలుగుతున్నారు. మరింతమందికి అక్షరజ్ఞానం అందించడానికి జయ ఓ స్వచ్ఛంద సంస్థ సహకారాన్ని తీసుకున్నది. ఆ సంస్థ అందించిన నిధులతో వందల రకాల పుస్తకాలు, ఆట బొమ్మలు గ్రంథాలయంలో ఉంచింది. ఆ గ్రంథాలయానికి 'పుస్తక నిలయం' అని పేరు పెట్టింది. ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల నుంచి పాత పుస్తకాలు సేకరించింది. వాటిని జయ తన లైబ్రరీలో చదువుకునే విద్యార్థులకు అందించింది. హిందీ, ఇంగ్లిష్‌తో పాటు సైన్స్, గణితంపై అదనంగా తరగతులు చెప్పేందుకు బయట నుంచి ఉపాధ్యాయులను తీసుకువచ్చింది. పుస్తక నిలయంలో చదువుకునే ఒక్కొక్కరూ మరో ముగ్గురు కొత్త వారిని తన లైబ్రరీకి తీసుకురావాల్సి ఉంటుంది. అలా సీమ్ గ్రామంతోపాటు చుట్టుపక్కల 10 గ్రామాలకు జయ అందిస్తున్న సేవల గురించి తెలిసింది. మొదట్లో 35 మంది విద్యార్థులతో మొదలైన ఆమె గ్రంథాలయం ప్రస్తుతం వేలాదిమందికి అక్షరజ్ఞానం ప్రసాదిస్తున్నది. చదువుతోపాటు కంప్యూటర్ పాఠాలు కూడా అక్కడ బోధిస్తున్నారు.

## బెండకాయ జ్యూస్!



- బెండకాయ జ్యూస్ తాగడం వల్ల అనీమియా తగ్గుతుంది. రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గడాన్ని అనీమియా అంటారు. దీనివల్ల తీవ్రమైన అలసట ఉంటుంది. బెండకాయ రసం తాగడం వల్ల రక్తంలో ఎర్రరక్తకణాల సంఖ్య అధికం అవుతుంది. బెండకాయ రసంలో విటమిన్ సి, మెగ్నీషియం, విటమిన్ ఏ, ఉండి రక్తకణాల ఉత్పత్తిని పెంచుతుంది.
- ఒక్కోసారి గొంతు పట్టేస్తుంది. తీవ్రమైన నొప్పి కలుగుతుంటుంది. యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ సెప్టిక్ గుణాలున్న బెండకాయ రసాన్ని తాగితే మంచిది. ఇన్‌ఫెక్షన్ వల్ల కూడా గొంతులో దురద వస్తుంది. బెండకాయ జ్యూస్ వల్ల దీనికి ఉపశమనం లభిస్తుంది.
- బెండకాయ రసంలో ఇన్సూలిన్ గుణాలు ఎక్కువగా ఉంటాయి. ఇవి మధుమేహ స్థాయిలను తగ్గిస్తాయి. బెండకాయ రసం తాగడం వల్ల శరీరంలోని చక్కెర స్థాయిలు తగ్గుతాయి. దీనితో మధుమేహ వ్యాధి నియంత్రణ సాధ్యమవుతుంది.
- విరేచనాలు వస్తుంటే శరీరం తీవ్ర డీహైడ్రేషన్‌కు గురవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో బెండకాయ రసం తాగితే చాలా మంచిది.

నమస్తే తెలంగాణ
# జీవనరేఖ
[ కరీంనగర్ ]
మంగళవారం 1 అక్టోబర్ 2019

**ఇంతకు ముందు..**

సర్జన్ చేతిలో కత్తులూ.. కటార్లు..
ఆపరేషన్ బెడ్ మీదికి వెళ్లడానికే వణికిపోయే పేషెంట్..

**ఇప్పుడు..**

సర్జన్ చేతిలో రోబో యంత్రం..
చకచకా ఆడుతున్న రోబో చేతులు.. నిశ్చింతగా పేషెంట్..
పెద్ద పెద్ద కోతల్లేవ్.. ఆపరేషన్‌లో పొరపాట్లు దొర్లుతాయేమోనన్న అనుమానాల్లేవ్.. స్క్రీన్ మీద లోపలున్న ఊపిరితిత్తులు కన్పిస్తుంటాయ్.. డాక్టర్ రోబో చేతులతో సర్జరీని చకచకా చేసేస్తుంటాడు.

**ఆపరేషన్ తరువాత..**

కొద్ది రోజుల్లోనే పేషెంటులో హుషారు..
మినిమల్లీ ఇన్వేసివ్, రోబో సర్జరీలు అందుబాటులోకి వచ్చిన తరువాత ఆపరేషన్లు మరింత సులువు అయ్యాయి. ఇవి ఊపిరితిత్తుల సర్జరీల్లో కూడా మంచి ఫలితాలిస్తున్నాయి. అయితే ఈ సర్జరీలు చేయడానికి నిపుణులైన సర్జన్ తప్పనిసరి. ఈ శస్త్ర చికిత్సలు ఎలాంటి సమస్యలకు.., ఎప్పుడు ఉపయోగమంటే...



# అతి చిన్న కోతతో అత్యాధునిక
# ఊపిరితిత్తుల చికిత్సలు

**ఊపిరి తీసుకుంటే జననం.. ఊపిరి పోతే మరణం. ఊపిరి తీసుకోవడం అంత ముఖ్యమైన ప్రక్రియ. దీన్ని నిర్వహించే శ్వాస వ్యవస్థకు శరీరంలో అత్యంత కీలకమైన స్థానం ఉంది. ఊపిరితిత్తుల్లో సమస్య ఎదురైతే దానికి చికిత్స అందించడం కూడా క్లిష్టమైన విషయంగానే ఉండేది.** అయితే వైద్య రంగంలో వస్తున్న నూతన పరిశోధనలు, ఆధునిక ప్రక్రియలు శ్వాసకోశాలకు, శ్వాస వ్యవస్థకు చికిత్సలను సులభతరం చేశాయి. ఒకప్పుడు క్షయ వ్యాధి అంటే ఇక మరణమే శరణ్యం అనుకునేవాళ్లు. ఇప్పుడది పెద్ద సమస్యే కాదు. మంచి మందులు అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా శ్వాసకోశాలకు ఏదైనా సమస్య వచ్చి శస్త్రచికిత్స చేయాల్సి వస్తే ఒకప్పుడైతే ఛాతి మీద పెద్ద గాటు పెట్టి పెద్ద సర్జరీ చేయాల్సి వచ్చేది. కాని ఇప్పుడు అందుబాటులో ఉన్న సరికొత్త సర్జరీలు రోగికీ, వైద్యులకూ ఎంతో సౌకర్యంగా ఉంటున్నాయి.

### రోబోటిక్ సర్జరీ అంటే భయమెందుకు?

రోబోటిక్ సర్జరీ అనగానే అది వైద్యులు స్వహస్తాలతో చేసే సర్జరీ కాదనీ, రోబోలు చేసే సర్జరీ కాబట్టి వాటి కదలికలను ఎలా నమ్మగలమనే అపోహలు అంతటా ఉంటున్నాయి. నిజానికి పేరుకు రోబోటిక్స్ అని ఉన్నా, వాటిని కదలిస్తూ సర్జరీ ముగించేది వైద్యులే. ప్రధానంగా ఇన్వేసివ్ సర్జరీలో రోబోటిక్స్ ఉపయోగం పెరిగింది. పలు రకాల మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీల సమయంలో రోబోటిక్స్ ఉపయోగం కొన్ని సందర్భాల్లో సగానికి పైగా, మరి కొన్ని సందర్భాల్లో అంతకంటే ఎక్కువగా ఉంటుంది.





### పెద్ద పెద్ద కోతలిక లేవు..

వ్యాధి త్వరగా నయమవ్వాలి.., చికిత్స తేలికగా ముగియాలి.., కోలుకునే సమయం తక్కువ ఉండాలి.., గాయాలూ చిన్నవిగా ఉండాలి..., సర్జరీ తదనంతరం ఇతరత్రా సమస్యలేవీ రాకూడదు... ఏ పేషెంటు అయినా కోరుకునే అంశాలివి. ఇలా ఒకవైపు రోగికి మంచి ఫలితాలనిస్తూ, మరో వైపు డాక్టర్లకు సర్జరీని సులభతరం చేసే చికిత్సా విధానమే మినిమల్లీ ఇన్వేసివ్ ట్రీట్‌మెంట్. ఛాతీపై పెద్ద పెద్ద గాట్లు లేకుండా, ఎక్కువ రక్తం పోకుండా కేవలం చిన్న రంధ్రాలతో చేసే సర్జరీ ఇది. దీన్నే కీహోల్ సర్జరీ అని కూడా అంటారు. డాక్టర్ తన చేతులకు బదులుగా రోబో యంత్రం ద్వారా సర్జరీ చేసే వెసులుబాటు కూడా వచ్చింది. రోబో చేతుల ద్వారా సర్జరీని నిర్వహిస్తారు వైద్యులు. కాబట్టి మనిషి వల్ల కలిగే చిన్న చిన్న పొరపాట్లు కూడా జరుగకుండా ఉంటాయి.

### ప్రయోజనాలు బోలెడు

ఛాతీ సమస్యలకు గతంలో అయితే భుజం అడుగున పెద్ద కోతతో సర్జరీలు జరిగేవి. ఇలాంటి ఓపెన్ సర్జరీ వల్ల ఆ భాగంలోని నాలుగు కండరాలను కోయవలసి వచ్చేది. ఫలితంగా వాటికి శాశ్వత నష్టం జరిగి చేయి కదలికలకు జీవితాంతం ఇబ్బంది ఎదురయ్యేది. చేతుల కదలికలకు సంబంధించిన ఉద్యోగాలు చేసేవారికి ఇలాంటి సర్జరీ వల్ల అంతకుముందు చేయగలిగిన పనులు చేయలేని పరిస్థితి తలెత్తుతుంది. ఇలాంటి ఓపెన్ సర్జరీ వల్ల పెద్ద గాటు ఉంటుంది కాబట్టి రక్తస్రావం ఎక్కువగా ఉంటుంది. పైగా కోత పద్ధతి వల్ల సర్జరీ తర్వాత కోలుకోవడానికి నెలల తరబడి సమయం పడుతుంది. శరీరం మీద పెద్ద గాట్లు శాశ్వతంగా మిగిలిపోతాయి. నొప్పి కూడా మూడు నెలల వరకూ ఉంటుంది. సర్జరీ తర్వాత హాస్పిటల్‌లో ఇన్‌పేషెంట్‌గా ఉండే సమయమూ ఎక్కువే. ఈ ఇబ్బందులన్నిటికీ చెక్ పెడుతూ మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ (కీహోల్ సర్జరీ) ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ఈ సర్జరీ భుజం అడుగు భాగంలో కేవలం చిన్న చిన్న రంధ్రాలు మాత్రమే పెట్టి సర్జరీ చేస్తారు. ఈ సర్జరీనే వి.ఎ.టి.ఎస్. (వీడియో అసిస్టెడ్ థొరాసిక్ సర్జరీ) అని కూడా అంటారు. ఈ సర్జరీ చేసే సమయంలో నాలుగు కండరాలకు కోత పడదు. పక్కటెముకలు కత్తిరించే పని ఉండదు. అందువల్ల రక్తస్రావం ఎక్కువగా ఉండదు. అంతేగాక రోగికి సర్జరీ తర్వాత ఎక్కువ కాలం పాటు నొప్పి వేధించదు. ఆపరేషన్ కోసం ఎక్కువ రోజులు హాస్పిటల్‌లో ఉండాల్సిన అవసరం ఉండదు. త్వరగా కోలుకుంటారు. కాబట్టి పనిసామర్థ్యం కుంటుపడదు. తొందరగా పనులు చేసుకోగలుగుతారు. కొన్ని సందర్భాల్లో రుగ్మతను బట్టి వాట్స్, రోబోటిక్ రెండూ ఒకే సమయంలో చేసే వీలూ ఉంది.

### సౌకర్యవంతమైన సర్జరీ

మినిమల్లీ ఇన్వేసివ్, రోబోటిక్ సర్జరీలు అతి తక్కువ సమయంలో ఎక్కువ ప్రయోజనం పొందగలిగే సర్జరీలుగా చెప్పుకోవచ్చు. ఉదాహరణకు ఒక చోటి నుంచి మరో చోటికి ప్రయాణం చేయదలచుకున్నప్పుడు అందుకోసం బైక్, ఆటో, కారులను ఉపయోగించుకోవచ్చు. అయితే ఈ మూడింట్లో కారు ప్రయాణం సురక్షితం. బైక్ మీద ప్రయాణం చేస్తే బ్యాలెన్స్ తప్పి పడిపోయే ప్రమాదం ఉండవచ్చు. ఆటోలో ప్రయాణం చేస్తే ప్రయాణం ఆలస్యం కావొచ్చు. పొల్యూషన్ సమస్య కూడా ఉంటుంది. అదే కారులో ప్రయాణిస్తే ఈ రెండింటికి ఆస్కారం లేకపోగా, ఏదైనా వాహనానికి గుద్దుకున్నా కూడా ఎయిర్ బ్యాగ్స్ ఉంటాయి కాబట్టి సురక్షితంగా ఉంటాం. మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలు ఈ కారు ప్రయాణం లాంటివే. ఇవి ఎంతో సురక్షితంగా గమ్యానికి చేరుస్తాయి. అంటే పేషెంటుకు సమస్య నుంచి సురక్షితంగా బయటపడేస్తాయి. కారు మాదిరిగా ప్రయాణ సమయాన్నీ తగ్గిస్తాయి. అంటే కోలుకునే సమయాన్నీ తగ్గిస్తాయి. ఇటు పేషెంటుకూ, అటు వైద్యునికీ సౌకర్యవంతంగా ఉంటాయి.

### రోబోటిక్స్ ఉపయోగాలు..



- రోబోటిక్ సర్జరీల వల్ల శరీరం మీద కోతలు లేని, 8 మిల్లీ మీటర్ల మేర చిన్న రంధ్రాలే ఏర్పడుతాయి. ఇవి కొన్ని రోజుల్లోనే మానిపోతాయి.
- చేతులు వణికినా, రోబోలు ఆ కుదుపులను ఆపేస్తాయి. ఫలితంగా స్వయంగా చేతులతో చేసే సర్జరీల్లో దొర్లే తప్పులనూ రోబోలు సరిచేసి పొరపాటుకు ఆస్కారం లేకుండా చేస్తాయి.
- మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ, ఓపెన్ సర్జరీ చేసే సమయంలో అంతర్గత అవయవాల సైజు కంటికి అవసరానికి మించి పెద్దగా కనిపించదు. కానీ రోబోటిక్ సర్జరీలో అంతర్గత అవయవాలు, కణుతులు పెద్ద పరిమాణంలో కనిపించి, సర్జరీ చేయడం సులువవుతుంది.
- నాడులు కూడా స్పష్టంగా కనిపిస్తాయి.



**డాక్టర్ కె. బాలసుబ్రమణియం**
సీనియర్ మినిమల్లీ ఇన్వేసివ్ లంగ్ అండ్ రోబోటిక్ థొరాసిక్ సర్జన్
యశోద హాస్పిటల్స్, హైదరాబాద్
ఫోన్ : 8121022333

## ఈ రుగ్మతల కోసం..

**మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీని అనేక రకాల ఛాతి సమస్యల చికిత్స కోసం ఉపయోగిస్తారు. ఊపిరితిత్తులకు వచ్చే న్యుమోనియా లాంటి ఇన్‌ఫెక్షన్ల నుంచి కణుతుల వరకూ కూడా ఈ చికిత్సలను ఉపయోగించవచ్చు. క్యాన్సర్‌కు కూడా మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతి ద్వారా సర్జరీ చేయవచ్చు.**

### ఊపిరితిత్తుల క్యాన్సర్




గతంలో అయితే క్యాన్సర్ కణితులను తీసేయడానికి ఓపెన్ సర్జరీయే చేయాల్సి వచ్చేది. కాని ఇప్పుడు ఊపిరితిత్తుల్లో క్యాన్సర్ గడ్డలు తొలగించడానికి కూడా మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ ఉపయోగపడుతున్నది.

### న్యుమోనియా

న్యుమోనియా సాధారణంగా బాక్టీరియ ఇన్‌ఫెక్షన్ వల్ల వస్తుంది. ఈ సమస్యలో ఊపిరితిత్తుల్లో సుమారుగా 50 మిల్లీ లీటర్ల వరకు నీరు చేరుకుంటూ ఉంటుంది. ఈ నీరు ఎంతో కొంత దానంతట అదే ఇంకిపోతుంది. అయితే కొంతమందిలో ఇన్‌ఫెక్షన్ కారణంగా ఈ నీరు మరీ ఎక్కువగా తయారవుతుంది. దానివల్ల అది దానంతట అదే ఇంకిపోలేనంతగా పెరుగుతుంది. దాంతో ఆ నీరు ఊపిరితిత్తుల చుట్టూ పేరుకుపోతుంది. ఫలితంగా శ్వాస తీసుకున్నప్పుడు ఊపిరితిత్తులు వ్యాకోచించలేవు. క్రమంగా కుంచించుకుపోతాయి. దాంతో ఊపిరి తీసుకోవడం కష్టమవుతుంది. ఈ సమస్య సాధారణ ఎక్స్‌రేలో తెలిసిపోతుంది. రోడ్డు ప్రమాదాల్లో ఛాతీకి దెబ్బ తగిలినప్పుడు కూడా ఊపిరితిత్తుల చుట్టూ రక్తం నిండుకుని, ఊపిరితిత్తులు వ్యాకోచం చెందలేక శ్వాస తీసుకోవడం కష్టమవుతుంది. ఈ రెండు పరిస్థితులను చక్కదిద్దకపోతే ప్రాణ నష్టం తప్పదు. న్యుమోనియాలో పేరుకుపోతున్న నీరు రెండు వారాలకు మించి తొలగించకపోతే అది గట్టి పొరగా మారి గట్టిపడుతుంది. ఇలాంటప్పుడు మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ సహాయంతో గట్టిపడిన ఈ పొరను కత్తిరించి నీటిని తొలగిస్తారు. దాంతో ఊపిరితిత్తులు ఎప్పటిలా వ్యాకోచించగలుగుతాయి. ఈ సర్జరీని వైద్య పరిభాషలో డీకార్టిగేషన్ అంటారు.

### ఊపిరితిత్తుల్లో కావిటీలు



ఇన్‌ఫెక్షన్ కారణంగా ఊపిరితిత్తుల్లోని కొంతభాగం చెక్కుకుపోతుంది. వీటినే కావిటీలంటారు. వీటివల్ల రక్తస్రావం జరుగుతూ ఉంటుంది. దగ్గినప్పుడు నోటి వెంట రక్తం పడుతూ ఉంటుంది. ఇలాంటప్పుడు మినిమల్లీ ఇన్వేసివ్ చికిత్సలు ఉపయోగపడుతాయి.

### ఛాతీలో కణుతులు

కణితులంటే అన్నీ క్యాన్సర్ గడ్డలే కానక్కరలేదు. క్యాన్సర్ కాని గడ్డలను బినైన్ ట్యూమర్లు అంటారు. ఇలాంటి బినైన్ గడ్డలు ఊపిరితిత్తుల్లో ఏర్పడినప్పుడు వాటిని కూడా తొలగించడానికి కూడా మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలు ఉపయోగపడుతున్నాయి.

### క్షయ

క్షయ కారణంగా ఊపిరితిత్తులు ఛాతీకి అంటుకుపోతాయి. ఇలాంటప్పుడు ఇంతకుముందయితే పొట్ట ప్రాంతంలో రంధ్రం చేసి కార్బన్ డయాక్సైడ్ వాయువును పంపిస్తారు. దాంతో ఛాతి ఉబ్బుతుంది. అప్పుడు సర్జరీ చేసేవాళ్లు. ఊపిరితిత్తులు ఛాతి ఎముకలకు అంటుకుపోవడం వల్ల సర్జరీ చేయడానికి అనువుగా ఉండేది కాదు. అందుకే ఈ పద్ధతి అనుసరించేవాళ్లు. కానీ మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీలో కృత్రిమ పద్ధతి ద్వారా ఊపిరితిత్తులను కుంచించుకుపోయేలా చేస్తారు. ఛాతీలో సర్జరీకి అనువైన ఖాళీ ప్రదేశాన్ని సృష్టించే వీలుంటుంది. ఫలితంగా సర్జరీ సులువవుతుంది.



### స్మోక్ బబుల్స్

సంవత్సరాల పాటు ధూమపానం అలవాటు ఉన్నవారి ఊపిరితిత్తుల్లో స్మోక్ బబుల్స్ తయారవుతూ ఉంటాయి. ఈ సమస్యను బుల్లా అంటారు. దగ్గినప్పుడు లేదా చిన్న ఒత్తిడి కలిగినా ఈ బుడగలు పగిలిపోయి రక్తస్రావం అవుతూ ఉంటుంది. బుడగలు పగిలిన భాగంలో రంధ్రం ఏర్పడి పీల్చుకున్న గాలి కూడా బయటకు వెళ్లిపోతుంటుంది. దాంతో క్రమేపీ ఊపిరితిత్తులకు సమస్యలు తలెత్తి, శ్వాసలో ఇబ్బందులు ఏర్పడుతాయి. ఈ రంధ్రాలను మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ ద్వారా సరిచేసే వీలుంది. ఈ సర్జరీని వైద్య పరిభాషలో బుల్లెక్టమీ అంటారు.

### లోబ్ పాడయితే..



ఊపిరితిత్తులు మూడు లోబ్‌లుగా ఉంటుంది. వీటినే లంబికలు అని కూడా అంటారు. తరచుగా ఊపిరితిత్తుల్లో సమస్యలు వస్తే ఈ లోబ్‌లు దెబ్బతింటాయి. పదే పదే తలెత్తే ఇన్‌ఫెక్షన్ (బ్రాంకైటిస్), న్యుమోనియా, క్షయ, క్యాన్సర్ వంటి కారణాల వల్ల లోబ్ పాడయ్యేందుకు ఆస్కారం ఉంటుంది. ఇలా ఏదైనా లోబ్ పాడయినప్పుడు దాన్ని మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ ద్వారా తొలగించవచ్చు. అయితే ఊపిరితిత్తిలో కొంత భాగం అయిన లోబ్‌ని తీసేయడం వల్ల మిగిలివున్న ఊపిరితిత్తిలో సమస్య వస్తుందేమో అని భయపడుతారు. కాని అలాంటిదేమీ ఉండదు. పాడయిన లోబ్ తొలగించడం మూలంగా మిగతా ఊపిరితిత్తి పనిచేయకుండాపోయే పరిస్థితి ఉండదు.

### డయాగ్నస్టిక్ బయాప్సీ

కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తులు పదే పదే ఇన్‌ఫెక్షన్లకు గురవుతూ మందులు వాడినా తగ్గకుండా పదే పదే తిరగబెడుతూ ఉంటే ఊపిరితిత్తుల్లోని చిన్న భాగాన్ని బయాప్సీకి పంపించాల్సి ఉంటుంది. ఈ ముక్కను సేకరించడానికి కూడా ఇన్వేసివ్ సర్జరీ చేయవచ్చు. వాతావరణ కాలుష్యం కారణంగా ఇండస్ట్రియల్ లంగ్ డిసీజ్ వచ్చిన సందర్భంలో ఎలాంటి కాలుష్యం కారణంగా రుగ్మత తలెత్తుతుందో తెలుసుకోవడం కోసం బయాప్సీ చేయక తప్పదు. కొంతమందిలో క్షయను నిర్ధారించడం కష్టమవుతుంది. సాధారణ రక్త పరీక్ష, ఎక్స్‌రేలలో క్షయ నిర్ధారణ కాకపోతే అలాంటి సందర్భంలో కూడా బయాప్సీ చేయాల్సి వస్తుంది. ఇలా ఊపిరితిత్తుల బయాప్సీ కోసం సురక్షితమైన మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీ చేయవచ్చు.

### గుండె సమస్యలు



గుండె చుట్టూ నీరు చేరినప్పుడు ఛాతి గుండా ట్యూబ్ వేసి నీరు తొలగించే ప్రక్రియ శాశ్వత పరిష్కారం అందించలేదు. నీరు తొలగించిన తర్వాత తిరిగి నీరు చేరుతూనే ఉంటుంది. ఇలా అదేపనిగా చేసే వీలుండదు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారంగా కూడా మినిమల్లీ ఇన్వేసివ్ సర్జరీని ఆశ్రయించవచ్చు. గుండె చుట్టూ ఉండే పెరికార్డియం అనే పొరకు రంధ్రం చేసి కిటికీ లాగా చేస్తారు. దీని ద్వారా ఆ ద్రవం ప్లోరిక్ కేవిటీలోకి (ఛాతి, పొట్ట మధ్య ఉండే భాగం) చేరుకుంటుంది. ఈ ద్రవాన్ని తేలికగా తొలగించవచ్చు. ఇలా పేరుకున్న నీటిని ఎప్పటికప్పుడు తొలగించకపోతే గుండె మీద ఒత్తిడి పెరిగి, హార్ట్ ఫెయిల్ అయ్యే ప్రమాదం ఉంటుంది.

---

# నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం

## ఇగ్నోలో ప్రొఫెసర్ పోస్టులు

**ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ (ఇగ్నో)లో ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది.**

- **మొత్తం ఖాళీలు:** 64
- **పోస్టుల వారీగా ఖాళీలు:** ప్రొఫెసర్–27, అసిస్టెంట్ ప్రొఫెసర్–37.
- **ఖాళీలు ఉన్న విభాగాలు:** స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, సోషల్ వర్క్, స్కూల్ ఆఫ్ హ్యూమానిటీస్, సోషల్ సైన్సెస్, స్కూల్ ఆఫ్ ఎడ్యుకేషన్ తదితరాలు.
- **అర్హత:** యూజీసీ నిబంధనల ప్రకారం అర్హతలు కలిగి ఉండాలి.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** అక్టోబర్ 31
- హార్డ్‌కాపీలను పంపడానికి **చివరితేదీ:** నవంబర్ 5
- **వెబ్‌సైట్:** http://www.ignou.ac.in

**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ)లో గ్రేడ్ బీ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ప్రకటన విడుదలైంది.**

## ఆర్‌బీఐలో గ్రేడ్ బీ ఆఫీసర్లు

- **మొత్తం ఖాళీల సంఖ్య:** 199
- **విభాగాల వారీగా ఖాళీలు:** జనరల్–156, డీఈపీఆర్–20, డీఎస్ఐఎం–23 ఉన్నాయి.
- **వయస్సు:** 2019, సెప్టెంబర్ 1 నాటికి 21–30 ఏండ్ల మధ్య ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేండ్లు, ఓబీసీలకు మూడేండ్లు, పీహెచ్‌సీలకు పదేండ్లు వయోపరిమితిలో సడలింపు ఉంటుంది.
- **అర్హతలు:** డీఆర్–జనరల్ విభాగానికి కనీసం 60 శాతం మార్కులతో డిగ్రీ (ఇంటర్, పదోతరగతిలో కూడా 60 శాతం మార్కులు ఉండాలి).
- డీఈపీఆర్ పోస్టుకు–కనీసం 55 శాతం మార్కులతో పీజీ (ఎకనామిక్స్/మ్యాథమెటికల్ ఎకనామిక్స్/ఇంటిగ్రేటెడ్ ఎకనామిక్/ఫైనాన్స్ లేదా తత్సమాన సబ్జెక్టు)లో ఉత్తీర్ణత. లేదా పీజీడీఎం/ఎంబీఏ ఫైనాన్స్‌లో 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత.
- డీఎస్ఐఎం పోస్టుకు– కనీసం 55 శాతం మార్కులతో పీజీ (స్టాటిస్టిక్స్/మ్యాథమెటికల్ స్టాటిస్టిక్స్ లేదా తత్సమాన సబ్జెక్టు) ఉత్తీర్ణత.
- **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ ఎగ్జామ్ (ఫేజ్–1, ఫేజ్–2), ఇంటర్వ్యూ ద్వారా
- **రాష్ట్రంలో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్–రంగారెడ్డి, కరీంనగర్, వరంగల్
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **ఫీజు:** జనరల్/ఓబీసీ/ఈడబ్ల్యూఎస్‌లకు రూ.850/-, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీలకు రూ.100/-
- **చివరితేదీ:** అక్టోబర్ 11
- **వెబ్‌సైట్:** www.rbi.org.in

**నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎన్‌టీపీసీ) ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ-2020 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

## ఎన్‌టీపీసీలో ఎగ్జిక్యూటివ్ ట్రెయినీలు

- **పోస్టు:** ఇంజినీరింగ్ ఎగ్జిక్యూటివ్ ట్రెయినీ (ఈటీ–2020)
- **అర్హతలు:** సంబంధిత బ్రాంచీలో బీఈ/బీటెక్ ఉత్తీర్ణత.
- ఎంపిక: గేట్–2020 స్కోర్ ఆధారంగా
- **గేట్ –2020 దరఖాస్తుకు చివరితేదీ:** 2019, అక్టోబర్ 1
- **ఎన్‌టీపీసీ పోర్టల్‌లో ఈటీ పోస్టులకు దరఖాస్తు:** 2020, జనవరి 10 నుంచి ప్రారంభం
- **చివరితేదీ:** 2020, జనవరి 31
- **వెబ్‌సైట్:** www.ntpccareers.net

## కవి అశోక్ చక్రవర్తికి 'గాంధియన్ పొయెట్' బిరుదు



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణ కవి డాక్టర్ టీ అశోక్‌చక్రవర్తికి 'గాంధియన్ పొయెట్' బిరుదు లభించింది. మహాత్మాగాంధీ 150వ జన్మదిన వేడుకల సందర్భంగా రష్యాకు చెందిన గ్లోబల్ హార్మొనీ సంఘం ఈ అవార్డును ప్రకటించింది. గాంధీజీ అహింసాసిద్ధాంతంపై అశోక్ చక్రవర్తి రచించిన ప్రత్యేక కవిత 'గాంధీకా' పుస్తకంలో ప్రచురితమైంది. ఈ పుస్తకాన్ని గ్లోబల్ హార్మనీ సంఘం, గాంధీ విద్యామందిర్, గ్లోబల్ ఫీస్ ఫౌండేషన్, నేషనల్ గాంధీ మ్యూజియం కలిసి ప్రచురించాయి. ఇది రష్యా, స్పానిష్, ఫ్రెంచ్ తదితర భాషల్లో ప్రపంచవ్యాప్తంగా అక్టోబరు 2న విడుదల అవుతుంది. దాదాపు 25 దేశాలకు చెందిన 82 మంది రచయితల రచనలను ఈ పుస్తకంలో పొందుపరిచారు. గాంధీ మనుమరాలు ఇలా గాంధీ, నోబెల్ శాంతి పురస్కార గ్రహీత డెన్మార్క్‌కు చెందిన జాన్ అవేరి వంటివారి రచనలు ఇందులో ఉన్నారు.



## బ్రహ్మోస్ పరీక్ష విజయవంతం

### ఒడిశాలోని చండీపూర్ నుంచి ప్రయోగించిన డీఆర్డీవో

**న్యూఢిల్లీ:** సూపర్ సోనిక్ క్షిపణి బ్రహ్మోస్‌ను సోమవారం విజయవంతంగా పరీక్షించారు. ఒడిశా బాలాసోర్ జిల్లాలోని చండీపూర్ కేంద్రం నుంచి దీనిని ప్రయోగించామని, ఈ క్షిపణి అన్ని ప్రమాణాలను అందుకొన్నదని 'రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ' (డీఆర్డీవో) తెలిపింది. భూ ఉపరితలం నుంచే కాకుండా సముద్రతలం నుంచి కూడా 290 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించగల సామర్థ్యం బ్రహ్మోస్‌కు సొంతం. 450 కి.మీ. దూరంలోని లక్ష్యాన్ని ఛేదించే సామర్థ్యంతో 2017లో తొలితరం అనుబంధ వర్షన్ బ్రహ్మోస్ క్షిపణిని విజయవంతంగా పరీక్షించారు. రష్యాకు చెందిన ఎన్‌పీవోఎంతో కలిసి డీఆర్డీవో బ్రహ్మోస్ క్షిపణులను రూపొందిస్తున్నది.



సోమవారం అసెంబ్లీ ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న ఉద్యోగులు



## అక్రమాల దవాఖానల పేర్లు బహిరంగం

- 'నేమ్ అండ్ షేమ్' కింద ఆయుష్మాన్ భారత్ వెబ్‌సైట్లో 111 దవాఖానల పేర్లు
- కేంద్ర మంత్రి హర్షవర్ధన్ వెల్లడి

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** అక్రమాలకు పాల్పడినట్లు తేలిన 111 దవాఖానల పేర్లను ఆయుష్మాన్ భారత్ అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచామని కేంద్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి హర్షవర్ధన్ సోమవారం తెలిపారు. దవాఖానలు అవినీతికి పాల్పడకుండా నియంత్రించేందుకు ప్రభుత్వం తీసుకొచ్చిన 'నేమ్ అండ్ షేమ్' (దవాఖానల పేర్లను బహిరంగపరచటం) కార్యక్రమంలో భాగంగా వీటి పేర్లను వెబ్‌సైట్‌లో పెట్టామని చెప్పారు. ఆయుష్మాన్ భారత్– ప్రధానమంత్రి జన్ ఆరోగ్య యోజన (ఏబీ–పీఎంజేఏవై) పథకం ప్రారంభించి ఏడాది పూర్తయిన సందర్భంగా సోమవారం ఢిల్లీలో ఏర్పాటుచేసిన 'ఆరోగ్య మంతన్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 'నేమ్ అండ్ షేమ్ కార్యక్రమంలో భాగంగా అక్రమాలకు పాల్పడిన 111 దవాఖానలను ఆయుష్మాన్ భారత్ వెబ్‌సైట్లో పొందుపరిచాం. అంతేగాకుండా వాటిని పథకం నుంచి తొలిగించాం. మరోవైపు, ఈ పథకం కింద ఉత్తమ పనితీరు కనబరచిన దవాఖానలను గౌరవించేందుకు నేమ్ అండ్ ఫేమ్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టనున్నాం' అని ఆయన పేర్కొన్నారు. ఏబీ–పీఎంజేఏవై పథకంలో అక్రమాలకు సంబంధించి సుమారు 1,200 కేసులు నమోదయ్యాయని, 338 దవాఖానలపై చర్యలు తీసుకున్నామన్నారు. ఎనిమిది దవాఖానలపై ఎఫ్ఐఆర్ నమోదుచేశామని, రూ.1.5 కోట్ల జరిమానా విధించామని చెప్పారు. దేశవ్యాప్తంగా 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలు ఈ పథకాన్ని అమలుచేస్తున్నాయని తెలిపారు. మిగిలిన నాలుగు రాష్ట్రాలు అమలుచేయకపోవడం పట్ల ఆయన విచారం వ్యక్తం చేశారు. దీని వల్ల ప్రజలు ఆయుష్మాన్‌భారత్ ఫలాలు పొందలేకపోతున్నారని పేర్కొన్నారు. 2018 సెప్టెంబర్ 23న కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రారంభించింది. పథకంలో భాగంగా ఇప్పటివరకు సుమారు రూ.7,500 కోట్ల విలువైన చికిత్స అందించారు. పథకం కింద 18,703 దవాఖానలు వైద్య సేవలు అందిస్తుండగా, 53 శాతం ప్రైవేట్ దవాఖానలే.

# కొనసాగుతున్న వరద బీభత్సం

## వివిధ దుర్ఘటనల్లో 134 దాటిన మృతుల సంఖ్య

### వరదల్లో చిక్కుకున్న బీహార్ డిప్యూటీ సీఎంను రక్షించిన సిబ్బంది



భారీ వర్షంతో నీట మునిగిన బీహార్ రాజధాని పాట్నా

- రానున్న రోజుల్లో పాట్నాలో మరిన్ని భారీ వర్షాలు: ఐఎండీ
- వర్షపు నీటిలో బల్లియా జిల్లా కారాగారం.. 900 మంది ఖైదీల తరలింపు
- అధికారుల సెలవులను రద్దు చేసిన యూపీ సర్కారు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** దేశంలోని వివిధ రాష్ట్రాలను వర్షాలు ముంచెత్తుతున్నాయి. వీటి కారణంగా బీహార్, ఉత్తర్‌ప్రదేశ్, జార్ఖండ్, ఉత్తరఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, గుజరాత్‌లో జనజీవనం అస్తవ్యస్తమవుతున్నది. వానలు, వరదలు కారణంగా జరిగిన వివిధ దుర్ఘటనల్లో 134 మందికి పైగా మృత్యువాత పడ్డారు. గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బీహార్‌లోని పలు ప్రాంతాలు ఇంకా జలదిగ్బంధంలోనే ఉన్నాయి. వరద నీరు చుట్టుముట్టడంతో గత మూడు రోజులుగా ఇంటికే పరిమితమైన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి సుశీల్ మోదీ, ఆయన కుటుంబ సభ్యులను జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్డీఆర్ఎఫ్), రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) సిబ్బంది సోమవారం రక్షించారు. మరోవైపు, యూపీలో వరదలు పోటెత్తడంతో బల్లియా జిల్లా కేంద్ర కారాగారం నీటితో నిండిపోయింది. బ్యారక్‌లలోకి వర్షపు నీరు చేరడంతో ఖైదీలను అధికారులు ఇతర జైళ్లలోకి తరలించారు. వానలు, వరదల కారణంగా జరిగిన వివిధ ప్రమాదాల్లో బీహార్‌లో మరణించిన వారి సంఖ్య 29కి చేరింది. గయ జిల్లాలో గోడకూలిన దుర్ఘటనలో ఐదుగురు, నదిలో మునిగి మరొకరు చనిపోయారు. జెహానాబాద్ జిల్లాలో ఓపాత ఇంటి గోడ కూలిన ఘటనలో మూడేండ్ల చిన్నారి చనిపోయింది. నీట మునిగిన ప్రాంతాల్లోని ప్రజలకు హెలికాప్టర్ల ద్వారా ఆహారం, వైద్య సామాగ్రి అందజేయాలని రాష్ట్ర ప్రభుత్వం వాయుసేనకు విజ్ఞప్తి చేసింది. దీని కోసం రెండు హెలికాప్టర్లను పంపించాలని సూచించింది. రాజధాని పాట్నాలో సోమవారం ఉదయం కూడా వర్షాలు కురిశాయి. నగరంలోని పలు ప్రాంతాల్ని నాలుగు నుంచి ఆరు అడుగుల లోతు వరకు వరద నీరు ముంచెత్తింది. ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానలు, మెడికల్ స్టోర్లలోకి నీరు చేరడంతో రోగులు ఇబ్బందులు పడ్డారు. వరదల ప్రభావంతో పలు రైళ్లు, విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. 1975 తర్వాత రాజధానిలో ఈ స్థాయి వర్షాలు ఎన్నడూ చూడలేదని అధికారులు తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో 19 ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలు చేపట్టాయి. వరదల్లో చిక్కుకున్న 235 మందిని సురక్షిత ప్రాంతాలకు చేర్చాయి. ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ వరద పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. రానున్న రోజుల్లో పాట్నాలో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) హెచ్చరించింది. మరోవైపు, భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన వివిధ ప్రమాదాల్లో యూపీలో చనిపోయిన వారి సంఖ్య 93కు చేరింది. బల్లియా జిల్లా కేంద్ర కారాగారంలోకి వరద నీరు చొచ్చుకు వచ్చింది. దీంతో 900 మంది ఖైదీలను అధికారులు ఇతర జైళ్లకు తరలించారు. వీళ్లలో 500 మందిని అజాంఘర్ జైలుకు, మిగిలిన వాళ్లను అంబేద్కర్ నగర్ జైలుకు తరలించారు. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం అధికారుల సెలవును రద్దుచేసింది. ఎడతెగని వర్షాల వల్ల జరిగిన వివిధ దుర్ఘటనల్లో ఉత్తరాఖండ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్‌లో శనివారంనాడు దాదాపు 13 మంది చనిపోయారు. జార్ఖండ్‌లో కురుస్తున్న వర్షాలకు జనజీవనం స్తంభించింది. దుమ్కా జిల్లాలో గోడ కూలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు చనిపోయారు. గుజరాత్‌లో గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాజ్‌కోట్ జిల్లాలో సంభవించిన వరదల్లో ఓ కారు కొట్టుకుపోయింది. ఈ ఘటనలో ముగ్గురు మహిళలు మృతిచెందారు.

**ఉప ముఖ్యమంత్రిని కాపాడారు**

గత కొన్ని రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు బీహార్ రాజధాని పాట్నాలోని రాజేంద్ర నగర్‌ను వరద నీరు ముంచెత్తింది. అక్కడే నివాసం ఉంటున్న ఉపముఖ్యమంత్రి సుశీల్ మోదీ ఇల్లు కూడా వరద నీటిలో చిక్కుకున్నది. ఇంటి పరిసరాలను వరద నీరు చుట్టుముట్టడంతో గత మూడు రోజులుగా సుశీల్ మోదీ, ఆయన కుటుంబ సభ్యులు ఇంటి నుంచి బయటకు వెళ్లలేకపోయారు. సోమవారం ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది సుశీల్ మోదీతో పాటు కుటుంబ సభ్యులను రక్షించారు. వరదనీటి నుంచి బయటపడిన సుశీల్ మోదీ మీడియా ప్రతినిధులతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లిపోయారు.




పాట్నా నుంచి సురక్షిత ప్రాంతానికి తరలివెళ్తున్న స్థానికులు

## ప్రేమ్‌కుమార్ కుటుంబాన్ని ఆదుకుంటాం

### తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు కేవీ రమణాచారి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** నాలాలో కొట్టుకుపోయి చనిపోయిన బెంగళూరు ప్రేమ్‌కుమార్‌శాస్త్రి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకొంటుందని తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు కేవీ రమణాచారి తెలిపారు. వ్యక్తిగత సాయంగా రూ.50వేల చెక్కును మృతుడి బంధువు సాయికిరణ్‌శర్మకు రమణాచారి సోమవారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రేమ్‌కుమార్‌శాస్త్రి మృతి పట్ల పురపాలకశాఖ మంత్రి కేటీ రామారావు విచారం వ్యక్తంచేశారని, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆదుకొంటామని హామీ ఇచ్చారన్నారు. మృతుడి కుటుంబానికి రూ.రెండు లక్షలు పరిహారం మంజూరుచేస్తామని జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ హామీ ఇచ్చినట్టు రమణాచారి తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ సభ్యుడు వెంకటరమణశర్మ, పరశురామ బ్రాహ్మణ సేవా మిత్ర అధ్యక్షుడు నరేశ్ కులకర్ణి తదితరులు పాల్గొన్నారు. ఇటీవలి వర్షాలకు నాగోలులోని నాలా వరదలో కొట్టుకుపోయి ప్రేమ్‌కుమర్‌శర్మ మృతిచెందిన విషయం తెలిసిందే.



రూ.50 వేల చెక్కును మృతుడి బంధువుకు అందజేస్తున్న కేవీ రమణాచారి

## చైనాలో పటాకుల కంపెనీలో పేలుడు

### 19 మంది దుర్మరణం, ఆరు నెలల్లో ఐదో ఘటన

**బీజింగ్:** తూర్పు చైనాలోని ఓ పటాకుల తయారీ కంపెనీలో పేలుడు సంభవించిన ఘటనలో దాదాపు 19 మంది దుర్మరణం పాలయ్యారు. నింగ్‌హై కౌంటీలోని రుయికి డైలీ నెసెసిటీస్ యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తున్న కంపెనీలో ఆదివారం ఈ ప్రమాదం జరిగిందని, ప్రమాదానికి గల కారణాల అన్వేషణ కొనసాగుతున్నదని చైనా అధికారిక వార్తాసంస్థ జిన్హువా సోమవారం వెల్లడించింది. గత ఆరు నెలల్లో ఇలాంటిది ఐదో ప్రమాదంగా అధికారులు చెప్తున్నారు.ఫ్యాక్టరీలు భద్రతా ప్రమాణాలు పాటించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. షాంగ్‌డాంగ్ రాష్ట్రంలోని ఓ మందుల కంపెనీలో గత ఏప్రిల్ నెలలో జరిగిన అగ్నిప్రమాదంలో పది మంది చనిపోయారు. గత మార్చి నెలలో జియాంగ్సు రాష్ట్రంలోని ఓ స్క్రాప్ మెటల్ మోల్డింగ్ కంపెనీలో పేలుడు సంభవించి దాదాపు ఏడుగురు చనిపోగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. మార్చి 30న జరిగిన ప్రమాదంలో ఐదుగురు, మార్చి 22 నాటి పేలుడులో 78 మంది దుర్మరణం పాలయ్యారు.

## వాయుసేన ఆధునీకరణే లక్ష్యం

### ఐఏఎఫ్ అధిపతిగా బాధ్యతలు స్వీకరించిన భదౌరియా



ఐఏఎఫ్ 26వ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న ఎయిర్ చీఫ్ మార్షల్ ఆర్కేఎస్ భదౌరియా

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** వాయుసేనను ఆధునీకరించడం, కీలక సాంకేతిక పరిజ్ఞానాన్ని, సంక్లిష్ట సామర్థ్యాలను మెరుగుపర్చడం తన ప్రాధాన్యాలని భారత వాయుసేన (ఐఏఎఫ్) నూతన అధిపతి రాకేశ్ కుమార్ సింగ్ భదౌరియా పేర్కొన్నారు. ఇప్పటివరకు ఐఏఎఫ్ చీఫ్‌గా ఉన్న బీఎస్ ధనోవా పదవీకాలం ముగియడంతో.. వాయుసేన 26వ అధిపతిగా భదౌరియా సోమవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం సహచర అధికారులతో మాట్లాడుతూ.. యుద్ధ విమాన ప్రమాదాల నివారణ, భద్రతతోపాటు యుద్ధ పోరాట వ్యవస్థలపై దృష్టిసారిస్తానన్నారు. భారత వైమానిక దళ సామర్థ్యాన్ని రాఫెల్ జెట్ ఇనుమడింపజేసి, చైనా, పాకిస్థాన్‌పై పైచేయి సాధించడానికి దోహదం చేస్తుందని చెప్పారు. ప్రపంచంలోనే అత్యుత్తమ వైమానిక దళానికి చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించడం తనకు లభించిన గొప్ప గౌరవమని పేర్కొన్నారు. పదవీబాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన జాతీయ యుద్ధ స్మారకకేంద్రాన్ని సందర్శించి, అమరులకు నివాళి అర్పించారు. 1980 జూన్‌లో ఐఏఎఫ్‌లో చేరిన భదౌరియా.. శిక్షణకాలంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి స్వార్డ్ ఆఫ్ ఆనర్ పొందారు. నలభై ఏండ్ల కెరీర్‌లో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. జాగ్వార్ స్క్వాడ్రన్‌కు, కీలకమైన వైమానిక స్థావరానికి నాయకత్వం వహించారు. జీపీఎస్‌తో అనుసంధానమైన జాగ్వార్ ఎయిర్‌క్రాఫ్ట్ ద్వారా బాంబుదాడిచేసే ప్రక్రియలో కీలకపాత్ర పోషించారు. కెరీర్‌లో 26 రకాల విమానాలను 4,250 గంటలపాటు నడిపారు. రాఫెల్ జెట్‌ను నడిపిన అతి కొద్దిమందిలో ఆయన ఒకరు. గత జూలైలో భారత్, ఫ్రాన్స్ నిర్వహించిన వైమానిక దళ సంయుక్త విన్యాసాల్లో భదౌరియా రాఫెల్ యుద్ధవిమానాన్ని నడిపారు. భదీరియా గతంలో మాస్కోలోని భారత రాయబార కార్యాలయంలో వాయుసేన సహాయకుడిగా, ఎయిర్‌స్టాఫ్ అసిస్టెంట్ చీఫ్‌గా (ప్రాజెక్ట్స్), నేషనల్ డిఫెన్స్ అకాడమీ కమాండెంట్‌గా, ఎయిర్‌స్టాఫ్ ప్రధాన కార్యాలయంలో డిప్యూటీ చీఫ్‌గా, దక్షిణ ఎయిర్ కమాండ్ ఎయిర్ ఆఫీసర్ కమాండింగ్ ఇన్ చీఫ్‌గా పనిచేశారు.

## గిన్నిస్ రికార్డు కోసం సుదీర్ఘ 'మేళకర్త' రాగాలాపన!

### లండన్ వేదికగా ప్రారంభించిన స్వరవీణాపాణి నాగవెంకటరమణ




**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మిథునం, దేవస్థానం, పట్టుకోండి చూద్దాం వంటి తెలుగు సినిమాలకు సంగీత దర్శకుడిగా మంచిపేరు సంపాదించుకున్న స్వరవీణాపాణి వోగేటి నాగవెంకటరమణమూర్తి లాంగెస్ట్ మారథాన్ చర్చ్ ఆర్గాన్ ప్లేయింగ్ అనే అంశంతో మేళకర్త 72 రాగాలను 64 గంటలకుపైగా తన సంగీత సాధనంపై వాయిస్తూ గిన్నిస్ రికార్డు ప్రయత్నం ప్రారంభించారు. లండన్‌లోని హ్యామర్‌స్మిత్‌లో యూకే కాలమానం ప్రకారం సోమవారం ఉదయం 5 గంటలకు (భారత కాలమానం ప్రకారం ఉదయం 9.30 గంటలు) యునైటెడ్ కింగ్డమ్ తెలుగు అసోసియేషన్, అమెరికాకు చెందిన వెన్నం ఫౌండేషన్, భారతదేశానికి చెందిన స్వరనిధి సంస్థ సంయుక్త నిర్వహణలో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ రికార్డు తెలుగువారి సంగీత వైభవాన్ని చాటే చారిత్రక అంశం అవుతుందని సంగీతకారుల ఆకాంక్ష. లండన్ కాలమానం ప్రకారం గాంధీ జయంతి రోజున రాత్రి 10 గంటలకు ఈ ప్రయత్నం ముగుస్తుంది. కార్యక్రమంలో గిన్నిస్ నియమనిబంధనలను గిన్నిస్ రికార్డు గ్రహీత, తెలుగువాడైన డాక్టర్ వంగీపురం శ్రీనాథాచారి చదివి వినిపించారు.

## ఆర్టికల్ 370 రద్దుపై నేటి నుంచి విచారణ

### పిటిషన్లను రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసిన సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తిని కల్పించే ఆర్టికల్ 370ని కేంద్ర ప్రభుత్వం రద్దు చేయడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన వివిధ పిటిషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం నేటి నుంచి విచారణ చేపట్టనుంది. ఈ మేరకు ఆర్టికల్ 370 రద్దుకు సంబంధించిన పిటిషన్లతోపాటు జమ్ముకశ్మీర్‌లో జర్నలిస్టులపై ఆంక్షలు, లోయలో మైనర్ల నిర్బంధానికి సంబంధించిన పిటిషన్లను సుప్రీంకోర్టు సోమవారం రాజ్యాంగ ధర్మాసనానికి బదిలీ చేసింది. ఈ పిటిషన్ల విచారణకు జస్టిస్ ఎన్వీ రమణ నేతృత్వంలో ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైన విషయం తెలిసిందే. ఈ బెంచ్‌లో జస్టిస్‌లు ఎస్కే కౌల్, ఆర్ సుభాష్‌రెడ్డి, బీఆర్ గవాయ్, సూర్యకాంత్ ఇతర సభ్యులు. ఆర్టికల్ 370ని రద్దుచేయడంతోపాటు జమ్ముకశ్మీర్‌ను రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విభజిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అక్టోబర్ 31 నుంచి జమ్ముకశ్మీర్, లడఖ్ కేంద్రపాలిత ప్రాంతాలు ఉనికిలోకి రానున్నాయి. అయితే కేంద్రం నిర్ణయాన్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టులో పలు పిటిషన్లు దాఖలయ్యాయి.

## ప్రాణాలకు ముప్పు

### కేసును లాహోర్ కోర్టుకు బదిలీ చేయండి: హఫీజ్ సయీద్

**లాహోర్, సెప్టెంబర్ 30:** తన ప్రాణాకు ముప్పు ఉన్నదని ముంబై పేలుళ్ల ప్రధాన సూత్రధారి, పాకిస్థాన్‌కు చెందిన జమాత్ ఉద్ దూ (జేయూడీ) ఉగ్రవాద సంస్థ అధినేత హఫీజ్ సయీద్ ఆ దేశ కోర్టును ఆశ్రయించాడు. తనపై నమోదైన ఉగ్రవాదానికి ఆర్థిక సహకారం కేసును లాహోర్ కోర్టుకు బదిలీ చేయాలని కోరాడు. అతడి పిటిషన్‌పై పాక్ ప్రభుత్వం తరుపు న్యాయవాది అభ్యంతరం వ్యక్తం చేయలేదు. దీంతో లాహోర్ హైకోర్టు అతడి విజ్ఞప్తికి అనుమతించింది. హఫీజ్‌ను ఐక్యరాజ్యసమితి అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఉగ్రవాదానికి ఆర్థిక సహకారం ఆరోపణలపై జూలై 17న గుజ్రన్‌వాలాలో అతడ్ని అరెస్ట్ చేశారు. కేసు విచారణకు హఫీజ్‌ను లాహోర్ నుంచి గుజ్రన్‌వాలా కోర్టుకు లేదా పాకిస్థాన్‌లోని గుజరాత్‌లో ఉన్న ఉగ్రవాద నిరోధక కోర్టులో హాజరుపరుస్తున్నారు. తరలింపు నేపథ్యంలో ముప్పు ఉందని, ప్రభుత్వం కూడా భారీగా భద్రతా ఏర్పాటు చేసుకోవాల్సి వస్తున్నదని లాహోర్ హైకోర్టును సయీద్ ఆశ్రయించాడు. ఈ కేసును లాహోర్‌లోని సంబంధిత కోర్టుకు బదిలీ చేయాలని పిటిషన్ దాఖలుచేశాడు. పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన కోర్టు దీనికి అనుమతించింది.

## బానోకు పరిహారం చెల్లించాల్సిందే

- రెండు వారాల్లోగా ఆమెకు రూ.50 లక్షలు అందజేయండి
- ఉద్యోగం, వసతి కూడా ఏర్పాటు చేయండి
- గుజరాత్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు ఆదేశాలు



**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** గోధ్రా అల్లర్ల బాధితురాలు బిల్కిస్ బానోకు రూ.50 లక్షల పరిహారంతోపాటు, ఉద్యోగం, వసతిని రెండు వారాల్లోగా ఏర్పాటుచేయాలని సుప్రీంకోర్టు సోమవారం గుజరాత్ ప్రభుత్వాన్ని ఆదేశించింది. గత ఏప్రిల్‌లో వెలువరించిన ఆదేశాలను పునః సమీక్షించాలని గుజరాత్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తిని తోసిపుచ్చింది. బిల్కిస్ బానో దాఖలు చేసిన కోర్టు ధిక్కార పిటిషన్‌పై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్‌గొగోయ్ నేతృత్వంలోని ధర్మాసనం సోమవారం విచారణ జరిపింది. బాధితురాలికి రూ.50 లక్షల పరిహారం, ఉద్యోగం, వసతి కల్పించాలని గత ఏప్రిల్‌లో తాము ఆదేశించినప్పటికీ ఎందుకు అమలుచేయలేదని గుజరాత్ ప్రభుత్వాన్ని ధర్మాసనం ప్రశ్నించింది. గుజరాత్ ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా స్పందిస్తూ.. బాధితులకు పరిహారం అందించే గుజరాత్ ప్రభుత్వ విధానం ప్రకారం..50 లక్షలు చెల్లించడం వీలుకాదని, అలాగే ఏప్రిల్ నాటి ఉత్తర్వులను సమీక్షించాలని తాము పిటిషన్ దాఖలు చేశామని తెలిపారు. దీనిపై కోర్టు స్పందిస్తూ..' కేసులోని ప్రత్యేక అంశాలను దృష్టిలో ఉంచుకుని బాధితురాలికి అంతమొత్తంలో పరిహారం చెల్లించాలని ఆదేశించామని మేం ఉత్తర్వుల్లో ప్రత్యేకంగా పేర్కొనాలా?' అని ప్రశ్నించింది. రెండు వారాల్లోగా బాధితురాలికి పరిహారం, ఉద్యోగం, వసతి ఏర్పాటుచేయాలని ఆదేశించింది. గోధ్రా అల్లర్ల సందర్భంగా 2002 మార్చి 3న అల్లరి మూకలు అహ్మదాబాద్ సమీపంలోని రాంధిక్‌పూర్ గ్రామంలో బిల్కిస్ బానో, ఆమె కుటుంబంపై దాడి చేశాయి. ఐదు నెలల గర్భిణి అయిన బానోపై దుండగులు సామూహిక అత్యాచారానికి పాల్పడడమే కాకుండా ఆమె కుటుంబానికి చెందిన ఐదుగురిని దారుణంగా హత్యచేశారు.

**గుజరాత్ సర్కార్ సాయం చేయలేదు: బానో భర్త**

సుప్రీం ఆదేశించినప్పటికీ గుజరాత్ ప్రభుత్వం ఏనాడూ సాయం అందించలేదని బిల్కిస్ బానో భర్త యాకూబ్ రసూల్ మండిపడ్డారు. సోమవారం ఆయన పీటీఐ వార్తాసంస్థతో మాట్లాడారు. 'బానోకు 15 రోజుల్లో పరిహారం చెల్లించాలని సుప్రీంకోర్టు గత ఏప్రిల్‌లో ఆదేశించింది. ఇప్పటికి ఐదు నెలలు గడిచాయి. కానీ ప్రభుత్వం ఒక్కసారి కూడా మమ్మల్ని సంప్రదించలేదు. కోర్టు ఆదేశాలను గుర్తుచేస్తూ ప్రభుత్వానికి మేం రెండుసార్లు నోటీసులు పంపాం. దానికీ స్పందించలేదు. దీంతో మేం మళ్లీ కోర్టు తలుపుతట్టాం. కోర్టు ఇప్పుడు రెండు వారాలు గడువు ఇచ్చింది. ప్రభుత్వం ఇప్పుడు ఏం చేస్తుందో చూడాలి. గత 17 ఏండ్లుగా బానో ఎన్నో బాధ లు అనుభవించింది. పోరాటాన్ని మాత్రం ఆపలేదు' అని ఆయన పేర్కొన్నారు.

## చిదంబరానికి బెయిల్ నిరాకరణ

**న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30:** ఐఎన్ఎక్స్ మీడియా కేసులో కేంద్ర మాజీ ఆర్థిక మంత్రి పీ చిదంబరానికి బెయిల్ ఇవ్వడానికి ఢిల్లీ హైకోర్టు నిరాకరించింది. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న చిదంబరానికి బెయిల్ మంజూరుచేస్తే, సాక్షులను ప్రభావితంచేసే అంశాన్ని కొట్టిపారేయలేమని పేర్కొంది. ఆయన శక్తిమంతమైన కేంద్ర హోం, ఆర్థికశాఖల మంత్రిగా పనిచేశారని, ప్రస్తుతం పార్లమెంట్ సభ్యులని, సుదీర్ఘకాలంగా న్యాయవాదిగా ఉన్నారని జస్టిస్ సురేశ్ కైట్ వ్యాఖ్యానించారు. ఈ కేసులో ఆగస్టు 21న చిదంబరాన్ని సీబీఐ అరెస్ట్ చేసింది. ప్రస్తుతం కేసు దర్యాప్తు పురోగతి దశలో ఉన్నదని, ఆయన సాక్షులను ప్రభావితం చేసే అవకాశాన్ని కొట్టి పారేయలేమన్న సీబీఐ వాదనతో న్యాయస్థానం ఏకీభవించింది. చిదంబరానికి వ్యతిరేకంగా లుక్‌ఔట్ నోటీసులు జారీచేసినందున దేశం వీడిపోతారనేందుకు ఆధారాలు లేవని సీబీఐకి హైకోర్టు స్పష్టంచేసింది. కేసు పత్రాలు దర్యాప్తు సంస్థ వద్ద ఉన్నందున, ఎంపీగా ఉన్న చిదంబరం ఆధారాలను ధ్వంసం చేయడానికి అవకాశం లేదన్న ఆయన తరపు న్యాయవాది వాదనతో కోర్టు ఏకీభవించింది. సీబీఐ తరపున వాదించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా, సీనియర్ న్యాయవాది అమిత్ మహాజన్ వాదిస్తూ కేసు విచారణ పూర్తయ్యే వరకు చిదంబరానికి బెయిల్ మంజూరు చేయవద్దని శుక్రవారం కోరారు.

## ఆర్ఎస్ఎస్ ఎజెండా చెల్లదు

### ఆ సంస్థను పటేల్ వ్యతిరేకించారు: అసదుద్దీన్ ఒవైసీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆర్ఎస్ఎస్ ఎజెండాను దేశంపై రుద్దడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని మజ్లిస్ పార్టీ అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ ఆరోపించారు. ఆర్ఎస్ఎస్‌ను సర్దార్ వల్లభ్‌బాయ్ పటేల్ ఆనాడే వ్యతిరేకించారని, ఆర్ఎస్ఎస్‌పై నిషేధం కూడా విధించారని చెప్పారు. సోమవారం హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. భిన్నత్వంలో ఏకత్వం ఉన్న మన దేశంలో.. ఒకే మతం అన్న సూత్రంతో పనిచేసే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలకు తావులేదన్నారు. భారతదేశం ఏ ఒక్క మతం కోసం లేదని, అన్ని మతాలు రాజ్యాంగం ముందు సమానమేనని తెలిపారు. ఆర్ఎస్ఎస్ ఎజెండాను అమలుచేయడానికి బీజేపీ యత్నించడం తగదన్నారు. వరదలను నిరోధించడానికి ముందు జాగ్రత్తలు తీసుకోవడంలో బీజేపీ పాలిత రాష్ట్రాలు పూర్తిగా విఫలమయ్యాయని ఆరోపించారు. బీహార్ రాజధాని నీట మునిగినా, ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నా కేంద్రంలోని బీజేపీ పాలకులు నిర్దుష్టమైన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. కశ్మీర్‌లో ఇప్పటివరకు సాధారణ పరిస్థితులు నెలకొనకపోవడం చూస్తుంటే.. కేంద్ర ప్రభుత్వం అంతా సవ్యంగా ఉన్నదని చేస్తున్న ప్రచారం బూటకమని స్పష్టమవుతుందని ఒవైసీ తెలిపారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 1 అక్టోబర్ 2019


మేఘాచౌదరి, శ్రీనివాస్, కృష్ణ, నవీన్, నరేష్, బాలాజీ

# ఆ కల నెరవేరలేదు

'నవీన్ అంటే విజయనిర్మలకు చాలా అభిమానం. అతడిని ప్రేమగా చూసేది. నవీన్ చిన్నతనం నుంచి సినిమా వాతావరణంలో పెరిగాడు. అతడి నటనలో హుషారు కనిపిస్తున్నది. తొలి సినిమా కంటే నవీన్‌కు ఈ చిత్రం గొప్ప పేరు తీసుకురావాలి. పెద్ద విజయం సాధించి శతదినోత్సవం జరుపుకోవాలి. అచ్చ తెలుగు టైటిల్ బాగుంది ' అని అన్నారు సీనియర్ హీరో, సూపర్‌స్టార్ కృష్ణ. నవీన్‌విజయ్‌కృష్ణ, అవసరాల శ్రీనివాస్, సోఫియాసింగ్, మేఘాచౌదరి ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఊరంతా అనుకుంటున్నారు'. బాలాజీ సానల దర్శకుడు. శ్రీహరి మంగళంపల్లి, రమ్య గోగుల, పి.ఎల్.ఎన్. రెడ్డి నిర్మిస్తున్నారు. ఈ నెల 5న విడుదలకానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. ఈ వేడుకకు ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణ ట్రైలర్‌ను విడుదలచేశారు. నిర్మాత మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో హృద్యంగా ఈ సినిమా సాగుతుంది. కృష్ణ నటించిన 'ఊరికి మొనగాడు', 'పండంటి కాపురం' చిత్రాల్ని గుర్తుకుతెస్తుంది' అని చెప్పారు. నవీన్ విజయ్ కృష్ణ మాట్లాడుతూ 'నానమ్మ విజయనిర్మలకు ఈ చిత్రాన్ని అంకితం చేయడం ఆనందంగా ఉంది. ఈ సినిమా గురించి నానమ్మ చాలా సార్లు నన్ను అడిగింది. తనకు సినిమా చూపిస్తానని మాటిచ్చాను. కానీ ఆ కల నెరవేరలేదు. నేనో మంచి నటుడిగా పేరు తెచ్చుకోవాలని, అందరూ నా గురించి గొప్పగా చెప్పుకోవాలని చెబుతుండేది. నటుడిగా నిరూపించుకో.. ఆ గుర్తింపు నిన్ను ముందుకు తీసుకెళ్తుందని, స్టార్‌డమ్ వెనకాల వెళ్లొద్దు అని నానమ్మ సూచించింది. ఆమె ఇచ్చిన ధైర్యం, పట్టుదలతో ఎన్ని కష్టాలు వచ్చినా వెనకడుగు వేయకుండా నటుడిగా నా ప్రయాణాన్ని కొనసాగిస్తాను' అని చెప్పారు. కథను నమ్మి నవీన్ ఈ సినిమా చేశాడని, తండ్రిగా అతడి నటన చూసి సంతృప్తిగా ఫీలయ్యానని సీనియర్ నరేష్ పేర్కొన్నారు. నవీన్ ఈ కథకు పూర్తిగా న్యాయం చేశాడని, ఇంటిల్లిపాదిని అలరించే చిత్రమిదని దర్శకుడు చెప్పారు. ఈ కార్యక్రమంలో దిల్‌రాజు, సుధీర్‌బాబు, రాధాకృష్ణ, అల్లరి నరేష్ తదితరులు పాల్గొన్నారు.


ఆకాష్‌పూరి, కేతికాశర్మ

# రొమాంటిక్ కౌగిలిలో..

ఆకాశ్‌పూరి, కేతికాశర్మ జంటగా నటిస్తున్న చిత్రం 'రొమాంటిక్'. అనిల్ పాదూరి దర్శకుడు. పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మాతలు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను సోమవారం విడుదల చేశారు. నాయకానాయికలు కౌగిలిలో ఒదిగిపోయి తన్మయం చెందుతున్న ఈ ఫస్ట్‌లుక్ యువతరాన్ని బాగా ఆకట్టుకుంటున్నది. 'ఇదివరకే హైదరాబాద్, గోవాలో షెడ్యూల్స్‌ను పూర్తిచేశాం. సోమవారం నుంచి హైదరాబాద్‌లో సరికొత్త షెడ్యూల్ మొదలుపెడతాం. ప్రేమికుల ప్రయాణానికి అందమైన దృశ్యరూపంగా సాగే కథాంశమిది. కథ, కథనాలు వైవిధ్యంగా ఉంటాయి' అని చిత్రబృందం తెలిపింది. మందిరాబేడి, మకరంద్‌దేశ్ పాండే తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నరేశ్, సంగీతం: సునీల్‌కశ్యప్, నిర్మాణ సంస్థ: పూరిజగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరికనెక్ట్స్, కథ, స్క్రీన్‌ప్లే, సంభాషణలు: పూరిజగన్నాథ్, దర్శకత్వం: అనిల్ పాదూరి.


రామజోగయ్యశాస్త్రి, అబ్బూరి రవి, తిరు, గోపిచంద్, రాజేష్ తదితరులు

# 'చాణక్య'తో ఆ ప్రేమను తిరిగిస్తాను

'షూటింగ్‌లో యాక్షన్ సీక్వెన్స్ చిత్రీకరించే సమయంలో ప్రమాదం జరిగి గాయపడ్డాను. అభిమానుల ప్రోత్సాహం, ప్రేమ వల్లే ఆ ఘటన నుంచి కోలుకొని వేదికపై నిలబడి మాట్లాడగలుగుతున్నాను. వారు నాపై చూపించిన ప్రేమను 'చాణక్య' సినిమాతో తిరిగి ఇస్తాను' అని అన్నారు గోపీచంద్. ఆయన కథానాయకుడిగా నటించిన చిత్రం 'చాణక్య'. తిరు దర్శకుడు. ఎ.కె. ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై రామబ్రహ్మం సుంకర నిర్మించారు. మెహరీన్, జరీన్‌ఖాన్ కథానాయికలు. ఈ నెల 5న విడుదలకానుంది. ఆదివారం వైజాగ్‌లో ఈ చిత్ర ప్రీ రిలీజ్ వేడుక జరిగింది. ఈ సందర్భంగా గోపీచంద్ మాట్లాడుతూ 'నా నుంచి అభిమానులు కోరుకునే అన్ని హంగులున్న చిత్రమిది. అద్భుతమైన యాక్షన్, పవర్‌ఫుల్ డైలాగ్‌లతో దర్శకుడు తిరు హీరోయిజాన్ని పతాకస్థాయిలో ఆవిష్కరించారు. మంచి సినిమా తీయాలనే తపనతో అనిల్ సుంకర ఎక్కడ రాజీపడకుండా ఈ చిత్రాన్ని నిర్మించారు' అని పేర్కొన్నారు. అనిల్ సుంకర మాట్లాడుతూ 'గోపీచంద్‌ను కొత్త కోణంలో ఆవిష్కరించే చిత్రమిది. దర్శకుడు తిరు ఆసక్తికరమైన మలుపులతో ఉత్కంఠభరితంగా సినిమాను తెరకెక్కించారు' అని చెప్పారు. స్పై థ్రిల్లర్ కథాంశంతో సాగే చిత్రమిదని, దేశభక్తి భావనను పెంపొందిస్తుందని సంభాషణల రచయిత అబ్బూరి రవి పేర్కొన్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'గోపీచంద్ ఉత్తమ చిత్రాల్లో ఇది ఒకటిగా నిలుస్తుంది. వెట్రి ఛాయాగ్రహణం, అబ్బూరి రవి సంభాషణలు, విశాల్‌చంద్రశేఖర్, శ్రీచరణ్ బాణీలు, నేపథ్య సంగీతం ప్రధాన ఆకర్షణగా నిలుస్తాయి. కొత్తదనాన్ని కోరుకునే ప్రతి ఒక్కరిని అలరిస్తుంది' అని అన్నారు. ఈ కార్యక్రమంలో రామజోగయ్యశాస్త్రి, ఎంవీవీ సత్యనారాయణ, విశాల్‌చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పైడిజైరాజ్ 110వ జయంతి


చిన్నికృష్ణ, జైహింద్‌గౌడ్ తదితరులు

తెలంగాణలోని కరీంనగర్‌లో 1909లో జన్మించిన పైడి జైరాజ్ బాలీవుడ్‌లో అనేక చిత్రాల్లో నటించి ప్రేక్షకుల్ని మెప్పించారు. సినీరంగంలో అత్యున్నత పురస్కారం దాదాసాహెబ్‌ఫాల్కేను సైతం అందుకున్నారు. ఆయన 110వ జయంతి వేడుకలు ఇటీవల హైదరాబాద్‌లో జరిగాయి. ఈ సందర్భంగా రచయిత చిన్నికృష్ణ మాట్లాడుతూ 'బాలీవుడ్‌లో రెండువందలకు పైగా సినిమాల్లో నటించి అనేక అవార్డులను అందుకున్న మహోన్నత వ్యక్తి చరిత్ర మరుగునపడటం బాధను కలిగించింది' అని అన్నారు. జైహింద్‌గౌడ్ మాట్లాడుతూ 'పైడి జైరాజ్‌కు వీరాభిమానిని నేను. తన అజరామరమైన నటనతో ప్రేక్షకుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయిన గొప్ప నటుడు. ఆయన 110వ జయంతిని నిర్వహించడం ఆనందంగా ఉంది' అని పేర్కొన్నారు. పైడి జైరాజ్ గొప్ప నటుడు, మానవతా విలువలున్న వ్యక్తి, ఈ జయంతి వేడుకల ద్వారా ఆయన్ని స్మరించుకోవడం, జ్ఞాపకాల్ని పంచుకోవడం సంతోషాన్ని కలిగించిందని పైడి జైరాజ్ మనవరాలు సునీతనాయుడు చెప్పింది. ఈ కార్యక్రమంలో పైడి జైరాజ్ మనవడు ధీరజ్‌నాయుడు, నటుడు రోషం బాలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతీకార నేపథ్యంలో..


విరాట్

'పరిచయం' ఫేమ్ విరాట్ కథానాయకుడిగా ది మాంక్, ఆర్చి ఫిల్మ్ ఇంటర్నేషనల్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కుతున్నది. నితిన్.జి దర్శకత్వం వహిస్తున్నారు. వై.సంతోష్, నిమేశ్ దేశాయ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. నవంబర్‌లో రెగ్యులర్ షూటింగ్ ప్రారంభంకానుంది. సోమవారం హైదరాబాద్‌లో చిత్రబృందం పాత్రికేయుల సమావేశాన్ని ఏర్పాటుచేసింది. దర్శకుడు మాట్లాడుతూ 'ప్రతీకార నేపథ్యంలో సాగే యాక్షన్ డ్రామా చిత్రమిది. ప్రముఖ నటీనటులు ఈ సినిమాలో కీలక పాత్రల్ని పోషించనున్నారు' అని తెలిపారు. హీరో విరాట్ మాట్లాడుతూ ''పరిచయం' తర్వాత నేను హీరోగా నటిస్తున్న చిత్రమిది. నన్ను నమ్మి దర్శకనిర్మాతలు అవకాశం ఇచ్చారు. ఆ నమ్మకాన్ని నిలబెడతాను' అని చెప్పారు. నిర్మాతలు మాట్లాడుతూ 'మా సంస్థ నిర్మిస్తున్న రెండో చిత్రమిది. దర్శకుడు నితిన్ విభిన్నమైన పాయింట్‌తో కథను సిద్ధంచేశారు. త్వరలో చిత్రానికి సంబంధించిన పూర్తి వివరాల్ని వెల్లడిస్తాం' అని పేర్కొన్నారు.

# ఊరి మేలు కోరుతూ..

తేజస్ కంచర్ల, పాయల్‌రాజ్‌పుత్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'ఆర్‌డీఎక్స్ లవ్'. శంకర్‌భాను దర్శకుడు. హ్యాపీ మూవీస్ పతాకంపై సి.కల్యాణ్ నిర్మిస్తున్నారు. ఈ నెల 11న విడుదల చేయబోతున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'ఊరికి ఎదురైన ఓ సమస్యను యుక్తిపరులైన ఓ అమ్మాయి ఎలా పరిష్కరించింది? ఈ క్రమంలో ఆమెకు ఎదురైన క్లిష్ట పరిస్థితులేమిటి? అన్నదే చిత్ర ఇతివృత్తం. పాయల్‌రాజ్‌పుత్ పాత్ర చిత్రణ భిన్న పార్శ్వాలతో సాగుతుంది' అన్నారు. 'ఇటీవల విడుదల చేసిన ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన లభిస్తున్నది. పాయల్‌రాజ్‌పుత్ అందం, అభినయప్రధాన పాత్రలో ఆకట్టుకుంటుంది. ప్రేమ, సెంటిమెంట్, సందేశం..అంశాలతో అన్ని వర్గాలను మెప్పిస్తుంది' అని నిర్మాత తెలిపారు. వి.కె.నరేష్, ఆదిత్యమీనన్, నాగినీడు, తులసి, ఆమని, ముమైత్‌ఖాన్, విద్యుల్లేఖారామన్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: సి.రాంప్రసాద్, సంభాషణలు: పరుశురాం, సంగీతం: రధన్, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: శంకర్‌భాను.


తేజస్, పాయల్‌రాజ్‌పుత్

# విలన్‌గా విజయ్‌సేతుపతి?


విజయ్ సేతుపతి

హీరోగా కెరీర్ బిజీగా ఉన్న తరుణంలో సహాయ పాత్రల్లో నటించడానికి చాలా మంది సుముఖత చూపరు. కానీ తమిళ కథానాయకుడు విజయ్ సేతుపతి మాత్రం అందుకు భిన్నమనే చెప్పాలి. తమిళంలో అగ్రహీరోల్లో ఒకరిగా చెలామణి అవుతూనే మరోవైపు విలక్షణ పాత్రలతో ప్రేక్షకుల్ని అలరిస్తున్నారాయన. విజయ్ హీరోగా లోకేష్ కనకరాజ్ దర్శకత్వంలో ఓ యాక్షన్ ఎంటర్‌టైనర్ చిత్రం తెరకెక్కనున్నది. ఈ సినిమాలో విజయ్ సేతుపతి కీలక పాత్రలో నటించనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. అతడి పాత్ర ఏమిటన్నది మాత్రం వెల్లడించడేలేదు. విజయ్ సేతుపతి ఈ సినిమాలో విలన్‌గా కనిపించబోతున్నట్లు తమిళ వర్గాలు చెబుతున్నాయి. ఈ నెలలోనే ఈ చిత్రం సెట్స్‌పైకిరానున్నది. మాళవికా మోహనన్ కథానాయికగా నటించనున్నది.

